నవతెలంగాణ
వరంగల్, హనుమకొండ, జనగామ
మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి
శనివారం 17 జూన్ 2023

హనుమకొండ పీఎస్ ఎస్‌హెచ్ఓగా కరుణాకర్‌రావు

నవతెలంగాణ- హన్మకొండ



హనుమకొండ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 2007 బ్యాచ్ కు చెందిన కరుణాకర్ రావు మొదట ఎస్సైగా పాత ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పేరూరు, కొనిజర్ల, గుండాల ఎస్సైగా పనిచేసి సిసిఎస్ బూర్గంపాడు పాల్వంచలో పనిచేశాడు. 2017లో ప్రమోషన్‌లో భాగంగా ఇంటెలిజెన్స్ సిఐగా పనిచేసి 2022లో మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో సబ్ ఇన్స్పెక్టర్‌గా పని చేశారు. 14 నెలల తర్వాత సిసిఎస్ మంచిర్యాల నుండి హనుమకొండ ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని అన్నారు. ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఇంతకుముందు పని చేసిన ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ జిసిఐడి విభాగానికి బదిలీ అయ్యారు.

ఆయకట్టు రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-గణపురం



గణపురం మండలం బస్వరాజుపల్లి గ్రామంలో శుక్రవారం ఆయకట్టు రోడ్డు పనులను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రారంభించారు. సొంత ఖర్చులతో దాదాపు 3.5 కిలో మీటర్లు బస్వరాజుపల్లి గ్రామం నుండి దుంపిల్ల గడ్డ వరకు ఆయకట్టు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. రైతులు ఆయకట్ట రోడ్డు వెంట నడవాలంటే ఇబ్బంది పడుతున్నారనే ఉద్దేశంతో తమ సొంత నిధులతో రోడ్డు వేపిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు చెరుకు కుమారస్వామి, నడిపల్లి మధుసూదన్ రావు, తోట మానస శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్ర రెడ్డి, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు పోలుసాని లక్ష్మీనరసింహారావు, నాయకులు మార్త శ్రీను, గండు రమేష్ ఆర్ఎంపీ పీఎంపీ మండలశాఖ అధ్యక్షుడు కూతురు రమణ, జిల్లా నాయకులు దౌడు రమేష్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు వరంగల్‌కు మంత్రి కేటీఆర్ రాక



వరుస పర్యటనలతో అభ్యర్థిత్వాలపై స్పష్టత, అనుచరుల్లో జోష్ ..

నవతెలంగాణ- వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ వరుస పర్యటనలలో భాగంగా సిట్టింగ్ ఎమ్మెల్యేలు వారి అభ్యర్థిత్వాలపై స్పష్టతనివ్వడమే కాకుండా అస్పష్టత తొలగించి, అనుచరుల్లో జోష్ పెంచడానికి అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో బహిరంగసభలు నిర్వహిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. తొలుత వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో జరిగిన బహిరంగసభతో ప్రారంభమైన ఈ పర్యటనల పరంపర కొనసాగుతోంది. ఇదే తరహా పర్యటనలు ఇతర జిల్లాలోనూ జరగడం గమనార్హం. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం హన్మకొండలో జరిగిన బహిరంగసభలో 'దాస్యం'ను 50 వేల మెజార్టీతో గెలిపించాలని ప్రకటించడంతో ఆయన అనుచరుల్లో హర్షాతిరేకం వ్యక్తమైంది. ఈ క్రమంలో ఇదే తరహాలో తమ నియోజకవర్గాల్లో బహిరంగసభలు ఏర్పాటు చేసి అభ్యర్థిత్వాన్ని పక్కా చేసుకొని ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేయాలని సిట్టింగ్‌లు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే వరంగల్ తూర్పు నియోజకవర్గానికి నేడు శనివారం మంత్రి కేటీఆర్ రానున్నారు. రూ.618 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసి బహిరంగసభలో మాట్లాడనున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పటికే మంత్రి కేటీఆర్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని హన్మకొండలో పర్యటించి 'దాస్యం' అభ్యర్థిత్వాన్ని బహిరంగసభలోనే ప్రకటించిన విషయం విదితమే. ఇదే తరహాలో వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని వరంగల్‌లో శనివారం జరిగే బహిరంగసభలో 'నన్నపనేని' అభ్యర్థిత్వం ప్రకటించే అవకాశముంది. ఈ ప్రకటన కోసం పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు, బహిరంగసభను ఏర్పాటు చేసినట్లు తెలుస్తుంది. గత వారం రోజులుగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, సిట్టింగ్ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, కలెక్టర్ పి. ప్రావీణ్య, మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా తదితరులు వరుస సమీక్షాలు నిర్వహించి శనివారం మంత్రి కేటీఆర్ పాల్గొనే కార్యక్రమాలకు అన్ని ఏర్పాట్లను చేశారు.

బహిరంగసభ సక్సెస్ కోసం..

వరంగల్‌లోని ఓ సిటీ మైదానంలో నిర్వహించే బహిరంగసభను విజయవంతం చేయడానికి ఎమ్మెల్యే, పార్టీ శ్రేణులు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. 50 వేల మంది జన సమీకరణ చేసి సభను సక్సెస్ చేయాలని భావిస్తున్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బిఆర్ఎస్‌లో వున్న అనిశ్చితిని తొలగించే క్రమంలో ఈ పర్యటన జరుగుతుంది.

రాజకీయ ప్రాధాన్యత..

వరంగల్ తూర్పు నియోజకవర్గంలో మంత్రి కేటీఆర్ పర్యటనకు రాజకీయ ప్రాధాన్యత వుంది. ఈ నియోజకవర్గంలోనే కీలక నేతలున్నారు. స్థానిక ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ మాత్రమే కాకుండా శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్యతోపాటు గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుండి పోటీ చేసి ఓడిపోయిన ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర వుండడంతో ఈ నియోజకవర్గంలో మంత్రి కేటీఆర్ పర్యటనకు ప్రాధాన్యత లభించింది. తాజాగా వచ్చే శాసనసభ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థిత్వాన్ని మార్చే అవకాశముందని గత నెలరోజులుగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్న విషయం విదితమే. ఈ క్రమంలో ఈ పర్యటన కీలకంగా మారింది. డిప్యూటీ ఛైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, ఎంపి వద్దిరాజు రవిచంద్ర వీరంతా ఎమ్మెల్యే టికెట్‌ను ఆశిస్తున్న నేతలే కావడం గమనార్హం. దీంతో ఈ నియోజకవర్గంలో పార్టీ టికెట్ కోసం పోటీ తీవ్రంగా వుంది. ఇదిలావుంటే ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్‌కు ఈ నేతలతో సఖ్యత లేకపోవడం గమనార్హం. ఇటీవలె ఎమ్మెల్యే నరేందర్ పలువురు నేతలతో వున్న విభేధాలను పక్కన పెట్టి వారితో సయోధ్య కుదుర్చుకుంటున్నట్లు బిఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. స్వపక్షంలో, ప్రతిపక్షంలోని నేతలతో సైతం ఎమ్మెల్యే చర్చలు జరుపుతున్నారని ప్రచారం జరుగుతుంది. ఈ క్రమంలో మంత్రి కేటీఆర్ బహిరంగసభలో 'నన్నపనేని' అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తారని ఆయన ధీమాతో వున్నారు. ఇదే జరిగితే బిఆర్ఎస్‌లోనూ సమీకరణలు మారే అవకాశముందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.



రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

ఈనెల 17, 18 తేదీల్లో జిల్లా కేంద్రంలో జరిగే సీపీఐ(ఎం) రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి బందు సాయిలు కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని శ్రామిక భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్దలకు రాయితీలిస్తూ పేదలపై భారాలు వేస్తున్నదని అన్నారు. మోడీ ప్రధాని అయిన తర్వాత 49 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా చేసి పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా కార్మిక వర్గానికి వ్యతిరేకంగా చట్టాల మార్పు చేసి కార్మికులకు అన్యాయం చేసి రోజుకు 176 రూపాయలు తీసుకోవాలని చెప్పడం అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. వామపక్షాలు యూపీఏ-2లో తెచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడం అన్యాయం అన్నారు. అటవీ హక్కుల చట్టానికి తూట్లు పొడవడం, ఆదివాసీలకు అటవీ మీద హక్కు లేకుండా చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. విమానంలో వాడే ఆయిల్ రేట్లకు ధరలు తగ్గించి సామాన్యులు వాడే రైలు చార్జీలు పెంచడం దారుణం అన్నారు. ఆదివాసీలు దళితులు గిరిజనులు మైనార్టీలకు వెనుకబడ్డ వర్గాలకు మోడీ పాలనలో రక్షణ లేకుండా పోయిందన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తూ మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయటం సరికాదన్నారు. మోడీ సర్కారు ఆర్ఎస్ఎస్ విధానాలను అమలు చేస్తుందన్నారు. డార్విన్ సిద్ధాంతాన్ని పాఠ్యాంశాల నుంచి తొలగిస్తుందని,చరిత్రను వక్రీకరిస్తూ మోడీకి అనుకూలంగా మలుచుకుంటున్నారని అన్నారు. ఒకే దేశం ,ఒకే పాలన, ఒకే భాష అని ప్రజలను ఇబ్బందులు పెట్టే చర్యలకు పూనుకుంటుందన్నారు. మోడీ విధానాల్ని ఎండగడుతూ సకల జనుల రక్షణకై తమ పార్టీ రాజకీయ శిక్షణ తరగతుల ద్వారా కార్యకర్తల్ని సన్నద్ధం చేసి మోడీ విధానాల్ని ప్రజలలో ఎండగడతామని వివరించారు. జిల్లా కేంద్రంలో నేడు, రేపు జరిగే రాజకీయ శిక్షణ తరగతులకు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య, రాష్ట్ర నాయకులు అబ్బాస్, బుర్రి ప్రసాద్ పాల్గొంటున్నారని, విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వెలిశెట్టి రాజయ్య ఎండి రఫీ ,ఏ శ్రీధర్, శ్రీరాములు, ఎండి చిన్న రాజాకు తదితరులు పాల్గొన్నారు.



అక్రమ అరెస్టులు ఖండించండి

సీపీఐ(ఎం) జిల్లా కన్వీనర్ బొట్ల చక్రపాణి

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

హనుమకొండ జిల్లాకు శనివారం కేటీఆర్ పర్యటన చేస్తున్నాడనే నేపథ్యంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షురాలు మీశ్రీన్ సుల్తాన్‌ను శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు సుందరయ్య భవన్ నుంచి ఇంటికి వెళ్తున్న మార్గంలో పోలీసులు కాపు కాచి ముందస్తు అరెస్టు చేయడం సిగ్గుమాలిన చర్య అని, అక్రమ అరెస్టులను ప్రజాస్వామిక వాదులంతా ఖండించాలని సీపీఐ(ఎం) జిల్లా కన్వీనర్ బోట్ల చక్రపాణి పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యలు ప్రజా సమస్యలపై పోరాడుతున్న నాయకులను మంత్రులు వస్తున్నప్పుడల్లా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని కూని చేయడమే అన్నారు. బీఆర్ఎస్ మంత్రులు వచ్చినప్పుడల్లా ప్రజా సమస్యలపై పోరాడుతున్న సీపీఐ(ఎం), పార్టీ అనుబంధ సంఘాల నాయకులను ముందస్తు అక్రమ అరెస్టు చేస్తూ పోలీసులు అతి ఉత్సాహం ప్రదర్శిస్తున్నారని అన్నారు. అరెస్టులు చేయడాన్ని విద్యార్థి యువజన ఉపాధ్యాయ మేధావి ప్రజాస్వామిక వాదులంతా ఐక్యంగా ఖండించాలని పిలుపునిచ్చారు. తక్షణమే అరెస్ట్ చేసిన నాయకులను వదిలి పెట్టకపోతే పార్టీ ఆధ్వర్యంలో



కార్పొరేట్‌కు ధీటుగా

సెయింట్ ఆంటోనీ గ్రూప్ ఆఫ్ స్కూల్స్

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించడమే పాఠశాల లక్ష్యం

పాఠశాల కరస్పాండెంట్ రాజారపు ప్రభుదేవ్

నవతెలంగాణ-ధర్మసాగర్



కార్పొరేట్‌కు ధీటుగా సెయింట్ ఆంటోనీ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ నిర్వహిస్తున్నామని, విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించ డమే తమ పాఠశాల లక్ష్యం అని కరస్పాండెంట్ రాజారపు ప్రభుదేవ్ తెలిపారు. కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా సామాన్యులకు సైతం అతి చేరువలో ఉన్న సెయింట్ ఆంథోనీ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రకటనలో తెలిపారు. ధర్మసాగర్ మండలం లోని కరుణాపురంలో కార్పొరేట్ స్థాయి స్కూల్స్‌తో పాటు ముందుకు దూసుకెళ్తున్న సెయింట్ ఆంటోనీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సీనియర్ ఫ్యాకల్టీచే విద్యాబోధన అందిస్తున్నామన్నారు. డే అండ్ రెసిడెన్షియల్ ఏసీ క్యాంపస్ తో అందుబాటులో ఉందని తెలిపారు. విద్యార్థులకు అత్యాధునికమైన విశ్లేషకుల అధ్యాపకులచే విద్యాబోధన అందిస్తున్నామని అన్నారు. విశాలమైన ఆట స్థలం అహ్లాదమైన వాతావరణంలో బోధన ఉంటుందన్నారు. విద్యార్థుల్లోని సజనాత్మకతను వెలికి తీసి నాణ్యమైన విద్యను అందించి అన్ని రంగాల్లో రాణించే విధంగా తయారు చేసి వారి బంగారు భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే మా పాఠశాల లక్షం అన్నారు. క్రీడారంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రా స్థాయిలో సెలెక్ట్ అయ్యారని ఆటలతో పాటు విద్యార్థులకు కరాటే శిక్షణ కూడా పాఠశాలలో ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలల్లో చదివిన పూర్వ విద్యార్థులు ప్రస్తుతం డాక్టర్లు,ఇంజనీర్లు, ప్రభుత్వ ఉద్యోగాలలో స్థిరపడ్డారని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ రాజారావు అనూష, ప్రిన్సిపల్ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి





తెలంగాణలో బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం కాంగ్రెస్ పార్టీనే..

నాలుగు నెలలు కష్టపడితే భూపాలపల్లిలో ఎగిరేది కాంగ్రెస్ జెండానే..

నియోజకవర్గ ఇన్‌చార్జి గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్ మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-భూపాలపల్లి

రాష్ట్రంలో త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని, మరో నాలుగు నెలలు కష్టపడి పనిచేస్తే భూపాలపల్లిలో ఎగిరేది కాంగ్రెస్ జెండానేనని టిపిసిసి సభ్యులు, భూపాలపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భూపాలపల్లి రూరల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుంకరి రామచంద్రయ్య అధ్యక్షతన అన్ని గ్రామాల ముఖ్య కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా ప్రెసిడెంట్ అయిత ప్రకాష్ రెడ్డితో కలిసి భూపాలపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి గండ్ర సత్యనారాయణరావు హాజరై మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ వచ్చే అన్ని ఎన్నికల్లో గెలిచి అధికారాన్ని కైవసం చేసుకుంటుందని అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం కాంగ్రెస్ పార్టీనేనని, వచ్చే నాలుగు నెలలు కష్టపడితే భూపాలపల్లిలో అత్యధిక మెజారిటీతో ఎగిరేది కాంగ్రెస్ జెండానేనని జీఎస్సార్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టించి పని చేసే వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని అన్నారు. రాష్ట్రంలో కల్వకుంట్ల కుటుంబం మాత్రమే బాగుపడిందన్నారు. ఇచ్చిన హామీలను అమలుపరచడంలో పూర్తిగా విఫలం చెందిందని దుయ్యబట్టారు. అనంతరం భూపాలపల్లి రూరల్ మండల నూతన కాంగ్రెస్ పార్టీ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి రూరల్ అధ్యక్షుడిగా సుంకరి రామచంద్రయ్య, ఉపాధ్యక్షులుగా తోట సంతోష్, సోమిశెట్టి మహేష్, పెరుమాండ్ల రఘు, నలిమెల సదయ్య, పేమాండ్ల సాంబయ్య, పంచనేని సంపత్ రావు, జనరల్ సెక్రటరీలుగా మర్రి కష్ణమూర్తి, బావు రేణుక, కుంట్ల ఉప్పలయ్య, బండి తిరుపతి, అజ్మీరా జయపాల్, పిట్టల పిచ్చయ్య, పల్లవేన శ్యామ్, చెరుకు కుమారస్వామి, దానవేన వెంకటస్వామి, గట్టు మహేందర్ కోశాధికారిగా నరెడ్ల తిరుపతి రెడ్డి,లు ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీ వివిధ అనుబంధ సంఘాల మండల అధ్యక్షులు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా తోట రంజిత్, మండల రైతు కమిటీ అధ్యక్షుడి గా మండల రాజిరెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా చంద్రగిరి సురేష్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా నగావత్ భాస్కర్ నాయక్, మండల బీసీ సెల్ అధ్యక్షుడిగా పైడిపెల్లి వెంకటస్వామి, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సోమిశెట్టి స్రవంతి, మండల మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా - యం.డి బాబా, మండల సోషల్ మీడియా అధ్యక్షుడిగా ఐనాపూర్ సతీష్, మండల ఎస్ఎస్‌యుఐ అధ్యక్షుడిగా ఎలకంటి రాజు, మండల సాంస్కతిక విభాగం అధ్యక్షుడిగా ఉప్పలయ్య ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యులు చల్లూరి మధు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దూడపాక శంకర్, ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ మండల తిరుపతి గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ వెంపటి భువనసుందర్, ఎస్టీ సెల్ జిల్లా ప్రెసిడెంట్ పోరిక సమ్మయ్య నాయక్, ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రెసిడెంట్ బట్టు కరుణాకర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రెసిడెంట్ ఇస్లావత్ దేవన్, పట్టణ కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్, రామినేని రవీందర్, తోట సంతోష్, కొమురయ్య పాల్గొన్నారు.

ధాన్యం దిగుమతిలో రైస్ మిల్లర్ల దోపిడీ...

643 బస్తాలకు 599 బస్తాలకే ట్రక్ షీట్ జారీ

న్యాయం చేయాలని రైతుల వేడుకోలు

నవతెలంగాణ - శాయంపేట

ఆరుగాలం శ్రమించి అప్పులు తెచ్చి పంట సాగు చేసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకెపి కొనుగోలు కేంద్రంలో దాన్యం విక్రయించగా, 643 బస్తాలను ఎగుమతి చేయగా రైస్ మిల్లు యజమాన్యం 599 బస్తాలు దిగుమతి చేసుకున్నట్లు ట్రక్ షీట్ జారీచేసింది. 44 బస్తాల ధాన్యం కోత విధించినట్లు తెలుసుకున్న రైతులు గొల్లుమంటున్నారు. తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని మైలారం గ్రామానికి చెందిన రైతు చల్ల తిరుపతిరెడ్డి, గొర్రె కుమార స్వామి తాము పండించిన వరి ధాన్యాన్ని మండలంలోని పెద్దకోడపాక గ్రామంలో అవంతిక గ్రూపు ఏర్పాటు చేసిన ఐకెపి కొనుగోలు కేంద్రంలో విక్రయించడానికి మే 25న వరి ధాన్యాన్ని తీసుకువెళ్లారు. 28న తూకాలు వేశారు. చల్లా తిరుపతి రెడ్డి కి చెందిన 321 బస్తాలు, గొర్రె కుమార స్వామి 90, మాచర్ల సాంబయ్య 147, మార్క సాంబయ్య 85 బస్తాలు మొత్తంగా 643 బస్తాలను మే 30న రాంపూర్ లోని శ్రీ రామాంజనేయ ఇండస్ట్రీస్ కి తరలించారు. జూన్ 11న ట్రక్ షీట్ రావడంతో రైతులు నిర్ఘాంతపోయారు. 643 బస్తాలకు కేవలం 599 బస్తాలు మాత్రమే ట్రక్ షీట్ లో నమోదు కావడంతో కొనుగోలు కేంద్రం నిర్వాహకురాలు అమ్మ వసంతను రైతులు ప్రశ్నించారు. తనకు కూడా తెలియదని చెప్పడంతో, అందరూ కలిసి రైస్ మిల్లులకు వెళ్లగా బస్తాకు 44 కిలోల తూకం వేస్తున్నామని ఇలాగే ఉంటుందని, ఎక్కడ చెప్పుకుంటారో అక్కడే చెప్పుకోండి అని మిల్లు యజమాన్యం హుకుం జారీ చేసినట్లు రైతులు తెలిపారు. తాము విక్రయించిన వరి ధాన్యం తడవలేదని, తాలు, తేమ లేదని, కేవలం 40 కిలోల 600 గ్రాములు తూకం వేయాల్సి ఉండగా, ఆదనపు తూకం పేరిట 44 బస్తాల ధాన్యం మిల్లర్లు కాజేశారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి రైస్ మిల్లర్ల నుండి 44 బస్తాల ధాన్యం డబ్బులు ఇప్పించి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.



(ఫైల్)

కాటాపూర్‌లో తీరనున్న పేదల సొంతింటి కల

ఇండ్ల పట్టాల పంపిణీకి రంగం సిద్ధం

తాసిల్దార్ ముల్కనూరు శ్రీనివాస్

నవతెలంగాణ -తాడ్వాయి



మండలంలోని కాటాపూర్ గ్రామంలో పేద ప్రజల సొంతింటి కల నెరవేర నుంది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక తాసిల్దార్ ముల్కలు శ్రీనివాస్, ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్ లు స్థానిక సర్పంచ్ పుల్లూరి గౌరమ్మ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించి, గ్రామ సభలో అందరి సమక్షంలో లబ్ధిదారులను సెలెక్ట్ చేశారు. మొత్తం 204 అప్లికేషన్స్ రాగా, ఫైనల్ గా అర్హులైన 105 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా స్థానిక తహసిల్దార్ మాట్లాడుతూ వీటన్నిటిని కలెక్టర్ అప్రూవల్ కొరకు పంపించనున్నట్లు తెలిపారు. వారం రోజుల అనంతరం జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ప్రజా ప్రతినిధులు అధికారుల సహాయ సహకారాలతో వారం రోజుల తర్వాత పేదలకు ఇట్టి స్థలాల పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పుల్లూరి గౌరమ్మ, ఉప సర్పంచ్ మేడిశెట్టి పుష్ప, స్థానిక ఎంపిటిసి మేడిశెట్టి జయమ్మ, మండల కోపరేషన్ మెంబర్ దిలావర్ ఖాన్, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు దుగ్గి చిరంజీవి, పంచాయతీ కార్యదర్శి భాగ్యరాణి, వార్డు మెంబర్లు, జిసిసి డైరెక్టర్ పులుసం పురుషోత్తం, దిడ్డి మోహన్ రావు, మాజీ సర్పంచ్ ముజఫర్ హుస్సేన్, నాయకులు సయ్యద్ హుస్సేన్, రంగు సత్యనారాయణ, బందెల తిరుపతి, ముత్తినేని లక్ష్మయ్య,దానక నర్సింగరావు, మహిళ సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసుకున్న వ్యక్తి మృతి

నవతెలంగాణ-గణపురం

మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ పులి జనార్ధన్ (32) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై అభినవ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మతుడు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసే వాడని ఆర్థిక ఇబ్బందులతో బాధపడే వాడన్నారు. దీంతో మనస్థాపానికి గురై రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగగా చికిత్స నిమిత్తం వరంగల్ తరలించారన్నారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని తెలిపారు.

అప్పుల బాధ తాళలేక మాజీ సర్పంచ్ భర్త ఆత్మహత్య

నవతెలంగాణ-భీమదేవరపల్లి

అప్పుల బాధ తాళలేక మాజీ సర్పంచ్ భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన హనుమకొండ జిల్లా కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపల్లి గ్రామానికి చెందిన రేణిగుంట్ల చంద్రయ్య (46) భార్య భాగ్య గత నాలుగున్నర సంవత్సరాల కిందట గ్రామ సర్పంచ్‌గా చేశారు. మాజీ సర్పంచ్ రేణిగుంట్ల భాగ్య భర్త చంద్రయ్య గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణం కోసం రూ.3లక్షల అప్పులు చేసి భవన నిర్మాణం చేపట్టాడు. అప్పటినుండి బిల్లులు రాలేదు. మరో తొమ్మిది లక్షల రూపాయలు ప్రైవేట్‌గా అప్పులు చేశాడు. గ్రా మపంచాయతీ బిల్లులు రాకపోవడం ప్రవేట్ అప్పులతో తనకున్న 20 గుంటల భూమిని అమ్మాడు.

భూమి అమ్మిన అప్పులు తీరకపోవ డంతో మానసికవేదనంతో శుక్రవారం ఉదయం చెట్టుకు ఉరేసుకొని చంద్రయ్య ఆత్మహత్య చేసుకు న్నాడు. మతుడి కుమారుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ముల్కనూర్ పోలీసులు తెలిపారు.

సామూహిక అక్షరాభ్యాసం



నవతెలంగాణ - ఐనవోలు

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా మండలం లోని రాంనగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం శుక్రవారం నిర్వహించి విద్యార్థులకు దాత సూర్యనారాయణ పలకలు పంపిణీ చేశారు. ఎలాంటి సహాయం కావాలన్నా చేయడానికి సిద్ధం అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవికుమార్, ఉపాధ్యాయులు బాలోజు బ్రహ్మాచారీ,పంచాయతీ సెక్రటరీ రఘురాం ,ఉప సర్పంచ్ సుధాకర్, విద్యార్థుల తల్లిదండ్రులు,గ్రామపెద్దలు కుమార్, స్థానిక అంగన్వాడీ టీచర్ శారద, కారోబార్ రాజు, అయా సరోజన,ఆశ కార్యకర్త సునీత, వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

తోటి మిత్రుల ఆర్థికసాయం

నవతెలంగాణ-భీమదేవరపల్లి

ఇటీవల ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందిన బాల్యమిత్రుడు సుంచు సాగర్ కుటుంబానికి తోటిమిత్రులు రూ.4000 శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొదురుపాక మహేష్ బొల్లంపల్లి చరణ్ రాజ్ రుద్రాక్ష కుమార్ రమణాచారి నాగవల్లి పవిత్ర పుల్ల సురేష్ పాల్గొన్నారు.





రుణాల దరఖాస్తు కోసం అగచాట్లు

నవతెలంగాణ - శాయంపేట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని రూ.లక్ష బీసీ కార్పొరేషన్ రుణాలు 15 రకాల కులవృత్తిదారులకు అందజేస్తామని ప్రకటించింది. ఈనెల 20 లోగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని గడువు విధించింది. దీంతో అర్హులైన యువకులు దరఖాస్తుల కోసం అగచాట్లు పడుతున్నారు. మీసేవ కేంద్రాలలో కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తులు చేసుకోగా, బీసీ కార్పొరేషన్ తో పాటు గురుకుల పాఠశాలలో, కళాశాలలో అడ్మిషన్ పొందే విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తులు చేసుకున్నారు. దీంతో ఒకేసారి వందలాదిగా దరఖాస్తులు రావడం, సర్వర్ సమస్య తలెత్తడంతో ధ్రువీకరణ పత్రాల జారీలో ఆలస్యం అవుతుంది. ధ్రువీకరణ పత్రాల కోసం యువకులు, విద్యార్థులు తహసిల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. విద్యార్థుల, యువకుల పరిస్థితిని అర్థం చేసుకున్న తహసిల్దార్ చలమల్ల రాజు వెంట వెంటనే ధ్రువీకరణ పత్రాలను జారీచేయాలని సిబ్బందిని ఆదేశించారు.

సకాలంలో సర్టిఫికెట్స్ ఇవ్వాలి : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-మహాదేవపూర్

మహాదేవపూర్ మండలంలో చదువు పూర్తి చేసుకుని పై చదువులకు వెళ్లే విద్యార్థుల కులం ఆదాయం సర్టిఫికెట్స్ త్వరితగతిన ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలో తాసిల్దార్ పి మాధవికి వినతిపత్రం అందజేసి వారు మాట్లా డారు. టెన్త్ ఇంటర్ డిగ్రీ పూర్తి చేసుకుని పై చదువులు చదువుకోవడానికి వెళ్లేట సమయంలో విద్యార్థులకు హాస్టల్లో కాలేజీల్లో కులం, ఆదాయం సర్టి ఫికెట్స్ అవసరమని అన్నారు. సర్టిఫికెట్స్ లేక విద్యార్థులను హాస్టల్ నుంచి వెళ్లిపొమ్మనే పరిస్థితులు ఎదురవుతున్నాయని అన్నారు. విద్యార్థులకు సకా లంలో సర్టిఫికెట్స్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజు, మండల నాయకుడు కుమ్మరి రవికృష్ణ పాల్గొన్నారు.



తారురోడ్డు నిర్మాణం సంఘతేంటీ ? : ఎంపీపీ

నవతెలంగాణ-మల్హర్‌రావు

భూపాలపల్లి జిల్లాలోని తాడిచెర్ల, పెద్దపల్లి జిల్లాలోని ఖమ్మంపల్లి మానేరు సరిహద్దులో నిర్మాణము పూర్తి చేసిన బ్రిడ్జి ప్రారంభానికి బిఆర్ఎస్ ప్రజాప్రతినిధుల ఆర్భాటం సరే.. బ్రిడ్జి నుంచి తాడిచెర్ల ఉర చెరువు వరకు తారు రోడ్డు నిర్మాణం సంగతేమిటని అధికారపార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులను మండల ఎంపిపి చింతలపల్లి మల్హర్‌రావు ప్రశ్నించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మానేరు నుంచి ఉర చెరువు వరకు ఉన్న బిట్ రోడ్డును బొగ్గు తవ్వకాల్లో భాగంగా జెన్కో అధికారులు ధ్వంసం చేసిన ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. రోడ్డు ధ్వంసం చేసి బిట్ రోడ్డు వేయకుండా మట్టి రోడ్డు వేయడంతో మండల ప్రజలు తీవ్రమైన ఇబ్బందులకు గురివుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు వేయాలని పలుమార్లు భూపాలపల్లి జిల్లా కలెక్టర్ దృష్టికి సైతం తీసుకపోయిన ఫలితం లేదన్నారు. జెన్కో అధికారులు కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్ చేయడమే కాక ఇందుకు బీఆర్ఎస్ నాయకులు వత్తాసు పలకడం జరుగుతుందని ఆరోపించారు. రోడ్డు ధ్వంసం చేసిన అధికారులు కనీసం ఆర్అండ్‌బీ అధికారులు అనుమతులు సైతం తీసుకోకపోవడమే కాకుండా రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసినటు జెన్కో అధికారులు అసత్యపు వ్యాఖ్యలు చేయడం విడ్డురంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ వొన్న తిరుపతి రావు,కాంగ్రెస్ నాయకులు కేశారపు చెంద్రయ్య, బొబ్బిలి రాజు గౌడ్,పల్లెర్ల మదు,వెంకటేశ్వర్లు,తిర్రి సమ్మయ్య, రాగం రమేష్, బూడిద రాజ సమ్మయ్య,పుప్పాల రాజు, గట్టయ్య పాల్గొన్నారు.

జులైలో ఎస్సీల మరోపోరాటం

నవతెలంగాణ-మల్హర్‌రావు

పాలకుల నిర్లక్ష్యం, మోసం కారణంగానే సామాజిక న్యాయం అయిన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్దతకు నోచుకోలేదని, సామాజిక ఉద్యమ నేత మందకృష్ణ మాదిగ నాయకత్వంలో జూలై లో వర్గీకరణ కై మరో పోరాటానికి ఎస్సీ, ఎస్సీ ఉపకులాలు , సామాజిక ఉద్యమ శ్రేణులు సిద్ధం కావాలని ఎమ్మెస్పీ రాష్ట్ర నాయకులు, మంథని నియోజకవర్గ ఇంచార్జి మంథని సామ్యూల్ మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని కొయ్యూర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్ని మండలాల నాయకత్వం, గోటూవిలేజ్ మిషన్ 25 డేస్ నేటి నుండే అమలు చేయాలని పిలు పునిచ్చారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అధికారి బి, రాజయ్య, మండల అధ్యక్షుడు నరేష్, దామర ముత్తయ్యలక్ష్మీనారాయణ, శనిగరం రమేష్, శనిగరం సురేష్,కనుకుట్ల సమ్మయ్య, కనుకుట్ల శ్రీకాంత్, అడ్డూరి అర్జున్ పాల్గొన్నారు.

గోపాలమిత్ర ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు

నవతెలంగాణ-మహదేవపూర్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పశుగాణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గోపాల మిత్ర గుండాల రాజబాబు రాపెల్లికోట గ్రామ పంచాయతీ ఆవరణలో శుక్రవారం అవగాహన కల్పించారు. సర్పంచి కటవేన రాజక్క సమ్మయ్య పాల్గొని మాట్లాడుతూ కృత్రిమ గర్భధారణ వల్ల మేలు జాతి పశువులు జెన్మిస్తాయని పాడి రైతులు ఇంటిఇంటికి పశువులను పెంచాలని అన్నారు. గోపాల మిత్ర జేఈఓ సరళ మాట్లాడుతూ మేలుజాతి దూడలను అభివృద్ధి చేసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అశిస్టెంట్ శ్రీనివాస్ అంగన్‌వాడీ టీచర్ శ్రీదేవి, స్కూల్ టీచర్ ప్రకాష్, పాడి రైతులు డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు

ఆరే క్షత్రియ సంక్షేమ సంఘం

నవతెలంగాణ - శాయంపేట

విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకోవాలని, విద్యతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని ఆరే క్షత్రియ సంక్షేమ సంఘం జిల్లా ముఖ్య సలహాదారు పేర్వాల లింగమూర్తి అన్నారు. మండల కేంద్రంలో ఆరె క్షత్రియ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రతిభగల విద్యార్థులకు సన్మాన కార్యక్రమం ఆ సంఘం మండల అధ్యక్షులు దుర్గాల రాజు అధ్యక్షతన జరిగింది. ప్రతి ఒక్క విద్యార్థి పాజిటివ్‌గా ఆలోచిస్తూ సంకల్పంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. చదువుకు పేదరికం అడ్డు కాదని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరూ లక్ష సాధన దిశగా ముందుకు సాగాలన్నారు. అనంతరం పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించారు. జిల్లా ముఖ్య సలహాదారులు రాంపిసా మనోహర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వజ్జీరు కిషన్ రావు, మొకిడి మహేందర్ మండల ఉప అధ్యక్షులు మండల ఉపాధ్యక్షులు కుకిడి నాగేశ్వరరావు, మండల గౌరవ అధ్యక్షులు ఇటీకాల పాపారావు, కుల బంధువులు మొకిడే మల్లాజీ, కుకిడి ప్రసాద్, కుసుంబ రాజేందర్ పాల్గొన్నారు.

పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం పటిష్ట చర్యలు

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

ప్రణాళిక బద్ధంగా పట్టణ అభివద్ధి..

ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి





నవతెలంగాణ-భూపాలపల్లి

రాష్ట్రంలో ప్రతి పట్టణం ప్రగతి కాంతులతో కళ కలాడు తున్నాయని, ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పన దిశగా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన పట్టణ ప్రగతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, స్థానిక ఎమ్మెల్యే తో కలిసి పాల్గొన్నారు. తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవంలో భాగంగా పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణిసిద్దు జాతీయ పతాకావిష్కరణ చేశారు. ట్రాక్టర్లు, స్వచ్ఛ ఆటోలతో మున్సిపల్ కార్మికులు సిబ్బంది, మెప్మా , కౌన్సిల్ సభ్యులు, కళాకారులు అంబేద్కర్ చౌరస్తా నుండి మున్సిపల్ కార్యాలయం వద్దకు భారీ ర్యాలీగా తరలి వచ్చారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవ వేడుకలలో జ్యోతి ప్రజ్వలన చేసి భూపాలపల్లి పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను మున్సిపల్ చైర్‌పర్సన్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ పట్టణ ప్రగతి దినోత్సవ వేడుకలు భూపాలపల్లి మున్సిపాలిటిలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూతన పురపాలక చట్టాన్ని తీసుకువచ్చి ప్రభుత్వ సేవలను సులభతరం చేయడం జరిగిందని అన్నారు. దేశంలోనే అత్యుత్తమ పరీక్షలు నిర్వహించే యుపిపిఎస్ ఐఏఎస్ పరీక్షల్లో హైదరాబాద్‌ను 2020 కి గాను ప్రపంచంలోనే అత్యుత్తమ ట్రీ సిటీగా గుర్తించారన్నారు. భూపాలపల్లి ప్రాంతం గ్రామస్థాయి నుండి ప్రస్తుతం మున్సిపాలిటీ, జిల్లాస్థాయి వరకు అభివృద్ధి చెందిందని రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పురోగతి సాధించిందని అన్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ లోని ప్రజా ప్రతినిధులు కౌన్సిలర్లు సిబ్బంది అందరూ టీం వర్క్‌గా ఏర్పడి వార్డుల్లో నిరంతరం సేవలందిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా భూపాల పల్లి పట్టణం శరవేగంగా అభివద్ధి చెందుతుందని అన్నారు. కౌన్సిల్ మెంబర్ లు టీం వర్క్‌గా సేవలు అందిస్తున్నారని తద్వారా పట్టణం అభివద్ధి జరుగుతుందని అన్నారు. మున్సిపాలిటీలలో 10 శాతం గ్రీన్ బడ్జెట్‌కు కేటాయిస్తూ హరిత పట్టణాల సాధన దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. పట్టణాన్ని విద్య, వైద్య ,ఉద్యోగ, ఉపాధి ,శాంతి భద్రతలు, ట్రాఫిక్ వంటి పలు అంశాలలో అభివద్ధి చేసుకోవడం జరుగుతున్నదని అన్నారు. పట్టణ ప్రజలకు ఏదైనా సమస్యలు ఎదురైతే తన దృష్టికి గాని అధికారుల దృష్టికి గాని తీసుకురావాలని సూచించారు. ఆదనపు కలెక్టర్ టిఎస్ దివాకర మాట్లాడుతూ.. ప్రగతి కి అంతం అనేది ఉండదని ఎల్లప్పుడూ ప్రగతి పథంలోనే ఉంటామని, భవిష్యత్ అవసరాల నిమిత్తం అభివృద్ధికి పెట్టుబడుదారులను, ఉద్యోగ, ఉపాధి అవకాశాల ఏర్పాటుకు సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. అనంతరం స్వయం శక్తి మహిళా సంఘాల 15 గ్రూపులకు రూ.కోటి విలువగల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కును అందజేశారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన కార్మికులు, సిబ్బంది, అధికారులు, వార్డు మెంబర్లకు ప్రశంసా పత్రాలు అందించగా, పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ , మున్సిపల్ చైర్పెర్సన్ వెంకట రాణి సిద్దు ,జెడ్పి వైస్ ఛైర్పెర్సన్ కె.శోభ, గ్రంధాలయ సంస్థ చైర్మన్ బి.రమేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ హరిబాబు ,మున్సిపల్ కమిషనర్ అనిల్ కుమార్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గండ్ర హరీష్ రెడ్డి, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-మహదేవపూర్

మహాదేవపూర్ మండల పరిధి కుదురుపల్లి గ్రామానికి చెందిన జి. కిష్టయ్యకు రూ.20000, ఎం పోసమ్మకు రూ.16000, మండల కేంద్రానికి చెందిన ఆర్ సుశీలకు రూ.8500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జక్కు రాకేష్‌తో కలిసి శుక్రవారం మంథని మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జెడ్పీ ఛైర్మన్ పుట్ట మధుకర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండలఅధ్యక్షులు, కాళేశ్వరం దేవస్థానం ఛైర్మన్ లింగంపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ శ్రీపతి బాపు, పిఎసిఎస్ ఛైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి, మంథని నియోజక వర్గం మహిళ ఇన్‌చార్జి కేదారి గీత, సీనియర్ నాయకులు పెండ్యాల మనోహర్, అన్కరి ప్రకాష్, పలిమెల మండల అధ్యక్షులు జవ్వాజి తిరుపతి, నియోజక వర్గం యూత్ ప్రధాన కార్యదర్శి మెరుగు శేఖర్, మండల యూత్ అధ్యక్షులు ఆలిం ఖాన్, ఎస్ సి సెల్ మండల అధ్యక్షులు వేమునూరి జక్కయ్య, మండల సోషల్ మీడియా ఇంఛార్జి దబ్బెట రవీందర్, మండల ఉపాధ్యక్షులు చందు, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు పుట్టినిల్లు హసన్‌పర్తి : కార్పొరేటర్

నవతెలంగాణ-హసన్‌పర్తి

గొప్ప క్రీడాకారులకు పుట్టినిల్లు హసన్‌పర్తి అని కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ అన్నారు. గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తికి చెందిన శీలం రాజర్షి, ఎల్లాపూర్ ఎస్బీఆర్ పాఠశాలకు చెందిన విద్యార్థి హెచ్.కార్తీక్ ఇటీవల జేఎన్ఎస్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలలో అత్యంత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా హసన్‌పర్తిలో ఏర్పాటు చేసిన క్రీడాకారుల అభినందన సభలో కార్పోరేటర్ గురుమూర్తి శివ కుమార్, ఆత్మ హన్మకొండ జిల్లా చైర్మెన్ కందుకూరి చంద్రమోహన్ హాజరై క్రీడాకారులను అభినందించి మాట్లాడారు. ఈ నెల 17, 18వ తేదీలలో హైదరాబాద్ షేక్‌పేట్‌లో జరిగే రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలలో కూడా క్రీడాకారులు ప్రతిభను కనబర్చి జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. అనంతరం కోచ్ ఎస్.నరేంద్రతో పాటు క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం.శివకుమార్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, మండల పార్టీ అధ్యక్షుడు బండి రజనీకుమార్, బాక్సింగ్ అసోసియేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ మంచాల స్వామిచరణ్, లయన్స్ ప్రతినిధి వెలగందుల భీష్మనాథం, సామాజిక కార్యకర్త శీలం యాదగిరి, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు శీలం పృథ్వీరాజ్, బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్.ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దమ్మ నర్సింహరాములు, పెద్దిరాజు, క్రాంతికుమార్, బాలు, ఈసూబ్ తదితరులు పాల్గొన్నారు.

బిక్షాటన వ్యక్తి మృతి

నవతెలంగాణ-మహాదేవపూర్

మహాదేవపూర్ మండలంలోని శ్రీ కాళేశ్వరం ముక్తేశ్వర దేవస్థానం వద్ద భిక్షాటన చేస్తున్న వ్యక్తి శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపినవివరాల ప్రకారం.. కోటపల్లి మండలం రాధారం గ్రామానికి చెందిన రమేష్ కొంతకాలంగా దేవస్థాన వద్ద భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో వడదెబ్బకు చనిపోయి ఉంటారని గ్రామస్తులు పేర్కొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం

నవతెలంగాణ-మహదేవపూర్

మహాదేవపూర్ గ్రామానికి చెందిన కడర్ల నాగరాజ్ ఇటీవల బైకు ప్రమాదానికి గురి కావడంతో తలకు తీవ్రమైన గాయం అయ్యింది. హనుమకొండ లోని చక్రవర్తి ఆస్పటల్‌కు తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు. అతని కుటుంబానికి ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలీ మారుతి, సాంబ రాతి పోషన్న కలసి రూ.10,000 శుక్రవారం ఆర్థిక సాయం చేశారు. వారి వెంట మహాదేవపూర్ మండల్ ఇంచార్జ్ అన్కరి అశోక్, కాటారం ఇన్‌చార్జ్ బొగ్గుల నాగరాజ్ తది తదితరులు పాల్గొన్నారు

రైలు కిందపడి యువకుడి మృతి

నవతెలంగాణ-వరంగల్ డెస్క్

గుర్తుతెలియని రైలు కింద పడి యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం కాజీపేట జీఆర్పి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై చింత పరశురాములు తెలిపిన వివరాల మేరకు జఫర్గడ్ మండలం ఉప్పుగల్లు గ్రామానికి చెందిన కొడారి లోకేష్ 22 శుక్రవారం ఉదయం 7 గంటలకు ముందు నష్కల్ పెండ్యాల రైల్వే స్టేషన్ మధ్య గుర్తుతెలియని రైలు బండి కింద పడి మృతి చెందినట్లు తెలిపారు.మృతుడు వ్యక్తిగత కారణాలు, మరి ఇతర కారణాల వలన రైలు బండి కింద పడి చనిపోయి ఉండొచ్చని తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం చేసి మతుని తల్లిదండ్రులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నా మన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కారించాలి



నవతెలంగాణ-మహదేవపూర్

దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న మధ్యాహ్నం భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మధ్యాహ్న భోజనం కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు కుమ్మరి పద్మ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం పథకంలో సుమారుగా 20ఏళ్ల నుంచి నిర్వహణ చేస్తుంటే ప్రభుత్వం కనీసం కార్మికుల సమస్యలు పరిష్కరించడంలేదని అన్నారు. నెలల తరబడి బిల్లులు, జీతాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన గౌరవ వేతనం రూ.2వేలు కూడా సక్రమంగా ఇవ్వడంలేదని వాపోయారు. ప్రాణాలకు తెగించి తమకున్న పలుకుబడిని ఉపయోగించి సరుకులు తెచ్చి పిల్లలకు వేడివేడి భోజనం వండి పెడు తున్నామని తెలిపారు. ఏడు నెలలుగా రావలసిన బిల్లులు, వేతనాలు రాక ఇబ్బందులేదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత చేసినా తమకు ఏ మాత్రం రక్షణ లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. స్కూల్లో కనీస సదుపాయాలు లేకున్నా వంట చేయాల్సిన పరిస్థితి ఉంతుందని ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు చొరవ తీసుకొని సమస్యలు పరిష్కరించాలని కోరారు. మండల అధ్యక్షురాలు కాల్వపల్లి శారద, ప్రధాన కార్యదర్శి దుర్గం సమ్మక్క ఉన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : పోశాల శ్రీనివాస్

నవతెలంగాణ - హన్మకొండ

ప్రతి వ్యక్తి జీవితంలో యోగ బాగం కావాలని తద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ప్రముఖ యోగా గరువు పొషాల శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం పిలుపుమేరకు 25 రోజుల కౌంట్ డౌన్ కార్యక్రమంలో భాగంగా హనుమకొండ జిల్లా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నక్కల గుట్ట కాకతీయ హరితలో యోగ శిక్షణా తరగతులు జరుగుతున్నాయి. యోగా సాధకులు అందరూ ఆర్కియాలజీ డిపార్ట్మెంట్ సహకారంతో ప్రముఖ చారిత్రాత్మకమైన వేయి స్తంభాల దేవాలయంలో శుక్రవారం యోగా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రముఖ యోగా గురువు పోశాల శ్రీనివాస్ తెలిపారు. జిల్లా జడ్జి సత్యేంద్ర పాల్గొని మాట్లాడుతూ ప్రతి వ్యక్తి యోగ పట్ల అవగాహనను



పెంపొందించుకొని మానసికంగా, శారీరకంగా ఉన్నతంగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జడ్జ్ సత్యేంద్ర గారు జిల్లా కోర్టు సూపర్డెంట్ ఇందిరా, యోగా గురువు శ్రీనివాస్, జయశ్రీ చిరంజీవి, రవీంద్ర చారి, హరి, ప్రసాద్, సంతోష్ పాల్గొన్నారు.

బీసీల ఆశలు అడియాశలయ్యాయి : విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్యసంఘం

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా

తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే బిసి కులాలు ఎంతో అభివద్ధి చెందుతారని ఆశపడటం కానీ నిరాశ మిగిల్చిందని విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు బిక్ష పతి అన్నారు. శుక్రవారం హనంకొండ భీమారంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో కేవలం కేసీఆర్ కుటుంబం తప్ప ఎవరికి లబ్ది చేకూరలదన్నారు. అత్యధికంగా బీసీల జనాభ ఉందని, కానీ బీసీల మధ్య చిచ్చుపెట్టే విధంగా లక్ష రూపాయల రుణాలకు కొంతమంది అర్హులు, మిగతావారు కాదని పేర్కొనడం సరికాదన్నారు. బీసీలందరిని అర్హులుగా గుర్తించా లన్నారు.



సమగ్ర సర్వే ఆధారంగా బీసీలకు లక్ష రూపాయలు ఇవ్వాలని, కాల పరిమితి, వయో పరిమితి లేకుండా కుల వృత్తులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ గ్రేటర్ వరంగల్ ప్రెసిడెంట్ కర్ణ కంటి శ్రీనివాసచారి, తాటికొండ రమణ చారి గ్రేటర్ వరంగల్ జనరల్ సెక్రెటరీ,విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య కార్యవర్గ సభ్యులు బిక్షపతి, భద్రయ్య,పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఏరియా జిఎం బళ్ళారి శ్రీనివాస రావు

నవతెలంగాణ-కోల్‌బెల్ట్

ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ బళ్లారి శ్రీనివాసరావు అన్నారు. కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ ఆదేశానుసారం ఏరియాలోని అన్ని గనులు, డిపార్ట్మెంట్ లలో స్వచ్ఛత పఖ్వాడా నిర్వహించ తలపెట్టగా శుక్రవారం జీఎం కార్యాలయంలో స్వచ్ఛత పఖ్వాడా ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జీఎం శ్రీనివాసరావు అధికారులు సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా, ఇతరులకు కూడా కలిగించి తద్వారా సమాజాన్ని చైతన్యం చేయాలని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని కోరారు. అనంతరం అన్ని గనుల అధికారులతో, డిపార్ట్మెంట్ల ఉన్నత అధికారులతో స్వచ్ఛత పక్వాడ కార్యక్రమం పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గని,



డిపార్ట్మెంట్లో పరిశుభ్రత కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరికి పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం వెంకటయ్య, ఏజెంట్లు వెంకట్రాంరెడ్డి, వెంకటేశ్వరరావు, ఏజీఎంలు జోతి, రామలింగం, ఏరియా అధికార ప్రతినిధి అజ్మీర తుకారం డీజీఎం (పర్సనల్), డీజీఎం రవికుమార్, డివైసిఎంఓ డాక్టర్ పద్మజ, ఎన్విరాన్మెంటల్ అధికారి కష్ణ ప్రసాద్, ఫైనాన్స్ మేనేజర్ సురేఖ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడిగా వెంకటకృష్ణ

నవతెలంగాణ-గోవిందరావుపేట



కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షునిగా పాలడుగు వెంకట కృష్ణ నియమితులయ్యారు. ములుగు జిల్లా కేంద్రంలో పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ ఎమ్మెల్యే సీతక్క వెంకటకష్ణను పార్టీ మండల అధ్యక్షునిగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. శుక్రవారం మండల కేంద్రంలో వెంకటకష్ణ మాట్లాడుతూ పార్టీ అభ్యున్నతికి, పార్టీ ఆదేశాలకు అనుగుణంగా అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు. తనకు బాధ్యతలు అప్పజెప్పేందుకు కృషి చేసిన ములుగు ఎమ్మెల్యే దనసరి సీతక్క, జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, ఎస్‌సిసెల్ మండల అధ్యక్షులు దాసరి సుధాకర్ , మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కొమరం ధనలక్ష్మి, గోవిందరావుపేట పిఎసిఎస్ అధ్యక్షులు పన్నాల ఎల్లారెడ్డి, జిల్లా నాయకులు వంగ రవి యాదవ్ , తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల ప్రభాకర్, ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య సారయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పెండెం శ్రీకాంత్, మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడిగ పార్వతి, జిల్లా నాయకులు కనతల నాగేందర్‌రావు, మండల ఉపాధ్యక్షులు తేళ్ళ హరిప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి వేల్పుగొండ పూర్ణ, ఎంపీటీసీలు గుండెబోయిన నాగలక్ష్మి - అనిల్ యాదవ్, చాపల ఉమాదేవి - నరేందర్ రెడ్డి, గోపిదాసు ఏడుకొండలు,తదితరులు పాల్గొన్నారు.



భర్త వేధిస్తున్నాడని...

నేషనల్ హ్యూమన్ రైట్స్‌కి మహిళ ఫిర్యాదు

నవతెలంగాణ-మల్హర్‌రావు

తన భర్త కాపురానికి తీసుకెళ్లడం లేదని తరుచూ వరకట్న వేధింపులకు గురి చేస్తున్నాడని మండల కేంద్రమైన తాడిచెర్ల గ్రామానికి చెందిన మాచర్ల నిహారిక తన తండ్రి పూజారి నరసింహ స్వామి తో కలిసి శుక్రవారం నేషనల్ హ్యూమన్ రైట్స్ (ఎన్ హెచ్ ఆర్సీ)కి పిర్యాదు చేసింది. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. తాడిచెర్ల గ్రామానికి చెందిన మాచర్ల సంతోష్‌కు భూపాలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన నిహారికతో 2020 లో వివాహం జరిగిందని, మొదటి 7నెలలు బాగానే ఉన్నామని తనుగర్భిణి కావడంతో పుట్టింటికి పంపించాడని అన్నారు. అనంతరం బాబు జన్మించాడని తెలిపింది. మూడు సంవత్సరాలు అయినా కాపురానికి తీసుకెళ్లడం లేదని పలుమార్లు పెద్దమనుషులు సమక్షంలో పంచాయతీ పెట్టుకున్న ఫలితం లేకుండా పోయిందని కన్నీరు మున్నీరైంది. హైదరాబాద్ లో న్యాయవాది వత్తి కొనసాగిస్తున్న సంతోష్ పలుమార్లు అనుమానం తో దుషిస్తూ, బాబు నాకు పుట్టలేదని హింసిస్తు కాపురానికి తీసుకెళ్లడం లేదని చెప్పారు. వరకట్న వేధింపులకు గురిచేస్తున్నట్లు తెలిపింది. తనకు, తనబిడ్డకు న్యాయం చేయాలనివేడుకుంది. ఎస్‌హెచ్ ఆర్సీ జిల్లా అధ్యక్షులు సబావత్ నాగరాజు, ప్రధాన కార్యదర్శి వంగ కుమార స్వామి, ఉపాధ్యక్షులు ముడితనపెల్లి ప్రభాకర్, మల్హార్ మండల అధ్యక్షులు చింతల కుమార్ యాదవ్, ఉపాధ్యక్షులు బండి సుధాకర్, ఘణపురం మండల అధ్యక్షులు రమణ పాల్గొన్నారు.



అంగన్ వాడీ బడిబాట

నవతెలంగాణ-మల్హర్‌రావు

బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెద్దతూండ్ల గ్రామంలో అంగన్‌వాడీల మండల సూపర్ వైజర్ సరస్వతి ఆధ్వర్యంలో శుక్రవారం బడిబాట, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు సర్పంచ్ విజయ అధ్యక్షత నిర్వహించారు. మహాదేవ్ పూర్ సిడిపిఓ రాధిక హాజరై అంగన్ వాడి టీచర్లు, ఆయాలు, చిన్నారులతో వాడవడకు ర్యాలీలు నిర్వహించారు. మూడు సంవత్సరాలు దాటిన చిన్నారులను అంగన్ వాడి కేంద్రాల్లో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడి టీచర్లు, ఆయాలు, పాల్గొన్నారు.

పాఠశాలకు స్మార్ట్ టీవీ బహూకరణ



నవతెలంగాణ-బచ్చన్నపేట

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే క్రమంలో స్మార్ట్ టీవీల ద్వారా వివిధ అంశాలను బోధించడానికి దోహదపడతాయని ఉద్దేశంతో బహుకరించడం జరిగిందని ప్రధాన ఉపాధ్యాయులు కృష్ణమోహన్ అన్నారు. శుక్రవారం మండలంలోని మన్సాన్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు కృష్ణమోహన్, ఎస్ఏ మాథ్స్, జెడ్పిహెచ్ఎస్ కొన్నె స్మార్ట్ టీవీని బహుకరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన పాధ్యాయులు రాములు, కాంప్లెక్స్ హెచ్ఎం సతీష్, సర్పంచ్ తార శ్రీధర్, ఎస్ఎంసీ చైర్మెన్ శ్రీనివాస్ ఉపాధ్యాయులు రోజ, అంగన్వాడీ టీచర్ ప్రమీల, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నదాన సత్రం ఎత్తివేత - లక్షల రూపాయలు నీళ్లపాలు

నవతెలంగాణ-నర్సింహులపేట

మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆర్యవైశ్య నిత్య అన్నదాన సత్రం గత కొన్ని రోజులు నడిపించి మళ్లీ సత్రం ఎత్తివేసారని మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి శనివారం ఆర్యవైశ్య సత్రంలో నిత్య అన్నదాన సత్రం వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఆర్యవైశ్యులకు భోజనం వసతి కల్పించారు. కానీ మళ్లీ కొంత మంది ఆర్యవైశ్యుల స్వార్థంతో అన్న దాన సత్రం గత నెల రోజుల నుంచి తీయడం లేదు పలు గ్రామాలలో డివిజన్‌లో ఆర్యవైశ్యుల దగ్గర కొన్ని లక్షల రూపాయలు వసూలు చేసి ఆ డబ్బులు ఏం చేశారు..? ఎవరికి తెలియదని సత్రం ట్రస్ట్ నెంబర్లు పలు విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఆర్యవైశ్య నాయకులు స్పందించి సత్రం మళ్లీ నడిపించాలని మండల ఆర్యవైశ్య సోదరులు కోరుతున్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్



అకాల వర్షాలకు ఆరుగాలం కష్టపడ్డ రైతులకు విపరీతమైన నష్టం జరిగిందని, ఆపద కాలంలో ఉన్న రైతులను ఆదుకోవడంలో టిఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని పీసీసీ సభ్యులు, మాజీ శాసనసభ్యులు కొమ్మూరి ప్రతాపరెడ్డి ఆరోపించారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకవైపు అకాలవర్షాలు,మరోవైపు ఆరుగాలంకష్టపడి రైతులు పండించిన పంటలు కొనుగోలు చేసిన ప్రభుత్వం వారికి డబ్బులు చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. అకాల వర్షానికి గురై నష్టపోయిన రైతులు పరిహారం కోసం దాదాపు రెండు నెలల నుండి ఎదురుచూస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, రైతులకు నేనే పెద్ద మేలు చేస్తున్న అన్న పెద్ద రైతు కేసీఆర్ మరి రాష్ట్రంలో రైతులు సీజన్ ప్రారంభమై పెట్టుబడి కోసం ఎదురు చూస్తుంటే రైతులకు రైతుబంధు వేయడంలో సీఎం కేసీఆర్‌కు రైతుల పట్ల చిత్త శుద్ధి లేదన్నారు. లక్షలాది ఎకరాల్లో వడగళ్ల వాన వల్ల నష్టపోయిన రైతులు ఐకెపి సెంటర్లలో అమ్మిన ధాన్యానికి డబ్బులు చెల్లించడంలో ప్రభుత్వం విఫలమవుతుందన్నారు. రాష్ట్రంలో సబ్బండ వర్గాలు, విద్యార్థుల,ఉద్యోగులు, మేధావులు ముఖ్యంగా కాంగ్రెస్ చేసిన కృషితో వచ్చిన తెలంగాణ ఫలాలు రాష్ట్ర ప్రజలకు అందించడంలో విఫలమై కోట్ల రూపాయల దుర్వినియోగంతో ఈరోజు దశాబ్ది ఉత్సవాలకు టిఆర్ఎస్ నాయకులు అధికారులు ప్రజల వ్యాపారస్తులపై మూకుమ్మడి దాడి చేసి అక్రమ వసూలు చేస్తున్నారన్నారు. దశాబ్ది ఉత్సవాల పేరుతో శతాబ్ది వరకు సరిపోయేంత అక్రమ సంపాదన కేసీఆర్ కుటుంబం రాబందుల్లా దోచుకుంటుందన్నారు. ముఖ్యమంత్రి స్పందించి రైతాంగానికి రావలసిన డబ్బులను చెల్లించి తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతుల సంక్షేమం కోసం వారి తరపున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జిల్లాల సిద్దారెడ్డి,లింగాలనర్సిరెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు శివరాజ్ యాదవ్, జనగామ పట్టణ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోటి శ్రీనివాస్, సిద్దిరాములు, పిట్టల సతీష్, ఆకుల లక్ష్మయ్య, బండారు శ్రీనివాస్, జాయ మల్లేష్, కోటా నాయక్, దాసరి క్రాంతి, హరిశ్చంద్ర, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆన్లైన్ క్విజ్ పోస్టర్ విడుదల

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్



టీపీసీసీ మాజీ అధ్యక్షులు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో యూత్ ఆన్లైన్ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనగామ నియోజకవర్గ పీసీసీ కో-ఆర్డినేటర్ కోట్ల శ్రీనివాస్‌మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ యువత కొరకు ఏఐసీసీ నాయకురాలు ప్రియాంక గాంధీ ఆధ్వర్యంలో యూత్ నిరుద్యోగ డిక్లరేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. ఈ డిక్లరేషన్‌ను జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు గడపగడపకు తీసుకువెళ్లాలని కోరారు. యువతీ యువకులు ప్రతి గ్రామంలో రాజీవ్ గాంధీ ఆన్లైన్‌లో క్విజ్ పోటీల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని, పరీక్షల్లో నైపుణ్యతను పరీక్షించుకోవాలని, గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, జనగామ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాసంపల్లి లింగాజీ, మద్దూరు జెడ్పిటిసి కొండల్ రెడ్డి, జనగామ పట్టణ పార్టీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, మహిళా జిల్లా అధ్యక్షురాలు బడికి ఇందిరా కృష్ణస్వామి, చేర్యాల మండల అధ్యక్షులు ఆది శీను, కొమరవెల్లి మండలాధ్యక్షుడు గురవయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వాంగ సుందరంగా జనగామ పట్టణం

ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి

నవతెలంగాణ-జనగామ




జనగామ పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జనగామ పట్టణంలోని వైష్ణవి గార్డెన్లో తెలంగాణ ప్రగతి దినోత్సవం జనగామ పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డిసిపి సీతారామ్, పురపాలక సంఘం చైర్మన్ పోకల జమున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాల్లో పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందని, ప్రభుత్వం పట్టణ, గ్రామాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తూ మౌలిక వసతులు కల్పిస్తుందని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చిన్న పురపాలక సంఘాలను ఏర్పాటు చేసి సేవలను వేగవంతం చేస్తుందని, జనగామ పట్టణంలో 10 ఎకరాల స్థలంలో స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. జనగామ పట్టణంలో ఏడు కోట్ల 50 లక్షల బ్యాంకు లింకేజీలు స్వయం సహాయక బృందాలకు, 63 లక్షల బ్యాంకు రుణాలు వీధి వ్యాపారులకు చెక్కు అందజేశారు. మున్సిపల్ కార్యాలయంలో జాతీయ జెండా ఎగరవేసి ర్యాలీగా మున్సిపల్ సిబ్బందితో కలిసి వైష్ణవి గార్డెన్‌కు వెళ్లారు. ఉత్తమ సేవలు అందించిన మున్సిపల్ కార్మికులను సన్మానించారు.మున్సిపల్ ప్రగతి నివేదికపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఈ చంద్రమౌళి, వైస్ చైర్మన్ రాంప్రసాద్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నవతెలంగాణ-తొర్రూర్

ఆర్టీసీలో సురక్షితమైన, భద్రతతో కూడిన ప్రయాణం అందిస్తుందని, ఆర్టీసీ సేవలను ఇంకా మెరుగుపరచుటకై ప్రయాణికుల యొక్క సలహాలు, సూచనలు తెలుసుకొనుటకు తొర్రూర్ డిపోలో ఈనెల17న డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ కే.పరిమళ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుండి 11 గంటల వరకు డిపో మేనేజర్‌తో ఫోన్ ద్వారా అందుబాటులో ఉంటారని, ప్రజలు, ప్రజా ప్రతినిధులు తమ సలహాలు సూచనలు ఈ 9959226053 నెంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు.

మాజీ ఎంపీడీవో కిడ్నాప్



నవతెలంగాణ-బచ్చన్నపేట

మండలంలోని పోచన్నపేట గ్రామానికి చెందిన మాజీ ఎంపీడీవో నల్ల రామకృష్ణయ్యను గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసినట్లు ఎస్సై నవీన్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన కుమారుడు నల్ల అశోక్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారన్నారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గురువారం సాయంత్రం బచ్చన్నపేటలో ఉన్న రామకృష్ణయ్యనుఎవరో గుర్తుతెలియ వ్యక్తులు కార్‌లో కిడ్నాప్ చేసినట్లు, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్థిక సహాయ దరఖాస్తుల గడువును పెంచాలి

రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి

నవతెలంగాణ-తొర్రూరు



బీసీ కులాలలోని వెనుకబడిన తరగతుల కులవృత్తులు, చేతివృత్తుల వారికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించే దరఖాస్తు గడువును మరో15 రోజులు పెంచాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ పున్నం సారయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రజక వృత్తిదారుల సంఘం తొర్రూరు మండల కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా పున్నం సారయ్య మాట్లాడుతూ లక్ష రూపాయల ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేయడం కోసం మీసేవ కేంద్రాలకు వెళితే సర్వర్ డౌన్, ఇతర కారణాలవల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి దరఖాస్తు కోసం మరింత గడువు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం మండల అధ్యక్షుడు నిమ్మల సోమయ్య, కార్యదర్శి పొడగంటి శేఖర్, నాయకులు రమేష్, సాగర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

తొర్రూరు రూపురేఖలు మారాయ్

మీ రుణం తీర్చుకోవడమే లక్ష్యంగా పని చేస్తున్నాను, నేను ఎవరికీ ద్రోహం చేయలేదు - మంత్రి దయాకర్ రావు

నవతెలంగాణ-తొర్రూరు



కేసీఆర్, కేటీఆర్‌ల విజన్, అద్భుతమైన ఆచరణతో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి విస్తృతంగా జరుగుతున్నదని అందులో భాగంగా తొర్రూరు పట్టణాభివృద్ధి పరుగులు పెడుతున్నదని, మున్సిపాలిటీ సమున్నత అభివృద్ధికి, సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తున్నామని, మున్సిపాలిటీ అయినకొన్నేండ్లలోనే తొర్రూరు రూపురేఖలు మారాయని, రూ. 120 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పేర్కొన్నారు. తెలంగాణ అవతరణలో భాగంగా పట్టణ ప్రగతి ఉత్సవాల సందర్భంగా తొర్రూరు పట్టణంలో నిర్వహించిన పట్టణ ప్రగతి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రూ.27 కోట్లతో పట్టణంలో త్వరలో ఇంటింటికీ 24 గంటలపాటు మంచినీరు అందిస్తున్నామని, ఇప్పటికే వార్డుకు కోటి రూపాయలతో ప్రగతి పనులు జరుగుతున్నాయని తెలిపారు. 14 కోట్లతో వర్షపు నీటిని వడిసిపట్టే ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నామని, రెండు కోట్లతో దోబీ ఘాట్‌లు నిర్మాణం వంటి అభివృద్ధి పనులతో తొర్రూరుపట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నామని, మినీ ట్యాంక్ బండ్‌గా తొర్రూరు పెద్ద చెరువును అభివృద్ధి చేయనున్నామన్నారు. అన్ని హంగులతో అద్భుతంగా ఆడిటోరియం, యతి రాజారావు పార్క్‌ను ఏర్పాటు చేశానని అన్నారు. మరో 5 కోట్లతో అంబేద్కర్ భవన్, బుడగ జంగాల భవన్ కమ్యూనిటీ హాల్స్‌ను నిర్మిస్తున్నామని, రాష్ట్రంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణం తొర్రూరు అని,కష్ట కాలంలో నన్ను ఆదుకున్నారు మీ రుణం తీర్చుకోవడమే లక్ష్యంగా పని చేస్తున్నాను అని మంత్రి ఎర్రబెల్లి చెప్పారు. తెలంగాణ అవతరణ వేడుకల్లో భాగంగా తెలంగాణ పట్టణ ప్రగతి ఉత్సవాల సందర్భంగా తొర్రూరు పట్టణంలో నిర్వహించిన భారీ ర్యాలీ, కుట్టు మిషన్ల పంపిణీ, సఫాయి కార్మికులు, సిబ్బంది, అధికారులకు సన్మానం చేశారు. ముందుగా బస్‌స్టాండ్‌నుండి నిర్వహించిన భారీర్యాలీలో పట్టణ మున్సిపాలిటీ ట్రాక్టర్ నడుపుతూ మంత్రి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం పట్టణంలో రెండో విడత కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. తొర్రూరులో అనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ కు ప్రారంభోత్సవం చేశారు. బస్తీ దవాఖానా భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. స్మశాన వాటికలో లయన్స్ క్లబ్ అధ్వర్యంలో రేవూరి సోమయ్య స్మరకార్థం ఏర్పాటు చేసిన గదికి ప్రారంభోత్సవం చేశారు.

నేను ఎవరికీ ద్రోహం చేయలేదు...

నేను నా జీవితంలో ఎవరికి ద్రోహం చేయలేదు. నాకు ద్రోహం చేసిన వాళ్లకు కూడా ఇబ్బందులు పెట్టలేదు. భూ కబ్జాలకు పాల్పడ లేదు. నన్ను ఎన్నుకున్న ప్రజలకు చెడ్డ పేరు తేలేదు. తేనుఅని ఉద్వేగంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పేర్కొన్నారు. అనంతరం మహబూబాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, తెలంగాణ వచ్చాక నూతన మున్సిపాలిటీ చట్టం వచ్చిందని, ఇది దేశంలోనే ఉత్తమ చట్టమని, పరిపాలనా సౌలభ్యం కోసం జిల్లాలు, మండలాలు, గ్రామ పంచాయతీల ఏర్పాటు జరిగిందన్నారు. పరిపాలన ప్రజలకు చేరువైందని, కేంద్రం మన చట్టాలని అభినందిస్తున్నారు. అత్యంత వేగంగా తొర్రూరు అభివృద్ధి జరుగుతున్నదని, తొర్రూరు మున్సిపాలిటీ దేశంలో ఒకప్పుడు 110వ స్థానంలో ఉండేదని ఇప్పుడు 31వ స్థానానికి చేరుకుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, పట్టణ ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు

నవతెలంగాణ-జనగామ



జిల్లాలోని బచ్చన్నపేట మండలం చిన్నరాంచర్ల రెవెన్యూ సర్వే నెంబర్ 174 లో ప్రభుత్వ భూమి విస్తీర్ణం 8 ఎకరాల 23 గుంటల భూమిని ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు డిమాండ్ చేశారు. స్టేటస్ కో ఆర్డర్ పేరుతో భూకబ్జాదారులు అక్రమంగా ఆక్రమించుకున్న భూమిని స్వాధీనం చేసుకోవాలని సీపీఎం జనగామ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో జిల్లా అదనపు రెవెన్యూ కలెక్టర్ రోహిత్ సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు మాట్లాడుతూ జిల్లాలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను ప్రభుత్వమే కాపాడాలని కోరారు. ప్రభుత్వ అధికారులు స్పందించి ఈ భూమి ప్రభుత్వానిది అని హెచ్చరిక బోర్డులు రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేశారని కానీ భూమిని మాత్రం స్వాధీనం చేసుకోకుండా భూకబ్జాదారులైన బచ్చన్నపేట జడ్పిటిసి జడ్పీ వైస్ చైర్మన్ భర్త గిరబోయిన అంజయ్య తన రాజకీయ పలుకుబడితో ఈ భూమిని ఆక్రమించుకొని సాగు చేస్తున్నారని తెలిపారు. ఇట్టి భూమి విషయంలో గత ప్రభుత్వం గిరబోయిన అంజయ్యకు భూమి అసైన్డ్ చేయలేదని గతంలో కొంతమంది పేద రైతులకు అసైన్డ్ చేయగా వారి నుండి ప్రభుత్వం ఫారం-1, ఫారం-2, స్వాధీనం చేసుకుందనికానీ తప్పుడు పద్దతులలో గిరబోయిన అంజయ్య, ఇతరులు భూమిని ఆక్రమంచుకొని సాగు చేసుకుంటున్నారు అన్నారు. ఈ భూమి విషయంలో ఆర్డీవో కోర్టులో భూకబ్జాదారులు అసైన్డ్ పట్టా చేయాలని దరఖాస్తు చేసుకోగా వీరి దరఖాస్తులను రద్దు చేశారని,అదేవిధంగా ఈ భూమి ప్రభుత్వ భూమి అని ఆర్డీవో కోర్టు తేల్చిందన్నారు. ఈ భూమికి సంబంధంలేని భూ కబ్జాదారులు తప్పుడు పద్ధతుల్లో స్టేటస్ కోఆర్డర్ తెచ్చుకున్నారని, కావున జెసి కోర్టులో పెండింగ్లో ఉన్నటువంటి ఈ భూమి సమస్యను తక్షణమే పరిష్కారం చేసి ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. భూకబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు భూక్య చందు నాయక్, బెల్లంకొండ వెంకటేష్, పార్టీ నాయకులు దూసరి నాగరాజు అజ్మీర సురేష్ నాయక్ తేజావత్ గణేష్ నాయక్, పర్వతం నరసింహులు, పర్వతం యాదగిరి, కడకంచి బాలరాజు, తూర్పాటి యాదగిరి, కడకంచి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వైన్ షాపులలో అధిక ధరలకు మద్యం విక్రయాలు

సీపీఎం పార్టీ రైతు కూలీ సంఘం అధ్యక్షులు సోమిరెడ్డి

నవతెలంగాణ-నర్సింహులపేట



నర్సింహులపేట మండల పరిధిలోని 22 గ్రామపంచాయతీలలో సుమారు 130 నుంచి 140 బెల్ట్ షాపులు నిర్వహిస్తు గ్రామాల్లో మద్యం ఏరులై పారుతున్న సంబంధిత అధికారులు మాముళ్ళ మత్తులో కన్నెత్తి చూడటం లేదని సీపీఎం రైతు కూలీ సంఘం మండల అధ్యక్షులు ఏనుగండ్ల సోమిరెడ్డి, సీపీఎం జిల్లా సభ్యులు గునుగంటి మోహన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఊరూరా బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకు రావడం వలన మద్యం పల్లెల్లో పచ్చని సంసారాల్లో చిచ్చుపెడుతుందని, యువత మద్యం సేవిస్తూ పెడదారిన పడుతున్నారు. నర్సింహులపేట మండల కేంద్రంలో రెండు వైన్ షాపుల యజమానులు సిండికేటుగా ఏర్పడి ఎక్సైజ్, పోలీసు అధికారులకు ముడుపులిస్తూ న్యూ శబరి వైన్ షాపును హెూల్ సేల్ షాపుగా మార్చి ఎంఆర్పీ పై ఏ బ్రాండెడ్ మద్యం అయినా క్వార్టర్‌కు 15 రూపాయలు, ఫుల్‌బాటిల్ పై 60 రూపాయలు, ఒక బీరు పై 15 రూపాయలు నిబంధనలకు అధిక ధరలకు విక్రయిస్తు రిటైల్‌గా కొనే మద్యం ప్రియులకు బ్రాండెడ్ మద్యం లేదని, ఇదేంటని ప్రశ్నిస్తే ఇష్టం ఉంటె కొనండి లేకపోతే వెల్లండని ఘాటుగా సమాధానం చెపుతున్నారు. ఎన్నిసార్లు ఎక్సైజ్, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని సీపీఎం పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. మద్యం ప్రియులు మండల ప్రజలు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రాండ్ షాపులో ఎంఆర్పి రేట్లతో అమ్మాలని సీపీఎం పార్టీ డిమాండ్ చేస్తుంది. లేనియెడల కలెక్టర్ ఫిర్యాదు చేస్తామని పార్టీ నాయకులు హెచ్చరించారు.

ఆటో బోల్తా - వృద్ధురాలు మృతి, ఏడుగురికి గాయాలు

నవతెలంగాణ-కొత్తగూడ



ఆటో బోల్తా పడి ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలోని గుండంపల్లి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లా నర్సంపేట మండలంలోని మాదన్నపేట గ్రామానికి చెందిన పెండ్యాల బుచ్చమ్మ (70) భర్త ముత్తయ్య తమ కుటుంబ సభ్యులతో కలిసి మండలంలోని పోగుళ్లపల్లి గ్రామానికి శుభకార్యం నిమిత్తం వస్తుండగా మార్గమధ్యలో గుండంపల్లి గ్రామ సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందిందన్నారు. ఏడుగురికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం నర్సంపేట ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కొడుకు పెండ్యాల నరసయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నగేష్ తెలిపారు.

గడ్డివాము దగ్ధం

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

మండలంలోని శివునిపల్లి గ్రామంలో గడ్డివాము దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం ఉదయం తోట పుల్లయ్య అనే రైతు 4ఎకరాల పైగా గడ్డి వాము నిప్పంటుకుని ప్రమాదవశాత్తూ దగ్ధమైంది. పక్క పొలంలో వరి కొయ్యలకు నిప్పటించగా ఈదురుగాలికి పక్కనే ఉన్నగడ్డి వాము వైపుగా మంటలు వ్యాపించడంతో గడ్డికినిప్పు అంటుకుంది. పక్క రైతుల సాయంతో మంటలు ఆర్పడానికి ప్రయత్నించినా అదుపులోకి రాలేదు. ఈ ప్రమాదంలో రూ.30వేల విలువైన గడ్డి దగ్ధమైందని, ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.





మానుకోట శ్రీ చైతన్యలో అద్భుతమైన ఫలితాలు

ప్రిన్సిపాల్ దాసరి మధు

నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో ప్రతి ఏటా ఎస్ఎస్సీలో అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దాసరి మధు తెలిపారు. నవతెలంగాణకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. మహబూబాబాద్ పట్టణంలో శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను నర్సరీ నుంచి పదవ తరగతి వరకు అందిస్తున్నట్లు తెలిపారు. అధునాతనమైన స్కూల్ విశాలమైన భవనాలలో అనుభవజ్ఞులు, అంకితభావం కలిగిన అధ్యాపకులతోబోధనచేయిస్తున్నట్లు తెలిపారు.పూర్తిస్థాయిలో స్కూల్ విద్య నుండే ఐఐటీ జేఈఈ మెడికల్ సివిల్స్‌లో ర్యాంకులు సాధించేందుకు బోధన అందిస్తున్నట్లు తెలిపారు.సి బ్యాచ్, ఐపీఎల్ బ్యాచ్,ఎస్‌బ్యాచ్ విద్యార్థులకు వారి విజ్ఞానా నికి అనుగుణంగా అభిరుచి లక్ష్యాలకు అనుగుణంగా తీర్చిదిద్దానున్నట్లు తెలిపారు. ఎస్ఎస్సిలో 100% ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. పాఠశాల ఆవరణలో పూర్తి స్థాయిలో స్వచ్ఛమైన త్రాగునీరు, చల్లనిగాలి, పరిశుభ్రమైన టాయిలెట్స్, వాష్ రూమ్‌లు ఉన్నట్లు తెలిపారు.ప్రధానంగా భవిష్యత్తుల విద్యార్థులకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందించేందుకు నూతన విద్యాబోధన డిజిటల్ అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల మనోవికాసానికి అనుగుణంగా వారి వారి విజ్ఞాన సముదాయాలకు అనుగుణంగా విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు రాష్ట్ర జాతీయ స్థాయి ఒలంపియాడ్ పోటీ పరీక్షలలో అత్యంత ఫలితాలు సాధిస్తున్నట్లు తెలిపారు.

మాంటిస్సోరిలో మహోన్నతమైన ఫలితాలు

ప్రిన్సిపాల్ దేవ సాయి

నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన మహెూన్నతమైన విద్యను అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దేవ సాయి తెలిపారు. పాఠశాల ప్రారంభం సందర్భంగా నవతెలంగాణకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. మహబూబాబాద్‌లో 2002లో స్థాపించిన మాంటిసోరి పాఠశాల కేరళ యాజమాన్యంతో నిబద్ధత అంకిత భావం కలిగిన ఉపాధ్యాయ బృందంతో విద్య బోధన చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఎస్ఎస్సి ఫలితాలు 100% ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. పాఠశాల చెందిన చెందిన ఎండి నజియా, కె.స్ఫూర్తి 9.8 గ్రేడ్ సాధించినట్లు తెలిపారు. మరో నలుగురు విద్యార్థులు 9.5 గ్రేడ్ సాధించినట్లు తెలిపారు. గత 13 సంవత్సరాలుగా తమ పాఠశాలలో వరుసగా 100% ఎస్ఎస్సిలో ఉత్తీర్ణత సాధిస్తున్నట్లు తెలిపారు.తమ పాఠశాలకు చెందిన ఐదుగురు పూర్వ విద్యార్థులు ప్రతిష్టాత్మకమైన ఐఐటి కళాశాలలోచదువు పూర్తి చేశారని మరో ఎనిమిది మంది ఐఐటి కళాశాలలో చదువుతున్నారని అన్నారు. ఐదుగురు విద్యార్థులు ఎన్ఐటిలో విద్యా వ్యాసం పూర్తి చేయగా మరో ఆరుగురు ఎన్ఐటిలో విద్యాభ్యాసం ప్రస్తుతం చేస్తున్నారని తెలిపారు. తమ పాఠశాలకు చెందిన ఐదుగురు పూర్వ విద్యార్థులు వైద్యులుగా పనిచేస్తున్నారని మరో 9 మంది వివిధ వైద్య కళాశాలలో చదువుతున్నారని తెలిపారు. అనేకమంది పూర విద్యార్థులు విదేశాల్లో విద్యాభ్యాసం చేస్తున్నారని ఉన్నత ఉద్యోగాలలో ఉన్నారని తెలిపారు. విద్యార్థులకు బస్సు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు అందమైన విశాలమైన భవనంతో పాటు మైదానం ఆటస్థలం కాలుష్య రహిత వాతావరణం ప్రత్యేకమైన బ్లాకులు తాగునీటి సౌకర్యం టాయిలెట్ల సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. అత్యుత్తమమైన విద్యకు తల్లిదండ్రులు తమ పాఠశాలకు విద్యార్థులకు పంపించాలని ప్రిన్సిపాల్ దేవ సాయి కోరారు.

గీతా కార్మికుల సహకార సంఘానికి ఎన్నికలు నిర్వహించాలి

నవతెలంగాణ-పాలకుర్తి



గీత కార్మికుల సహకార సంఘానికి ఎన్నికలు నిర్వహించాలని గీత కార్మికుల సహకార సంఘం నాయకులు ఎక్సైజ్ శాఖ అధికారులను కోరారు. శుక్రవారం మండలంలోని చెన్నూరుగ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుల సహకార సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గల ఎక్సైజ్ శాఖ అధికారికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2007 నుండి సొసైటీకి ఎన్నికలు నిర్వహించ లేదని, కారుపోతుల దర్గయ్య మరణానంతరం వంశపారం పర్యంగా ఎన్నికలు లేకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం వల్ల సొసైటీలో అక్రమాలు జరిగాయని రూపించారు. కారుపోతుల వేణు జోడు పదవులు నిర్వహిస్తూ ప్రభుత్వ యంత్రగాన్ని తప్పు త్రోవ పట్టిస్తూ అనేక అవినీతి, అక్రమాలు చేస్తున్నాడన్నారు. తెలంగాణ కో ఆపరేటివ్ ఆక్ట్ 1964 ప్రకారం జోడు పదవులు అనుభవిస్తూ గీతకార్మికులకు నూతన సభ్యత్వాలు ఇవ్వకుండా ప్రభుత్వం పన్ను మినహాయింపు చేస్తే పన్నులు చెల్లించమని జులుం చేస్తూ ఏకపక్షంగా సభ్యులకు సమాచారం ఇవ్వడము లేదని, పాలకుర్తి సొసైటీ వైస్ ఛైర్మన్‌గా, చెన్నూరు గౌడ సొసైటీకి అధ్యక్షుడుగా జోడు పదవులు నిర్వహిస్తున్న ఇతని పై కలెక్టర్ చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు.

ఉపాధి కూలీ మృతి



నవతెలంగాణ-పాలకుర్తి

విద్యుద్ఘాతంతో ఉపాధి కూలీ మృతి చెందిన సంఘటన మండలంలోని విసునూరులో గల నర్సరీలో చోటుచేసుకుంది. శుక్రవారం గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విసునూరు గ్రామానికి చెందిన నార్లపురం యాదమ్మ (46) విసునూరులో గల నర్సరీలో ఉపాధి హామీ కూలి(వాచర్)గా పనిచేస్తుందని తెలిపారు. నర్సరీలో నీళ్లను పడుతూ పిచ్చి మొక్కలను తొలగిస్తుందని అన్నారు. ట్రాన్స్ఫార్మర్‌కు ఉన్నటువంటి ఎర్త్ వైరు పెన్సన్యు తలగడంతో నీళ్లు పట్టుచున్న యాదమ్మకు ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ అయిందని, విద్యుద్ఘాతంతో అక్కడికక్కడే మృతి చెందిందని తెలిపారు. మృతురాలి కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని శవపంచినామా అనంతరం జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించామని తెలిపారు. యాదమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు.

గుండెపోటుతో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మృతి

నవతెలంగాణ-దేవరుప్పుల



మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ అధ్యక్షుడు, చిన్నమడూరు గ్రామ మాజీ ఎంపీటీసీ రాంబోజిగుడెం రాజీవ్ నగర్‌కు చెందిన మేడ ఎల్లయ్య గురువారం రాత్రి గుండెపోటుతో ఆకస్మికంగా మరణించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి శుక్రవారం మృతదేహాన్ని సందర్శించి,పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలు చేశారని, ఆయన అకాలమరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని, వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. అదేవిధంగా కాంగ్రెస్ నియోజకవర్గ నాయకురాలు అనుమాండ్ల ఝాన్సీ ఎల్లయ్య కుటుంబానికి ఇరవై వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు డాక్టర్.లకావత్ లక్ష్మీనారాయణ నాయక్, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, నియోజక వర్గ యూత్ అధ్యక్షుడు ధరావత్ రాజేష్ నాయక్, దేవరుప్పుల మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి గౌడ్, పాలకుర్తి మండల అధ్యక్షుడు గిరగాని కుమార స్వామి,యువజన నాయకుల ప్రకాష్ తదితరులున్నారు.

బీఆర్ఎస్ పార్టీ నాయకుల పరామర్శ...

మేడ ఎల్లయ్య అకాల మరణంతో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మృతదేహాన్ని నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి,బస్వ మల్లేష్,చింత రవి,జోగు సోమనర్సయ్య, తిరు మలేష్, వంగ అర్జున్, గుండె రమేష్ తదితరులు ఉన్నారు.

అబద్ధపు హామీలతో ప్రజల్ని మోసం చేస్తున్న కేసీఆర్

జమ్మూ మాజీ ఉప ముఖ్యమంత్రి నిర్మల్ సింగ్

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్



అబద్ధపు హామీలతో సీఎం కేసీఆర్ రాష్ట్ర పజల్ని మోసం చేస్తున్నారని జమ్మూ కాశ్మీర్ మాజీ ఉప ముఖ్యమంత్రి నిర్మల్ సింగ్ అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలో నియోజక వర్గ కన్వీనర్ ఐలోని అంజిరెడ్డి అధ్యక్షతన మహాజన్ సంపర్క్ అభియాన్ భాగంగా సంయుక్త మోర్చాల సమావేశానికి ముఖ్య అతిథిగా నిర్మల్ సింగ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలకు చౌక ధరల దుకాణాల్లో కనీసం సరుకులు ఇవ్వకుండా ఏం ఎలగబెట్టావని ఎద్దేవా చేశారు. డివిజన్ కేంద్రంలో 9యేండ్ల పాలనలో డిగ్రీ కళాశాల తేలేదని ఇక్కడి ఇద్దరూ ఉపముఖ్యమంత్రిగా వ్యవహరించి ఏం చేశారో ఈప్రాంత ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.డబల్ ఇంజన్ సర్కారుతో అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండె విజయ రామారావు, రాష్ట్ర నాయకులు మాదాసు వెంకటేష్, ఉడుగుల రమేష్, బొజ్జపల్లి సుభాష్, లోక్ సభ జాయింట్ కన్వీనర్ ఇనుగాల యుగేందర్ రెడ్డి, కుమార్ స్వామి, జిల్లా నాయకులు గంటే ఉపేందర్ యాదవ్, దిలీప్ రెడ్డి, శరత్, నవీన్ రెడ్డి, ప్రదీప్ పాల్గొన్నారు.

జీవ ఎరువుల వాడకం పై రైతులకు అవగాహన సదస్సు

నవతెలంగాణ-కొత్తగూడ

మండలంలోని కిష్టాపురం గ్రామంలో పచ్చిరొట్ట ఎరువులు, ఎరువుల వినియోగం, భాస్వరాన్ని కరిగించే జీవ ఎరువుల వాడకం గురించి రైతులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ రాజు మాట్లాడుతూ రసాయన ఎరువులు విచ్చలవిడిగా వాడకం వల్ల భూసారం తగ్గి భూమి నిస్సారవంతంగా తయారవుతుందన్నారు. పచ్చిరొట్ట ఎరువులవల్ల భూమి సారం నేలకు నీటిని, పోషకాలను నిలుపుకునే శక్తి పెరుగుతుందన్నారు. కలుపు సమస్య ఎక్కువగా ఉన్న భూముల్లో పచ్చిరొట్ట ఎరువులు వేసుకోవడం ద్వారా కలుపు ఉధతిని తగ్గించుకోవడానికి వీలుగా ఉంటుందన్నారు. పచ్చి రొట్ట వేసుకొని భూమిని కలియ దున్నడం ద్వారా భూమి సారం పెరిగి అధిక దిగుబడులు వస్తాయని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు కోఆర్డినేటర్ బూర్క పద్మ వార్డు మెంబర్ సారంగపాణి, రైతులు బూర్క మల్లయ్య, వెంకటయ్య, కొప్పుల నాగేశ్వర్ రావు, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా

నవతెలంగాణ-తొర్రూరు



బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు గుర్తూర్ మాజీ సర్పంచ్ దేవరకొండ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం స్థానిక విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎవరిపై ఎలాంటి ఆరోపణలు లేవని, వ్యక్తిగత కిరణాలతో పార్టీని వీడుతున్నట్లు తెలిపారు. తన రాజీనామా లేఖను వాట్సాప్ ద్వారా మండల పార్టీ అధ్యక్షుడికి పంపినట్లు పేర్కొన్నారు. భవిష్యత్ కార్యాచరణ త్వరలో ప్రకటిస్తానని దేవరకొండ శ్రీనివాస్ తెలిపారు.

పట్టణ ప్రగతి దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-మహబూబాబాద్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవం సందర్భంగా మహబూబాబాద్ పట్టణంలోని ఎమ్మార్వో కార్యాలయం నుండి నందన గార్డెన్స్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో మహిళలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయం ప్రదేంభింబించేలా బతుకమ్మలతో కోలాటాలతో సందడి చేశారు. అలాగే మార్గ మధ్యలో మానుకోట మదర్ థెరిస్సా విగ్రహ సెంటర్ వద్ద భారీ మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ డా.రామ్మోహన్ రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎండి ఫరీద్, మున్సిపల్ అధికారులు చెప్పా ఉపేందర్, సురేష్, వార్డు కౌన్సిలర్లు మారినేని వెంకన్న చిట్యాల జనార్ధన్, గోగుల రాజు, మారినేని శ్రీదేవి, రఘు, భారాస నాయకులు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది, మెప్మా ఆర్పీలు, మహిళ సంఘాలు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికై ప్రగతి నివేదన యాత్ర : ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు నివేదించడంతో పాటు గ్రామాలలో ఏవైనా సమస్యలుంటే పరిష్కరించడం కోసం ప్రగతి నివేదన యాత్రను నిర్వహిస్తున్నట్లు స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లి, మీదికొండ, రాఘవాపూర్, చాగల్ గ్రామాలలో ఆయన ప్రగతి నివేదిక యాత్రను చేపట్టారు. సర్పంచులు ఆనందం, మనెమ్మ, శ్రీలత, సారాంగపాణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లా డుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. జూలై నెలలో గృహలక్ష్మి పథకం ప్రారంభమవుతుందన్నారు. రాత్రికి ఛాగల్ గ్రామంలో పల్లెనిద్ర నిర్వహించి అక్కడే శనివారం ఉదయం 7నుంచి 9గంటల వరకు గ్రామంలో పాదయాత్ర చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవి, ఎంపిపి కందుల రేఖ, సర్పంచులు సురేష్ కుమార్, ఆనందం, మనెమ్మ, శ్రీలత, ఎంపిటిసీలు బెల్లపు వెంకటస్వామి, నర్సింహులు, రాజు, శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీఓ శ్రీధర్ స్వామి, ఎంపీఓ సుధీర్ కుమార్, ఏపీఎం కవిత, ప్రసాద్, మల్లేశం, పావని పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

సీఐటీయూ డిమాండ్



నవతెలంగాణ-మహబూబాబాద్

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, గుడిసె వాసులపై ప్రభుత్వ నిర్బంధాన్ని ఆపాలని కోరుతూ తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ఆదివారం మహబూబాబాద్‌లో ప్రారంభం కానున్న బస్సు జాత ప్రారంభ సభను జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక వ్యవసాయ మార్కెట్లో ప్రచార నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్ మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలం కేటాయించి, ఇంటి నిర్మాణం కొరకు నిధులు కేటాయించాలని, వివిధ ప్రాంతాల్లో గుడిసెలు వేసుకున్న పేదలపై ప్రభుత్వం నిర్బంధాన్ని వెంటనే ఆపాలని, వారిపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరుతూ తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు వ్యవసాయ మార్కెట్ వద్ద జరిగే సభను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ సభలో మాజీ ఎంపీ, సీపీఎం అగ్ర నాయకురాలు బృందాకారత్, సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఎం నాయకులు జి.నాగయ్య,ఎస్.వీరయ్య తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ సభను జయప్రదం చేయాలని కోరుతూ ప్రచార నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐడి నాయకులు కుమ్మరికుంట్ల నాగన్న, తోట శ్రీనివాస్, వాసం దుర్గారావు, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలలో గిరిజన బంధు ప్రకటించాలి

తెలంగాణ గిరిజన సంఘం మహబూబాబాద్ జిల్లా కమిటీ డిమాండ్



నవతెలంగాణ-మహబూబాబాద్

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో గిరిజనుల కోసం గిరిజన బంధు ప్రకటించాలని అమలు చేయాలని తెలంగాణ గిరిజన సంఘ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు ఆంగోతి వెంకన్న డిమాండ్ చేశారు. తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజన బంధు అమలు చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మహబూబాబాద్‌లో అంబేద్కర్ సెంటర్లో ధర్నా నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. అనంతరం జరిగిన కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఆంగోతు వెంకన్న నాయక్ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ దశబ్ద ఉత్సవాల్లో భాగంగా గిరిజన బంధు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు భుక్యా హరినాయక్, మాలోతుకిషన్ నాయక్, బానోత్ శ్రీరామ్ నాయక్, బానోత్ సీతారాం నాయక్, శీను నాయక్, కృష్ణ, ఆంగోత్ కిషన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు బందు మహేందర్



నవతెలంగాణ-తొర్రూరు

విద్యా హక్కు చట్టాన్ని అమలు చేసి ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు బందు మహేందర్ అన్నారు. విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ హాస్టల్లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాలోత్ సురేష్ బాబు, పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు బానోత్ శేఖర్‌లతో కలిసి మాట్లాడారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలో ప్రైవేటు పాఠశాలలో విద్యా హక్కు చట్టాన్ని తుంగలో తొక్కి తమ ఇష్టారాజ్యంగావిద్యార్థుల తల్లిదండ్రుల నుండి పాఠశాలలో చేరడానికి అడ్మిషన్ కొరకు, ఎంట్రన్స్ పరీక్ష కోసం ఫీజు, పాఠ్యపుస్తకాలు కొనుక్కోవడానికి ఫీజులు, బట్టలకు ఫీజులు, చదువుకు డొనేషన్ల రూపంలో అధిక మొత్తంలో ఫీజులు, టీసీలు ఇవ్వాలన్న అధిక మొత్తంలో ఫీజులు ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. పాఠశాలలో కనీస విద్యా అర్హతలు లేని ఉపాధ్యాయులను గ్రౌండ్ ఫెసిలిటీ లేకుండా నడిపిస్తున్నటువంటి పాఠశాలలను,అనుమతిలేని పాఠశాలలను, ఫిట్నెస్‌లు లేకుండా నడిపిస్తున్నటువంటి బస్సులపై పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారని వారు మండిపడ్డారు. గతంలో కూడా విద్యార్థి సంఘాలు ఆధ్వర్యంలోప్రైవేట్ పాఠశాలలో స్వయంగా పుస్తకాలు అమ్ముతుంటే ఫోటోలు తీసి పెట్టిన అధికారుల పర్యవేక్షణ మాత్రం శూన్యంగా మారింది. అధికారుల ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోకపోతే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో భారీ ఎత్తున పోరాటాలు చేపడతామని హెచ్చరించారు.

సర్వర్ డౌన్‌తో.. ప్రజల గోస

పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు ఇబ్బందులు

నవతెలంగాణ-నర్సింహులపేట

సీఎం కేసీఆర్ కుల వృత్తులకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో కుల లక్ష రూపాయలు పథకం ప్రవేశపెట్టారు. దీనితో సంబంధిత కులవృత్తుల వారు సంబంధిత కులం ఇన్కమ్ సర్టిఫికెట్ల కోసం మండలంలోని తహసిల్దార్ కార్యాలయాలకు వెళ్లి నమోదు చేసుకున్నారు. దీనితో కొంత మందికి ధృవీకరణ పత్రాలు రాగా 100కు పైగా దరఖాస్తులు, ఆన్లైన్ జరగకపోవడంతో, గత నాలుగు నుండి ఐదు రోజుల నుండి సర్వార్ పూర్తిగా డౌన్ కావడంతో, ఎండల్లోనే ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత పత్రాలు ఎప్పుడు వస్తాయో..? ఈ గోసా ఏంది..? ఎండలో మాకు అని వాపోతున్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి, సర్వర్ సమస్యపై ప్రజలకు నష్టం కలగకుండా కృషి చేయాలని కాంగ్రెస్, సిపిఎం, వివిధ పార్టీ నాయకులు, దంఖాసుదారులు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని తహసిల్దార్ కార్యాలయాలు గడిచిన నాలుగు ఐదు రోజులు నుండి సర్వర్ డౌన్ కావడం విషయం నిజమే. సమస్యను పరిష్కరించుటకు సంబంధిత టెక్నికల్ సిబ్బంది ఎల్లవేళల కృషి చేస్తున్నట్లు, నరసింహుల పేట తాసిల్దార్ వివేక్ నవతెలంగాణకు ఫోన్లో తెలిపారు.

తెలంగాణ పల్లెలు దేశానికి ఆదర్శం : ఎంపీపీ రాజేశ్వరి

నవతెలంగాణ-పెద్దవంగర

తెలంగాణ రాష్ట్రంలో పల్లెలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎంపీపీ ఈదురు రాజేశ్వరి అన్నారు. చిట్యాల గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఈజీఎస్ నిధుల నుండి రూ. 20 లక్షలు మంజూరు చేశారు. శుక్రవారం ఎంపీపీ జీపీ భవన నిర్మాణానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలే దేశానికి పట్టు కొమ్మలు అనే నానుడిని 100 శాతం అమలు చేసిన ఘనత సీఎం కేసిఆర్ కే దక్కుతుందన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందన్నారు. ప్రతి గ్రామంలో ఇంటింటికి తాగునీరు, అంతర్గత రోడ్లు, స్మశాన వాటికలు, పల్లె ప్రకతి వనాలు వంటి అనేక కార్యక్రమాలు చేపడుతూ ప్రభుత్వం గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుందని తెలిపారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాలకుర్తి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. మండలానికి అధిక నిధులు మంజూరు చేస్తూ, మండల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఈదురు లచ్చమ్మ, జూనియర్ పంచాయతి కార్యదర్శి రాజు, నాయకులు రాపోలు అన్నపూర్ణ సుదర్శన్, ఆవుల వసంత కొమురల్లి, దేశెట్టి సోమయ్య, ఈదురు రాంచంద్రు, కొయ్యేడి యాకయ్య, మొగులగాని హరీష్, వల్లపు పరమేష్, ఆకుతోట జ్యోతి, ఆకుల వెంకన్న, కొయ్యేడి యాకయ్య, పిట్టల వెంకటేశ్వర్లు, దేశెట్టి సోమయ్య, కోట శ్రీనివాస్, గజ్జి శివయ్య, దేశెట్టి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ప్రభుత్వంతోనే పట్టణ అభివృద్ధి వేగవంతం

మంత్రి సత్యవతి రాథోడ్



నవతెలంగాణ-మహబూబాబాద్

గ్రామపంచాయతీగా ఉన్న మానుకోట మున్సిపాలిటీగా మారి అభివృద్ధి చెందుతున్న తరుణంలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పడడంతో జిల్లాగా ఆవిర్భవిస్తూ పట్టణ అభివృద్ధి వేగవంతంగా మారిందని రాష్ట్ర గిరిజన సంక్షేమం మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని నందన గార్డెన్స్ లో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శశాంక, పార్లమెంట్ సభ్యురాలు మాలోత్ కవిత, మహబూబాబాద్ శాసనసభ్యులు బానోత్ శంకర్ నాయక్, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డిలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవ సందర్భంగా మున్సిపాలిటీ చేపడుతున్న అభివృద్ధి సమగ్రంగా వివరించారు. మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ స్థాయిలో ఉన్న మానుకోట తెలంగాణ ప్రభుత్వం ఏర్పడడంతో మహర్దశ పట్టిందన్నారు. జిల్లా కేంద్రంగా ఆవిర్భవించి దినదిన ప్రవర్తమానంగా మానుకోట జీవన ప్రమాణాలను పెంచుకోవాలని ఉద్దేశంతో పట్టణ అభివృద్ధిని వేగవంతం చేయడం జరిగిందన్నారు.తెలంగాణ ప్రభుత్వం సుమారు 21ఎకరాలలో రూ 53 కోట్లతో సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయం నిర్మించడంతో అభివృద్ధి వేగవంతమైందన్నారు. 550 కోట్లతో 40 ఎకరాలలో నిర్మించ తలపెట్టిన మెడికల్ కళాశాల నర్సింగ్ కళాశాల జిల్లాకే వన్నెతెచ్చాయన్నారు.జిల్లా కేంద్రంగా ఆవిర్భవించిన మహబూబాబాద్‌ను ప్రణాళిక పరంగా పట్టణప్రగతి కార్యక్రమాన్ని చేపట్టడంతో రోడ్ల విస్తరణ కార్యక్రమం డ్రైనేజీలు వంటివి చేపట్టి పట్టణాన్ని విశాలంగా తీర్చిదిద్దామన్నారు. జిల్లా గ్రంథాలయం నిర్మాణం డిజిటల్ లైబ్రరీ వెజ్ నాన్ వెజ్ కొరకు మోడల్ మార్కెట్ల నిర్మాణం పట్టణ అభివృద్ధిని మరింత చూపాయి అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు 58, 59 జిల్లా ద్వారా ప్రభుత్వ స్థలాలలో నివాసముంటున్న నిరుపేదలకు క్రమబద్ధీకరణ పత్రాలను అందించడంతో యాజమాన్య హక్కును పొందినట్లు అయిందన్నారు. పట్టణ ప్రగతిలో మహబూబాబాద్‌కు అవార్డు వచ్చిందన్నారు. ఇదంతా ప్రజల సహకారమేనని తెలియజేశారు. జిల్లా కలెక్టర్ శశాంక్ మాట్లాడుతూ ప్రొద్దున లేచిన దగ్గర నుండి మరునాటి వరకు నిరంతరంగా అందించే సేవలను వివరిస్తూ మున్సిపాలిటీ సిబ్బంది అందించే సేవలకు మనం ఎంతో రుణపడి ఉన్నామన్నారు. మున్సిపాలిటీలలో చెత్త సేకరణ త్రాగునీరు సరఫరా పారిశుధ్యం మెరుగు వంటి సేవలు అద్భుతమైనవని మన్నారు.సఫాయి అన్న నీకు సలాం అన్న అని కలెక్టర్ అన్నారు. పార్లమెంట్ సభ్యురాలు మాలోత్ కవిత మాట్లాడుతూ ఒకప్పుడు మున్సిపాలిటీ అందించిన సేవలకు ఇల్లందు అవార్డు అందుకున్నదనితదనంతరం మహబూబాబాద్ కూడా అందుకోవటం గర్వకారణంగా ఉందన్నారు. మున్సిపాలిటీని అందంగా తీర్చిదిద్దడమే గాక పరిశుభ్రతను పెంచారని విశాలమైన రోడ్లు జంక్షన్ల అభివృద్ధి సుందరీ కరణ పెరిగిందన్నారు. మహబూబాబాద్ శాసనసభ్యులు బానోతు శంకర్ నాయక్ మాట్లాడుతూ గిరిజనులకు ఉద్యోగాలలో ఆరు శాతం ఉన్న దానిని 10% పెంచడం యువతకు మేలు చేసినట్లు అయిందన్నారు. రెండు పడక గదుల ఇండ్లను త్వరలోనే లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా మెప్మా సిబ్బందికి 11.45 కోట్ల రూపాయల చెక్కును 80 యొక్క మహిళా సంఘాలలో ఉన్న 124 మంది వీధి వ్యాపారులకు బ్యాంకు ద్వారా రుణాలను అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్, జెడ్పిసిఈఓ రమాదేవి, మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి, వైస్ ప్రెసిడెంట్ ఫరీద్, మున్సిపల్ కౌన్సిలర్లు, సిబ్బంది, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

తూర్పులో ఐటీ శాఖ మంత్రి రామన్న పర్యటన

తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



నవతెలంగాణ-వరంగల్

ఐటీ, పరిశ్రమలు, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు శనివారం తూర్పు నియోజకవర్గానికి రానున్నట్లు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ తెలిపారు. రూ. 618 కోట్ల వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరపనున్నట్లు తెలిపారు. గత కాంగ్రెస్ సుదీర్ఘ పాలనలో తూర్పు నియోజకవర్గం కేవలం కార్మికులను తయారు చేసే కార్ఖానగానే ఉండిపోయిందన్నారు. రాజకీయాలను అప్పటి నాయకులు తమ అవసరాలకు వాడుకున్నారు తప్ప ప్రజల అభివృద్ధిని కాంక్షించలేదన్నారు. దీంతో ఎలాంటి ప్రగతి లేక పూర్తిగా పాతబస్తీగానే మిగిలిపోయిందన్నారు. కేసీఆర్ తన ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రం సాధించాక, మంత్రి కేటీఆర్ నాయకత్వంలో నభూతో నభవిష్యత్ అన్న చందంగా అభివృద్ధి పరంగా గణనీయమైన మార్పులు జరిగాయన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా 24 అంతస్తుల మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం శరవేగం గా జరుగుతున్నదన్నారు. ఆ పరిసర ప్రాంతాల్లో ఉన్న కేఎంసీ, కాళోజీ యూనివర్సిటీ, రీజనల్ ఐ హాస్పిటల్, ఎంజీఎంల కనెక్టివిటీతో వరంగల్ హెల్త్ సిటీగా అద్భుతంగా రూపుదిద్దుకోనున్నట్లు తెలిపారు. ఈ విధంగా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నందున వారికి వచ్చే ఎన్నికల్లో ఇక్కడి సీటును గెలిపించి కానుకగా ఇవ్వాలని ఎమ్మెల్యే ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ సుంద ర్ రాజు యాదవ్, డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీం మసూద్, ఏనుమాముల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ దిడ్డి భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, గుండేటి నరేంద్ర కుమార్, చింతాకుల అనిల్, ఓని భాస్కర్, పల్లం పద్మ రవి, బైరబోయిన ఉమా దామోదర్ యాదవ్, మరుపల్ల రవి, వస్కుల బాబు, ఆర్టీఏ మెంబర్ గోరంటల మనోహర్, మాజీ కార్పొరేటర్లు తదితర నాయకులు పాల్గొన్నారు.

మహానగరం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది

చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్



నవతెలంగాణ-వరంగల్

మహానగరం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని చీఫ్ విప్ దాస్యం భాస్కర్ అన్నారు.తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని పురస్కరించుకొని సమావేశం నిర్వహించారు. కార్పొరేషన్ ఆవరణలో నగర మేయర్ గుండు సుధారాణి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సానిటేషన్ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ కోసం యశోద హాస్పిటల్ సహకారంతో బల్దియా ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్‌లు సంయుక్తంగా ప్రారంభించారు.పట్టణ ప్రగతి పై సమగ్ర సమాచారంతో రూపొందించిన నివేదికను చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ గతంలో శానిటేషన్ సిబ్బందికి కనీస మౌలిక సదుపాయాల కల్పన కోసం ధర్నాలు,రాస్తారోకోలు, ఘెరావ్‌లు చేయడం జరిగేదని, ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ పురపాలక శాఖ మంత్రులు కేటీఆర్ సఫాయి కార్మికులు అందించిన సేవలను గుర్తించి వారికి వేతనాలను పెంచడం జరిగిందని, గతంలో నగర వ్యాప్తం 2-3 పార్కులు మాత్రమే ఉండేవని, అలాంటి స్థితి నుండి నేడు కేవలం హనుమకొండ నగరంలోని 66పార్కులను ఏర్పాటు చేయడం జరిగిందని, బల్దియా ఆవరణలో ఏర్పాటు చేసిన ఎల్ఈ డీ తెరలపై పట్టణ ప్రగతి పై ఏర్పాటు చేసిన డాక్యుమెంటరీ ప్రదర్శిం చారు.బల్దియా చేపట్టి పూర్తి చేసిన వివిధ అభివద్ధి కార్యక్రమాల పురోగతి పై నాడు-నేడు ఫోటోఎగ్జిబిషన్‌ను చీఫ్‌విప్, కలెక్టర్ మేయర్, కమిషనర్లు తిలకించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌లతో పాటు ఉత్తమ సేవలు అందించిన 107 మంది సిబ్బందికి ప్రశంస పత్రాల అందజేశారు. ఈ కార్యక్రమంలో కూడా చైర్మన్ సుందర్ రాజ్, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, వరంగల్ జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్, పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్,ఉప మేయర్ రిజ్వానా షమీం మసూద్‌తో పాటు వివిధ డివిజన్లకు చెందిన కార్పొరేటర్లు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధి పట్ల పాలకులకు చిత్తశుద్ధి లేదు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు



నవతెలంగాణ-మట్టెవాడ

దేశానికి స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు దాటిన దళితుల అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్నట్టుగానే ఉంది అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు అన్నారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ శిబిరం 16,17,18 తేదీల్లో సాయినగర్‌లోని పిఆర్ఆర్ కన్వెన్షన్‌లో మూడు రోజులపాటు రాష్ట్ర అధ్యక్షులు బందెల నర్సయ్య, జన్ను రవి అధ్యక్షతన జరగనున్నాయి. ఈ శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం, సామాజిక న్యాయం ప్రాతిపదిక మీద ఏర్పడినది. బిఆర్ అంబేద్కర్ దేశంలో నలుమూలలు పర్యటించి అందరికి సమానహక్కులు రిజర్వేషన్లు కావాలని, సామాజికంగా విద్యా, ఉద్యోగ, రాజకీయ, ఆర్థికంగా వెనుకబడి వున్న వారికి రిజర్వేషన్లు కల్పించి ప్రతి ఒక్కరికి సమాన ఓటుహక్కు కల్పించి రాజ్యాంగంలో పొందుపరచినాడు. దళితుల ఆర్థిక, రాజకీయ శక్తిని పెంచటానికి కనీస వేతనాలు, ఉపాధి పథకాలు, భూసంస్కరణలు లాంటి అనేక సంక్షేమ చర్యల్ని, ప్రత్యేక రక్షణ చర్యలు ప్రభుత్వం చేపట్టవలసిన అవసరం ఉంది. ప్రజాస్వామ్యం నిజమైన ప్రజాస్వామ్యంగా రూపొందటానికి రాజకీయ, సామాజిక కృషి మరింత అవసరం. దళితులు, ఇతర పీడిత కులాల ప్రజలు రాజ్యాంగం ద్వారా, ఇతర చట్టాల ద్వారా కల్పించిన రక్షణల్ని సక్రమంగా వాడుకోవడానికి న్యాయవ్యవస్థ పాత్ర చాలా కీలకమయినదనీ అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశవ్యాప్తంగా దళితులపై దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయినీ. బిజెపి పాలిత రాష్ట్రాలలో దళితులపైన దాడులు దౌర్జన్యాలు 300రెట్లు పెరిగాయి. మతోన్మాద శక్తులు విద్వేషాలు ఉద్రిక్తతలు రెచ్చగొట్టడం ద్వారా పేద ప్రజల మధ్యన ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్నాయను. దళిత గిరిజనులు దాడులు దౌర్జన్యాలనుండి ఎంతో కొంత ఉపశమనం పొందే ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం 1989ని సుప్రీం కోర్టు తీర్పు ద్వారా నిర్వీర్యం చేయాలని కేంద్ర బిజెపి సర్కార్ ప్రయత్నించిందనీ, ఏడు సంవత్సరాలకు పైగా జైలు శిక్ష పడే కేసులకు స్టేషన్ బెయిల్ ఇవ్వవచ్చన్న సుప్రీంకోర్టు దేశాలను ఆసరాగా చేసుకొని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సైతం స్టేషన్ బెయిల్ ఇవ్వడం మూలంగా దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, అత్యాచార నిరోధక చట్టం పకడ్బందీగా అమలుకావడం లేదనీ అన్నారు. ఫలితంగా దేశవ్యాప్తంగా దళితులపైన దాడులు రెట్టింపు అవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఒక పథకం ప్రకారం ప్రభుత్వ రంగసంస్థలను అమ్మడం ద్వారా రిజర్వేషన్లను రద్దుచేస్తూ సామాజిక న్యాయాన్ని సమాధి చేస్తుంది. రాజ్యాంగాన్ని పూర్తిగా రద్దు చేసి మనుస్మృతిని దేశ పవిత్ర గ్రంథంగా ప్రవేశపెట్టాలని ఆర్ఎస్ఎస్ కుటిలయత్నాలు చేస్తుంది. వీటిని తిప్పికొట్టాల్సిన గురుతర బాధ్యత నేటి యువతరం పైన ఉంది అని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆ సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కె.యేసురత్నం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, కార్య నిర్వహణకు అధ్యక్షులు తాళ్లపల్లి లక్ష్మణ్, కే.సాదేవ్, దేవి పోచన్న, కే.రత్నకుమారి,సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్ర బిక్షపతి, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కే.శ్రీనివాస్, డిహెచ్ పిఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షులు ఎస్.ఎల్లెందర్, కేతరాజు ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా నర్సంపేట

నిరుపేద విద్యార్థులకు కేజీటూపీజీ ఉచిత విద్య

నవతెలంగాణ-నర్సంపేట

నర్సంపేట నియోజకవర్గం ఎడ్యుకేషన్ హబ్‌గా మారబోతుందని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పాకాల రోడ్డులో మహాత్మ జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకులాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన కేజీటూపీజీ విద్యా విధానంలో మూడు గురుకులాలకుగానూ నర్సంపేటకు ప్రత్యేకించి తొమ్మిది గురుకులాలను తీసుకొచ్చి పేద,సామాన్య కుటుంబాలకు చెందిన వేలాది మంది విద్యార్థులకు ఉచిత విద్యా అవకాశాలను మెరుగుపర్చామన్నారు. ఇటీవల మరో మూడు బీసీ రెసిడెన్షియల్ బాలికల గురుకుల పాఠశాలు మంజూరు కావడం సంతోషకరమన్నారు. ఇప్పటి వరకు 7600ల మంది విద్యార్థులకు గురుకులాలలో నాణ్యమైన విద్యా, వసతి సౌకర్యాలు అందుతున్నాయని తెలిపారు. ఇటివల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు జాతీయ స్థాయిలో న్యాక్‌ప్లస్ ఏ గుర్తింపు రావడం గర్వకారణమన్నారు. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత స్థితిలో స్థిరపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనీ కిషన్, ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామి, మున్సిపల్ వైఎస్ చైర్మన్ మునిగాల వెంకట్ రెడ్డి, రైతు సమన్వయ సమితి రాష్ట్ర డైరెక్టర్ రాయిడి రవీందర్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ శీలం రాంబాబు, ఆర్‌సీఎం తదితరులు పాల్గొన్నారు.



గిరిజన బంధు పథకాన్ని వెంటనే ప్రకటించాలి

నవతెలంగాణ-జనగామ

తెలంగాణ రాష్ట్రం అవతారణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈనెల 17 న గిరిజన ఉత్సవం జరుపుకుంటున్నందున అదేరోజు గిరిజన బందుపథకాన్ని ప్రకటించాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తేజావత్ గణేష్ నాయక్ డిమాండ్ చేశారు.శుక్రవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన గిరిజన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాలలో గిరిజన బంధు ఇచ్చేందుకు జీవో విడుదల చేయాలని కోరారు. గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్‌తో పాటు త్వరలోనే గిరిజన బందు చేయిస్తామని ఇది వరకే సీఎం ప్రకటించారని గుర్తుకు చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తన హామీని నిలబెట్టుకోవాలని కోరారు.కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు రాకపోవడంతో ఉపాధి అవకాశాలు గిరిజన యువత దూరమవుతున్నారనిఆవేదన వ్యక్తం చేశారు.ఈతరుణంలో గిరిజనబందు ఇస్తామన్న హామీని ముఖ్యమంత్రి నిలబ ట్టుకుంటారని తెలంగాణలోనే 33 తెగల గిరిజనులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. తక్షణమే గిరిజన బంధు ప్రకటించి వివిధ రంగాలలో గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం మాజీ జిల్లా కార్యదర్శి భూక్య చందు నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు అజ్మీర సురేష్ నాయక్, జిల్లా నాయకులు ఇస్లావత్ ప్రవీణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా విక్రయిస్తే చర్యలు తప్పవు

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

గుడుంబా విక్రయిస్తే విక్రయిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ భాస్కర్ రావు అన్నారు. చిల్పూర్ మండలం ఫతేపూర్ గ్రామంలో భూక్య సీతమ్మ అనే మహిళ గుడుంబా తయారీ చేస్తున్నదని నమ్మదగిన సమాచారంతో గతంలో పోలీసులు పట్టుకుని, తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. అయినప్పటికీ మానకపోగా మరోమారు గుడుంబా తయారీ చేస్తూ పట్టుబడటంతో తహశీల్దార్ ఆదేశానుసారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు నరేష్, జలీలుద్దీన్, కానిస్టేబుల్ దస్తగిరి, గౌతమి పాల్గొన్నారు.

వడ్ల పైసలు పడతలేవు

నవతెలంగాణ-పాలకుర్తి రూరల్

వరి ధాన్యం అమ్మి నెలరోజులు దాటినప్పటికీ రైతులకు ధాన్యం డబ్బులు అకౌంట్లో జమ కావడంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వానికి దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదని, తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమైనందున రైతులు ఎరువులు విత్తనాలు ఏర్పాటు కొరకు పెట్టుబడికి ఎదురు చూస్తున్న పరిస్థితి నెలకొంది. మాకు రావాల్సిన డబ్బులు మా అకౌంట్లో వేసినట్లయితే మా తిప్పలు మేం పడతామని రైతులు అంటున్నారు. ఇకనైనా ప్రభుత్వం శ్రద్ధ తీసుకొని రైతుల డబ్బులు వేయాలని కోరుతున్నారు.

ట్రాఫిక్ మళ్లింపులకు సహకరించాలి

నవతెలంగాణా-మట్టేవాడ

వరంగల్ తూర్పులో మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పర్యటిస్తున్న సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ ఉంటుందని వరంగల్ ట్రాఫిక్ సిఐ బాబూలాల్ తెలియజేశారు. శనివారం మధ్యాహ్నం 3 నుండి రాత్రి 9 గంటల వరకు వరంగల్ ఓ సిటి గ్రౌండ్లో రాష్ట్ర ఐటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పబ్లిక్ మీటింగ్ ఉన్నందున వాహనాలను మళ్ళించడం జరుగుతుందని తెలిపారు. నర్సంపేట నుండి వరంగల్ మరియు హన్మకొండ వచ్చే వాహనాలు తెలంగాణ జంక్షన్ నుండి చింతల ఫ్లైఓవర్ మీదుగా ఫోర్ట్ రోడ్ డైవర్షన్ బట్టల బజార్ బ్రిడ్జి మీదుగా హన్మకొండ వైపుకు వెళ్లవలేనని హన్మకొండ నుండి వెంకట్రామ జంక్షన్ మీదుగా నర్సంపేట వెళ్ళు వాహనాలను ఎంజిఎం బట్టల బజార్ బ్రిడ్జి మీద నుండి ఫోర్ట్ రోడ్ డైవర్షన్,తెలంగాణ జంక్షన్ మీదుగా మళ్ళించడం జరుగుతుందనీ వరంగల్ హనుమకొండ ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

ఘనంగా బ్రహ్మోత్సవ వేడుక



నవతెలంగాణ-నెల్లికుదురు

మండలంలోని ఎర్రబెల్లి గూడెం గ్రామంలోని శ్రీ భూనీల సామెత వెంకటేశ్వర స్వామి ఐదవ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అన్నదాన కార్యక్రమానికి ఎమ్మెల్యే శంకర్ నాయక్ పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు ఆ గ్రామ సర్పంచ్ బొమ్మెర అశోక్ తో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ నాయక్‌ను శాలువతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొమ్మెర అశోక్ ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి నవీన్ రావు, ఎంపిటిసి ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బత్తిన అనిల్, గౌడ్ పిఎసిఎస్ చైర్మన్ మునుగోడు దేవేందర్ రావు, మండల అధ్యక్షుడు పరుపాటి వెంకటరెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులతో చెలగాటం ఆడుతున్న రైస్ మిల్లర్లు

సివిల్ సప్లై ఆఫీసర్ల నిర్వాహకంతో డబ్బులు చెల్లింపులో ఆలస్యం



నవతెలంగాణ-పర్వతగిరి

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చింత నెక్కొండలో రైసు మిల్లర్లు చెలగాటం ఆడుతున్నారు.దీంతో రైతులు ధాన్యం విక్రయాల్లో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ ఐకెపి ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు.చింత నెక్కొండలోని ఏఎస్ఆర్ ఆగ్రో ఇండస్ట్రీస్ కు ధాన్యం పంపించేందుకు సివిల్ సప్లై ఆఫీసర్లు మొదటగా పర్మిషన్ ఇచ్చారు. పది రోజులు తిరగకముందే ఇండస్ట్రీస్‌కు పర్మిషన్ క్యాన్సిల్ చేశారు. పది రోజుల్లో సుమారుగా రెండువేల క్వింటాల ధాన్యాన్ని ఐకెపి కొనుగోలు సెంటర్ నుంచి ఏఎస్ఆర్ ఇండస్ట్రీస్‌కు సివిల్ సప్లై ఆఫీసర్ల ఆదేశానుసారం పంపించారు. ఇదే గ్రామంలో ఏఎస్ఆర్ ఇండస్ట్రీస్‌తో పాటు అయ్యప్ప రైస్ మిల్లు ఉంది. ఈ రెండు రైస్ మిల్లులపై గతంలో కేసులు నమోదయ్యాయి. అయితే ఏఎన్నార్ ఇండస్ట్రీస్ రైస్ మిల్ ఓనరు సివిల్ సప్లై కమిషనర్ ఆఫీసులో డబ్బులు ఎరచూపి పర్మిషన్ తెచ్చుకున్నాడు. దీంతో మరో రైస్ మిల్లు యజమాని కమిషనర్ ఆఫీసులో గొడవ చేయడంతో ఏఎన్నార్ ఇండస్ట్రీస్ రైస్‌మిల్‌కు పర్మిషన్ క్యాన్సిల్ చేశారు. అయితే రెండు వేల క్వింటాల దాన్యం సంబంధించిన రైతులకు ప్రస్తుతం డబ్బుల చెల్లింపులో ఆలస్యం అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏఎస్ఆర్ ఇండస్ట్రీస్ రైస్‌మిల్లుకు పర్మిషన్ కాన్సిల్ కావడంతో ఇట్టి ధాన్యాన్ని, ట్రక్కు సీట్లను వేరే మిల్లుకు పంపించేందుకు ఆఫీసర్లు ఏర్పాటు చేస్తున్నారు. అంతే కాకుండా కొనుగోలు కేంద్రం నుంచి రైస్ మిల్లు వరకు ట్రాన్స్పోర్ట్ చార్జీలు సైతం మిల్లరు వసూలు చేశాడని రైతులు ఆరోపించారు.దీంతో డబ్బులు చెల్లింపులలో రైతులకు మరింత ఆలస్యం కానుండడంతో పంట పెట్టుబడులు ఎక్కడి నుంచి తెచ్చి పెట్టాలని రైతులు విచారణ వ్యక్తం చేస్తున్నారు. సివిల్ సప్లై ఆఫీసర్లు మిల్లర్లపై చర్యలు తీసుకుని తమకు డబ్బులు తొందరగా వచ్చే విధంగా చూడాలని రైతులు కోరుతున్నారు.

బస్సు యాత్రను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-గార్ల

ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకున్న ప్రతి ఒక్కరికీ,ఇండ్ల స్థలాలు లేని పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చి డబుల్ బెడ్ రూం ఇండ్లు మంజూరు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ నెల 18న మానుకోట పట్టణ కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ ఎదురుగా బైపాస్ రోడ్డులో జరిగే రాష్ట్ర వ్యాప్త బస్సు జాతా ప్రారంభ సభను జయప్రదం చేయాలని స్థానిక నెహ్రూ సెంటర్‌లో ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం కరపత్రాలు విడుదల చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాలో గుడిసెలు వేసుకున్న 48 వేల మంది నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, జీవో నెంబర్ 58 ప్రకారం ప్రభుత్వ భూములలో నివాసం ఉంటున్న పేదలకు క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇండ్ల స్థలాలు, ఇండ్లు సాధనకు జరిగే రాష్ట్ర వ్యాప్తంగా 18 నుండి 27 వరకు జరగనున్న బస్సు యాత్ర ప్రారంభ సభకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, హమాలీ కార్మికులు బిక్షం, కోటయ్య, రాంబాబు, శ్రీనివాస్,రామకృష్ణ, ఎల్లయ్య, అంజయ్య ప్రసాద్, సర్వేశ్వరరావు, సాయి, వెంకన్న, రాము తదితరులు పాల్గొన్నారు.

జగదీష్‌కు పద్మశాలీల నివాళి



నవతెలంగాణ-కొత్తగూడ

ఇటీవల మృతి చెందిన బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు, ములుగు జిల్లా జడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్ చిత్రపటానికి కొత్తగూడ మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం మం డల అధ్యక్షులు కుసుమ రాజన్ బాబు మాట్లాడుతూ పద్మశాలిల నుండి ఇప్పుడిప్పుడే రాజకీయంగా ఎదుగుతున్న మా యువ నాయకుడు కుసుమ జగదీష్ అకాల మరణం మమ్మల్ని ఎంతగానో కలిసివేసిందన్నారు. ఆయన లేని లోటు ఎప్పటికీ పూడ్చలేనిదన్నారు. జగదీష్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ ఆయన అడుగుజాడల్లో నడుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు మాజీ వైస్ ఎంపీపీ పూల యాదగిరి, సామల నాగరాజు, సామల రమేష్, దేవులపల్లి రాజు,సాదుల సాంబయ్య,కోడెం మహేందర్, కుసుమ రాజేశ్వరి, తుల భవాని, దేవులపల్లి పంచాంక్షరీ, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

కల్తీ విత్తనాలను విక్రయిస్తే చర్యలు తప్పవు

తూనికలు, కొలతల శాఖ జిల్లా ఇన్చార్జి అధికారి శ్రీనివాసులు



నవతెలంగాణ-పాలకుర్తి

రైతులను మోసం చేసేందుకు కల్తీ విత్తనాలను విక్రయిస్తే చర్యలు తప్పవని తూనికలు కొలతల శాఖ జిల్లా ఇన్చార్జి అధికారి వి.శ్రీనివాసులు హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో గల గ్రోమోర్‌తో పాటు పలు ఎరువుల దుకాణాలను సందర్శించి పరిశీలించారు. ఎరువుల దుకాణాల్లో ఉన్న రికార్డ్లను, పత్తి ప్యాకెట్లపై ఉన్న లేబుళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ దుకాణాల నిర్వాహకులు స్టాకు రిజిస్టర్లను మైంటైన్ చేస్తూ ఎప్పటికప్పుడు అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎరువుల దుకాణాల నిర్వాహకులు పాల్గొన్నారు.

అనుమతి లేని విత్తనాలు విక్రయించవద్దు

వ్యవసాయ శాఖ డిఏఓ శత్రు నాయక్

నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆగ్రోస్ డీలర్లు అనుమతి విత్తనాలు విక్రయించవద్దని వ్యవసాయ శాఖ డిఏవో శత్రు నాయక్ ఆదేశించారు శుక్రవారం మానుకోటలో రైతు వేదికలో జిల్లా ఆగ్రోస్ డీలర్ల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శత్రు నాయక్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు ఆగ్రోస్ డీలర్లను ఉద్దేశించి మాట్లాడుతూ ఆగ్రోస్ రైతుసేవ కేంద్రాల ద్వారా నాణ్యమైన ఎరువులు విత్తనాలు పురుగు మందులు అమ్మి రైతులకు మేలు చేయాలని అనుమతి లేని ఎరువులను గాని పురుగుమందులను అమ్మ వద్దని లైసెన్సులు ఎప్పటికప్పుడు రెన్యువల్ చేస్తూ స్టాక్ రిపోర్టు ప్రతిరోజు అప్డేట్ చేస్తూ ఉండాలని వారు సూచించారు.ఆగ్రోస్ జిల్లా సూపర్వైజర్ రాములు మార్కెంగ్ ఎక్సక్యూటివ్ అశోక్ మాట్లాడుతూ మా ఆగ్రోస్ కేంద్రాలలోనాణ్యతలో కూడిన పేరుగాంచిన కంపెనీలతో ఒప్పందం చేసుకొని విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, తెలంగాణ సిరి (సిటీ కంపోస్టు),ఆర్గానిక్ ప్రొడక్ట్స్ మరియు టార్పలిన్లు, స్ప్రేయర్స్, డ్రోన్స్, రోటవేటర్లు ఆగ్రోస్ కేంద్రాలకి సరఫరా చేసి సరసమైన ధరలో రైతులకు అందిస్తున్నామని, జిల్లా రైతుల అందరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్య క్రమంలో ఏఐవో పూజిత, ఆగ్రోస్ రైతు సేవ కేంద్రాల డీలర్లు పాల్గొన్నారు.

సీపీఐ పాదయాత్రను జయప్రదం చేయండి

నవతెలంగాణ-గార్ల

మండలంలోని రాంపురం సమీపంలో ఉన్న పాకాల ఏటిపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 19న ఉదయం 8 గంటలకు మద్దివంచ గ్రామం నుండి రాంపురం పాకాల యేటివద్ద వరకు జరిగే పాదయాత్రను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి కోరారు. మండలంలోని మద్దివంచ గ్రామంలో గురువారం రాత్రి జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ముఖ్య అతిథి గా పాల్గొని మాట్లాడారు. ఈ ప్రాంతంలో 25 గిరిజన తండాలకు రవాణా సౌకర్యం కల్పించే పాకాల ఏటి పై హైలెవల్ బ్రిడ్జికి నిధులు కేటాయించకుండ ప్రభుత్వం అనేక సంవత్సరాలుగా నిధులు మంజూరు చేయకుండ తాత్సరం చేస్తుందని మండిపడ్డారు.చెక్ డ్యాం పై బ్రిడ్జి నిర్మాణం చేస్తామని ఈ ప్రాంత ఎమ్మెల్యే, ఎంపీ,మంత్రులు హామీలు ఇచ్చారే తప్ప ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. బ్రిడ్జి నిర్మాణం చేయాలని గతంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో నిర్మించాలని జిల్లా కేంద్రం వరకు రెండు సార్లు పాదయాత్ర నిర్వహించడం జరిగిందని, మరలా ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుక వెళ్ళేందుకు జరిగే పాదయాత్రలో ఈ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టబోయిన శ్రీనివాస్, మండల నాయకులు రాగం రమేష్, కృష్ణమూర్తి, జనార్ధన్, సత్యనారాయణ, మాగం లోకేష్, డి.వీరన్న, శివ, రమేష్, నరేష్, నాగేష్, సుధాకర్ రెడ్డి, రవి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీ విజేతలకు బహుమతులు పంపిణీ

నవతెలంగాణ-గార్ల

మండలంలోని ముల్కనూరు పంచాయితీ పరిధిలో గుంపెళ్ళగూడెం గ్రామంలో జిపిఎల్ యూత్ ఆధ్వర్యంలో మాజీ మంత్రివర్యులు రాం రెడ్డి వెంకట్ రెడ్డి జ్ఞాపకార్థంగా రాంరెడ్డి వెంకటరెడ్డి మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటిలలో గెలుపొందిన విజేతలకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చంద్రారెడ్డి, టిపిసి ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్ రెడ్డిల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలలో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి చరణ్ రెడ్డి,గుండె బోయిన నాగమణి,బి.ప్రవీణ్ నాయక్, రామచంద్ర నాయక్,మండల అధ్యక్షుడు ధనియాకుల రామారావు, ఉపాధ్యాయ నాయకులు ఆజ్మీర శంకర్ నాయక్, నాయకులు జాస్తి సాగర్ బాబు, సూరపు రెడ్డి వెంకట్ రెడ్డి, చిలక బాబు, సత్యనారాయణ, రామకృష్ణ రావు, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధృవీకరణ పత్రాల కోసం ప్రజల ఇబ్బందులు

నవతెలంగాణ-చెన్నారావుపేట

బీసీ కులాల అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా రూ, లక్ష ఆర్థిక సహాయం చేయాలని ప్రకటించిన నేపథ్యంలో సంబంధిత ధ్రువపత్రాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుల ధ్రువీకరణ, ఆదాయ పాత్రల కోసం తహసిల్దార్ కార్యాలయంలో అర్జీ పెట్టుకుంటున్నారు పది రోజుల నుండి కార్యాలయం చుట్టూ ధృవీకరణ పత్రాల కోసం ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. ఒకవైపు తెలంగాణ దశాబ్ది ఉత్సవాల కార్యక్రమాలలో రెవెన్యూ అధికారులు పాల్గొంటున్నారు. దీంతో అర్జీదారులకు అధికారులు అందుబాటులో ఉండడం లేదు, మరోవైపు కార్యాలయంలో అధికారులు కంప్యూటర్లు సర్వర్ పని చేయడం లేదని సమాధానం చెబుతున్నారు. సహాయం పొందడానికి దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 20 చివరి తేదీ కావడంతో ధ్రువీకరణ పత్రాలు కోసం అర్జీలు పెట్టుకున్నవారు. ఆందోళన చెందుతున్నారు. రెవెన్యూ కార్యాలయంలో అధికారులు గంటలు తరబడి కంప్యూటర్ ముందు కూర్చుంటున్న ఎంట్రీ మాత్రం ఆలస్యం అవుతున్నాయి, దీంతో కట్టలు కట్టలుగా 2000 వరకు దరఖాస్తులు పెండింగ్లో ఉన్నట్లు సమాచారం, మరోవైపు పాఠశాలలు, కళాశాలలు ప్రారంభ సమయం కావడంతో విద్యార్థులకు కూడా ఈ సమయం కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు తగు చర్యలు తీసుకొని గడువు పొడిగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అయితే ఇదే విషయంపై ఇన్చార్జి తహసిల్దారును నవ తెలంగాణ వివరణ కోరగా సర్వర్ డౌన్‌తో సర్టిఫికెట్లు జారీ ఆలస్యం అవుతుందని తెలిపారు.

కాంగ్రెస్ నాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

నవతెలంగాణ-చెన్నారావుపేట

అభివృద్ధి విషయంలో ప్రశ్నించినందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు తనను అకారణంగా కులం పేరుతో దుర్భాశలాడుతూ దాడి చేశారన్న ఫిర్యాదు మేరకు ఎస్.సి.ఎస్.టి.అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు చెన్నారావుపేట పోలీసులు గురువారం తెలిపారు.వివరాల్లోకి వెళ్తే మండల పరిధిలోని కందిగడ్డ తండా గ్రామ పరిధిలోని నడిమి తండాలో మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి బుధవారం రాత్రి జోడో యాత్ర పాదయాత్ర చేస్తుండగా ఇదే తండాకు చెందిన పాండ్య వెంకన్న అనే వ్యక్తి మా తండాలో మీరు ఏమి అభివృద్ధి పనులు చేయలేదని ఏ ముఖం పెట్టుకుని పాదయాత్రకు వచ్చారని నిలదీస్తుండగా కాంగ్రెస్ నాయకులు సిద్ధన రమేష్, మొగిలి వెంకట్ రెడ్డి,బండి హరీష్, చీకటి రాజు గౌడ్,బూడిద వెంకన్నలతో మరికొందరు కులం పేరుతో ఇష్టానుసారంగా తిడుతూ దాడి చేశారని బాధిత వ్యక్తి స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.కాగా బాధిత వ్యక్తి ఫిర్యాదు మేరకు సదరు నాయకులపై బుధవారం ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధింపులు - కేసు నమోదు

నవతెలంగాణ-గార్ల

అదనపు కట్నం కోసం భార్యను వేదిస్తున్న భర్త పై కేసు నమోదు చేసిన సంఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై బానోత్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రాజు తండాకు చెందిన బానోత్ చిత్ర అదే గ్రామానికి చెందిన బానోత్ శ్రీనివాసరావు అనే వ్యక్తిని 2009 సంవత్సరంలో పెళ్లి చేసుకుంది. వారికి ఇద్దరు మగ సంతానం కాక పెళ్లయిన తర్వాత వారి సంసారం సాఫీగానే సాగిందని ఆ తరువాత భర్త శ్రీనివాసరావు తన భార్య చిత్రను శారీరకంగా, మానసికంగా వేధిస్తూ అదనపు కట్నం తీసుకోరావాలని గొడవపడి ఇంట్లో నుండి వెళ్ల గొట్టగా స్దానిక పోలీసుస్టేషనులో చిత్ర ఇచ్చిన పిర్యాదు మేరకు భర్త శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.

ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-నెల్లికుదురు

మండలంలోని తార సింగ్ బావి తండాకు చెందిన గుగులోతు యాకూబ్ చెందిన సెల్‌ఫోన్ పోయిందని పోలీసుల ఫిర్యాదు చేయగా దానిని దొరకబట్టి బాధితుడు అయిన యాకూబ్ సెల్‌ఫోన్ అప్పగించినట్లు నెల్లికుదురు ఎస్ఐ క్రాంతి కిరణ్ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 20 రోజుల క్రితం తారా సింగ్ బావి తండకి చెందిన గుగులోత్ యాకూబ్ తన సెల్ ఫోన్ తన జేబులో నుండి కింద పడిపోగా నెల్లికుదురు ఫిర్యాదు చేయగా సి ఈఐఆర్ పోర్టల్‌లో కానిస్టేబుల్ సోమలింగం నమోదు చేశారని, ఫోన్ దొరికిన వ్యక్తిని గుర్తించి నెల్లికుదురు ఎస్సై కనుకుల క్రాంతి కిరణ్ ఎస్సై కానుకుల క్రాంతి కిరణ్ చేతుల మీదుగా బాధితుడికి ఆయన యాకోబుకు ఫోను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఆదర్శవంతంగా నర్సంపేట పట్టణ ప్రగతి

నిండుగా కేసీఆర్, కేటీఆర్ ఆశీస్సులు... కోట్లాది నిధులతో పురోభివృద్ధి - నెల రోజుల్లో మిషన్ భగీరథ మంచి నీరు - ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

నవతెలంగాణ-నర్సంపేట

నర్సంపేట పట్టణాన్ని అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దామని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో శుక్రవారం పట్టణంలో నెక్కొండ రోడ్డులోని పట్టణ ప్రకృతి వనాన్ని, ఎన్‌టీఆర్ నగర్‌లో రూ.2 కోట్లతో దోబి ఘాట్ నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం సిటిజన్ క్లబ్ ఫంక్షన్ హాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనీకిషన్ అధ్యక్షతన నిర్వహించిన పట్టణ ప్రగతి దినోత్సవంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం రాక ముందు పంచాయతీలు, మున్సిపాలిటీలు నిధులు లేమితో నిర్వీర్యమైయ్యాయన్నారు.పట్టణాలు, పల్లెల్లో ఎక్కడి చెత్త అక్కడే, మురికి కూపంగా ఉండేవని తెలిపారు. ఉద్యమ నాయకుడే కేసీఆర్ ముఖ్యమంత్రిగా పదవీ చేపట్టిన ఈ తొమ్మిదేండ్లలో పల్లెలు, పట్టణాలు పరిశుభ్రంగా మారాయని తెలిపారు.కోట్లాది నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం సమర్థవంతంగా పనిచేయడం వల్ల నేడు ఊర్లు, పట్టణాల స్వరూపమే మారిపోయిందని, ఎక్కడ చూసిన పచ్చదనం స్వాగతం పలుకుతుందని సంతృప్తి వ్యక్తం చేశారు. నర్సంపేట పట్టణానికి అడిగిన వెంటనే మంత్రి కేటీఆర్ కోట్లాది నిధులు విడుదల చేశారని ఈ నాలుగున్నర యేండ్లలో పట్టణాన్ని అబ్బురపర్చేలా తీర్చిదిద్దామని తెలిపారు. ఒకేఒక్క కిలో మీటర్ ఉన్న సెంట్రల్ లైటింగ్, డివైడర్‌లను 12 కిలో మీటర్‌లకు విస్తరించామన్నారు. తొమ్మిది కిలో మీటర్‌ల అంతర్గత బీటీ, సీసీ రోడ్లను, మూడు కిలో మీటర్‌ల బైపాస్ రోడ్డులో సీసీని విస్తరించామని చెప్పారు. రూ.9 కోట్లతో డ్రైయినేజీ కాలువల నిర్మాణం చేశామన్నారు. రూ.6 కోట్లతో పాకాల ఆడిటోరియం సెంట్రల్ ఏయిర్ కండీషన్‌తో నిర్మాణం చేశామని మరో నెల రోజుల్లో ప్రారంభించుకోబుతున్నామన్నారు. వెయ్యి మంది సీటు కెపాసిటీ గల ఈ ఆడిటోరియాన్ని సమావేశాలు, వేడుకలకు నామమాత్రపు నిర్వహణ ఖర్చులతో ఉచితంగా ఉపయోగించుకొనే అవకాశాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. నెల రోజుల్లో మిషన్ భగీరథ మంచి నీటిని ఇంటింటా అందిస్తామన్నారు. రూ.32 కోట్ల నిధులతో 24లక్షల లీటర్‌ల సామార్థం కలిగిన ట్యాంక్‌లు, 174 కిలో మీటర్‌ల పైప్



లైన్ నిర్మాణ పనులు పూర్తి చేశామని త్వరలో ట్రాయల్ రన్ చేసి నెల వ్యవధిలో ఎన్నో యేండ్లగా ఉన్న మంచినీటి సమస్య పరిష్కారం కానుందని తెలిపారు. రూ.15 కోట్లతో ఆయా కులాలకు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేసి అప్పగిస్తామని తెలిపారు. రూ.7 కోట్లతో కుమ్మరికుంట మోడల్ పార్కు, జంక్షన్‌ల నిర్మాణ పనులు ప్రారంభ దశలో ఉన్నాయన్నారు. రూ.కోటి 30లక్షలతో బస్తీ దవాఖానా మంజూరు అయిందని తద్వారా అందుబాట్లో వైద్యారోగ్య సేవలు అందనున్నాయన్నారు. పట్టణ విస్తరిస్తున్నందున భవిష్యత్తు అవసరాలకై రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టడానికి ప్రభుత్వంచే రూ.5 కోట్లను మంజూరు తీసుకొచ్చామన్నారు. ఇక ఇప్పటికే పట్టణంలో రూ.60లక్షలతో గ్రంథాలయాన్ని నిర్మించామని, పీఎన్‌జీ పైప్‌లైన్ వేసి ఇంటింటా వంట గ్యాస్ తక్కువ ధరతో అందుబాట్లోకి తీసుకొచ్చామని గుర్తు చేశారు. గ్యాస్ ధర ప్రస్తుతం రూ.1250 ఉండగా పీఎన్‌జీ పైప్‌లైన్ ద్వారా రూ.730కే సరఫరా అవుతుందని తెలిపారు. మిషన్ భగీరథ, గ్యాస్ పైప్‌లైన్‌తో దెబ్బతిన్న రోడ్లన్నీ రెండు నెలల్లో మరమ్మత్తు పనులను పూర్తి చేయడానికి ఏజన్సీలను ఆదేశించామన్నారు.ప్రజలు ఒకసారి అవకాశం ఇస్తేనే ఇంతటి అభివృద్ధిని చూపించామని భవిష్యత్‌లోనూ ఈ ఆశీస్సులు కొనసాగిస్తే పట్టణాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఉత్సాహించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే, ఆర్డీవో సీ.శ్రీనివాసులు, ఎఫ్ఆర్‌వో రమేష్, కమిషనర్ నాయిని వెంకటస్వామి తదితర అధికారులు, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

చెక్ డాములతో భూగర్భ జలాలు : ఎంపీఓ

నవతెలంగాణ-చెన్నారావుపేట

చెక్ డ్యామ్ నిర్మించడంతో భూగర్భ జలాలు పెరుగుతాయని ఎంపీఓ శ్రీధర్ రాజు అన్నారు.ఎంపీడీవో ఈ, భారతి ఆదేశాల మేరకు నెహు యువ కేంద్రీయ వరంగల్ ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి శ్రీధర్ రాజు పాల్గొని వర్షపు నీటిని ఆదా చేయడంపై అవగాహన కల్పించడంతోపాటు ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెరువులలో పూడిక తీయడం ఇంకుడు గుంతలను, చెక్ డ్యామ్ లను నిర్మించుకోవడంతో భూగర్భ జలాలు పెరిగి ప్రజలకు త్రాగునీరు పశువుల, జంతువులకు, పిచ్చుకలకు నీటి కొరత లేకుండా ఉంటాయన్నారు. వర్షపు నీటిని ఆదా చేయడంపై భావితరాలకు నీటి సమస్య ఏర్పడకుండా చేయవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ అరుణ, పంచాయతీ సెక్రెటరీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టిపిలు, నెహ్రూ యువ కేంద్రీయ వాలంటరీ, యూత్ తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-కాశిబుగ్గ

గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ కిసాన్ మోర్చా నూతన కమిటీని శుక్రవారం ఏనుమాముల పార్టీ కార్యాలయంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు కొత్తకొండ రాజు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కొత్తకొండ రాజు మాట్లాడుతూ విత్తనం మొదలు పంట అమ్ముకునే వరకు రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి కిసాన్ మోర్చా నాయకులు అండగా ఉండాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కిసాన్ మోర్చా నూతన డివిజన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా సిరిగిరి జంపయ్య, సిహెచ్.సాంబయ్య, ఉపాధ్యక్షులు గంధం కుమార స్వామి, పస్తం సమ్మయ్య కార్యదర్శులుగా గంధం మధు, గంధం సారంగం, కార్యవర్గ సభ్యులుగా ఎం.కొమ్మలు, శంకర్, జి.కొమ్మలు, రాజశేఖర్, రాజేష్, దేవకుమార్ లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు కూచన బిక్షపతి, ఓర్సు దేవేందర్, సూర కుమార్, పస్తం సమ్మయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

మంచినీటి పండుగను విజయవంతం చేయాలి

ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు



నవతెలంగాణ-ఖానాపురం

దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదివారం చేయబోయే మంచినీటి పండుగను విజయవంతం చేయాలని ఎంపీపీ వేములపల్లి ప్రకాష్‌రావు అన్నారు. ఈ సందర్భంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు హాజరై మాట్లాడారు. రానున్న 17వ తారీఖున గిరిజన ఉత్సవం, 18న మంచినీటి పండుగ, 19న హరితోత్సవం కార్యక్రమాలను అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు తెలిపారు. హరిత ఉత్సవ కార్యక్రమానికి పంచాయతీ కార్యద ర్శులు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుమనవాని, ఎంపీఓ పసరగొండ రవి, నీటిపారుదల శాఖ ఇంజనీర్ మౌనిక, ఏపీఓ సునీత, పర్యవేక్షకులు వెంకటేశ్వర రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ పృథ్వీరాజ్, తదితర పంచాయతీ కార్యదర్శులు ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సర్పంచ్ చేయూత

నవతెలంగాణ - పర్వతగిరి

మండలంలోని చింతనెక్కొండ గ్రామానికి చెందిన నరిగే పూర్ణ చందర్ భార్య సుమలత ఇటీవల విద్యుత్ షాక్ తో మతి చెందగా శుక్రవారం స్థానిక సర్పంచ్ గటిక సుష్మా మహేష్ పూర్ణ చందర్‌ను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.అనంతరం ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో కుల పెద్దలు మడూరి రాజు, నరిగే సాంబయ్య, నాగయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం

నవతెలంగాణ-వరంగల్

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని ప్రభుత్వ,ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల కొరకు కౌన్సిలింగ్ ప్రక్రియ శుక్రవారం నుండి కొనసాగుతుందని, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సిలింగ్ ప్రక్రియ ఆప్షన్లో నమోదును ప్రిన్సిపాల్ ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడు ఈనెల 19 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ పాలిటెక్నిక్‌తో పాటు సుబేదారిలోని ఆర్ట్స్ సైన్స్ కళాశాలలో ఉంటుందని, సర్టిఫికెట్ వెరిఫికేషన్ అయిన వారు ఈనెల 21 వరకు ఆన్లైన్లో నమోదు చేసుకోవాలన్నారు. ఐడి, పాస్వర్డ్, డేట్అఫ్‌బర్త్‌ను ఇంటర్నెట్ వాళ్ళు ఎక్కడ రాసుకోకుండా జాగ్రత్త వహించాలి. అన్ని ఆప్షన్లను ముందుగా కాగితం మీద రాసుకొని నమోదు చేసుకోవాలి. మొదటి ఫేసు వారికి ఈనెల 25 వరకు సీట్ అలాట్మెంట్ అవుతుంది. ఆ రోజు నుండి ఈనెల 29 వరకు ఫీజు కట్టి సెల్ఫ్ రిపోర్ట్ చేయవలెను. మొదటి ఫేజ్‌లో సీటు వచ్చిన వారుమంచి ఆప్షన్ కోసం, సీటు రానివారు కూడా రెండవ ఫేసులో ఆన్లైన్లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ హైదరాలి, చంద్ర ప్రకాష్, వేముల రామకృష్ణ పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం



నవతెలంగాణ-లింగాలఘనపురం

మండలంలోని కళ్లెం గ్రామంలో అంగన్వాడీ రెండోవ కేంద్రంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ ప్రత్యేక అధికారి ఐకెపి ఏపిఎం శంకరయ్య మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ విద్యాబోధన చేయాలని కోరారు.ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణీ స్త్రీలు కు శ్రీమంతం చేశారు.ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ మల్లేశం, పిఏసిఎస్ డైరెక్టర్ గణేష్, వైద్య సిబ్బంది క్యాతేణి, అంగన్వాడీ, ఆశవర్కు తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌కు రాష్ట్రాన్ని పాలించే హక్కు లేదు

జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు బొంపల్లి దేవేందర్ రావు

నవతెలంగాణ - పర్వతగిరి

రాష్ట్రంలో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చని బీఆర్ఎస్ ప్రభుత్వానికి రాష్ట్రాన్ని పరిపాలించే నైతిక విలువను కోల్పోయిందని వెంటనే అసెంబ్లీని రద్దుపరిచే ఎన్నికలకు వెళ్లాలని కిసాన్ కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు బోంపెల్లి దేవేందర్ రావు డిమాండ్ చేశారు.సంగెం మండలంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ, ఇటీవల పంట నష్టపోయిన రైతులకు తక్షణమే ఎకరాకి పదివేల ఆర్థిక సహాయం, డబుల్ బెడ్ రూమ్ తదితర హామీలు ఇచ్చినా ప్రభుత్వము ఒకటి కూడా నెరవేర్చలేదని, అధికార దాహంతో సంగెం మండలానికి వస్తున్న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి పర్యటనను కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో అడ్డుకుంటామని హెచ్చరిస్తున్నామన్నారు. టెక్స్టైల్ పార్కులో భూములు కోల్పోయిన రైతులకు 100 గజాల ఇంటి స్థలము తో పాటు ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పి నేటి వరకు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్న ప్రభుత్వ తీరును ఖండిస్తున్నామన్నారు. పరకాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి రైతులను పట్టించుకోవడంలేదని, రాష్ట్ర ప్రభుత్వం రైతుల వద్ద ఎకరాకి 20 లక్షలతో కొనుగోలు చేసి, ఎకరాకి కోటి రూపాయలు అమ్మకం చేపట్టడం సిగ్గుచేటు అని, ధర్మారెడ్డి మరో అమ్మకాలు చేపట్టడం, సిసి రోడ్లు వేయడానికేనా అని కిసాన్ కాంగ్రెస్ ప్రశ్నిస్తుందన్నారు. చల్లా అరాచకాలు అక్రమ మొరం అమ్మకాలు రైతులు గమనిస్తున్నారని రాబోయే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించడానికి రైతులు సిద్ధంగా ఉన్నారని తెలుపుతున్నామన్నారు. ధాన్యం కొనుగోలు చేసి వారాలు గడుస్తున్నా కూడా నేటి వరకు వారి ఖాతాలో డబ్బులు వేయకుండా ప్రభుత్వము నిర్లక్ష్యం వహిస్తుందని వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని రైతులు పంట నష్టం పోయిన బాధితులు టెక్స్టైల్ భూములు కోల్పోయిన బాధితులు తదితర రైతులతో కలిసి కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేటీఆర్ పర్యటనను అడ్డుకుంటామని టిఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చోల్లేటి మాధవరెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఆగపటి రాజు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేష్, వెంకటాపురం మాజీ సర్పంచ్ విలాసాగరం వెంకటేశ్వర్లు, గుల్లపల్లి చంద్రశేఖర్, నరసింహ నాయక్, పులి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.


హామీలు నెరవేర్చకుండా పర్యటనలు ఎందుకు..?

తూర్పు ప్రజలను వంచించడానికే వస్తున్న కేటీఆర్

నవతెలంగాణ-మట్టెవాడ

వరంగల్ తూర్పు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఏ మొహం పెట్టుకొని మంత్రి కేటీఆర్ వరంగల్ తూర్పులో అడుగుపెడుతున్నారని వరంగల్ తూర్పు బిజెపి నాయకులు డాక్టర్ వన్నాల వెంకటరమణ ప్రశ్నించారు. శనివారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పర్యటించనున్న మంత్రి కేటీఆర్ గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేయడానికి వస్తున్నారని ఆరోపిస్తూ మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీలను ప్రశ్నిస్తూ శుక్రవారం బిజేవైఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బహిరంగ లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యే నన్నపనేని ఆధ్వర్యంలో కేటీఆర్ ఎన్నో పర్యటనలు చేసి తూర్పు ప్రజలకు హామీలు ఇచ్చారని అవి నేటికి నెరవేరలేదన్నారు. అర్హులకు డబుల్ బెడ్ రూములు అందని ద్రాక్ష గానే ఊరిస్తున్నాయని, సంవత్సరంలో పూర్తి చేస్తామన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం సగం కూడా పూర్తి కాలేదని, శిథిలావస్థలో ఉన్న ప్రాంతీయ ఆసుపత్రి రోగుల పాలిట శాపంగా మారిందని ఎప్పుడు కోల్పోతుందో అని భయభయంగా బ్రతుకుతున్నారన్నారు. గతంలో వచ్చిన వరదల సందర్భంగా మంప్పు ప్రాంతాల్లో నిర్మిస్తామన్న అండర్ డ్రైనేజ్ పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్నాయని, నూతన పెన్షన్లు, కొత్త రేషన్ కార్డుల జారీ , కూడా నూతన మాస్టర్ ప్లాన్ అమలు,స్మార్ట్ సిటీ పనులు ఏ ఒక్కటి పూర్తి కాలేదని పాత హామీలు నెరవేర్చకుండా కొత్త హామీలతో తూర్పు నియోజకవర్గ ప్రజలను వంచించాడనికి మళ్ళీ వస్తున్నాడని అన్నారు.ఇచ్చిన అన్ని హామీలను వెంటనే అమలు చేయాలని అన్నారు. వరంగల్ తూర్పులో బీడీ కార్మికుల సంఖ్య అధికమని రెక్కాడితే కని డొక్కా ఆడని పరిస్థితి అని వారికి పిచన్ 5 వేల రూపాయలు ఇయ్యలని డిమాండ్ చేశారు. ఇచ్చిన అన్ని హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సముద్రాల పరమేశ్వర్ బిజెవైఎం నాయకులు రజినిష్ పాల్గొన్నారు.

ఇల్లు లేని పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



నవతెలంగాణ-మట్టెవాడ

కిలా వరంగల్ లోని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్వే ప్రజా సమస్యలను వెలికితీయడానికి బాగా ఉపయోగపడుతుందనీ ఐద్వా వరంగల్ జిల్లా కార్యదర్శి నళిగంటి రత్నమాల అన్నారు. వరంగల్ జిల్లాలోని భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సిపిఎం కిలా వరంగల్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో టి భవాని తడక మాంస ఆధ్వర్యంలో గడపగడపకు ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించునారు. ఈ సర్వేలో ప్రజలు మహిళలు నాయకత్వం దష్టికి అనేక సమస్యలను తీసుకువచ్చారు. ఈ సర్వేలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ పేదలు, మధ్యతరగతి వర్గాల ప్రజలు ఉండడానికి ఇల్లు లేక కిరాయిలు కట్టలేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారనీ,అనేక సందర్భాలలో తమకు ఇంటి జాగా కోసం లేక డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం అప్లికేషన్లు పెట్టుకున్నా ప్రభుత్వం పెడ చెవిన పెడుతుందన్నారు. 58 జీవో ప్రకారం ఇల్లు జాగా లేని పేదలందరికీ 120 గజాల భూమిని 321 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ స్థలాన్ని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఈ సర్వే ద్వారా ప్రజాసమస్యలు కనులకు కట్టినట్లుగా తెలిసి వస్తున్నాయని ప్రజా సమస్యలపై పోరాటానికి ప్రజాసంఘాలకు సర్వే ఎంతో దోహద పడుతుందన్నారు. ఈ సర్వేలో చందన, భాగ్య, కవిత, రేణుక, శ్రీలత పాల్గొన్నారు.

గ్రూపు 4 పరీక్షలకు ఏర్పాట్లు చేపట్టాలి

నవతెలంగాణ-మహబూబాబాద్

గ్రూప్ 4 పరీక్షలకు ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసిలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జులై ఒకటో తారీకు నుండి నిర్వహించబోయే గ్రూపు 4 పరీక్షల ఏర్పాట్లను అదనపు కలెక్టర్ డేవిడ్ తో కలిసి కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రూపు 4 పరీక్షలకు జిల్లాలో 14,207 అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నారని 46 కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తాసిల్దార్లను రూట్ ఆఫీసర్లుగా నియమించాలని, పరీక్షా కేంద్రాలను పర్యటించి మౌలిక వసతుల కల్పనపై నివేదిక తీసుకోవాలని ఆర్డీవోలకు సూచించారు. 46 పరీక్ష కేంద్రాలలో అత్యధికంగా మహబూబాబాద్‌లోనే 18 కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు.పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరిటెంట్లను నియమించాలని అదేవిధంగా లైసెన్ ఆఫీసర్లను కూడా నియమించాలన్నారు .నెలాఖరులో పరీక్షను సజావుగా నిర్వహించేందుకు గాను అవగాహన కల్పించేందుకు రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని, అనంతరం వారి నుండి ఫీడ్బ్యాక్ తీసుకోవాలన్నారు.సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయించాలన్నారు ఆర్టీసీ అధికారులు పరీక్షల సమయాలలో బస్సులను సకాలంలో నడిపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు పరీక్షల నిర్వహణ సమయంలో 144 సెక్షన్అమల్లో ఉంటుందని పరిసరాల్లోని జిరాక్స్ సెంటర్లను మూసి వేయించాలన్నారు.పరీక్షలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అధికారులు సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ పర్యవేక్షణ లోపం లేకుండా చర్యలు తీసుకోవాలనికలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డేవిడ్ మహబూబాబాద్ తొర్రూరు ఆర్‌డిఓలు కొమరయ్య, రమేష్, డిఆర్‌డిఏ పిడి సన్యాసయ్య, విద్యాశాఖ అధికారి రామారావు, హార్టికల్చర్ అధికారి సూర్యనారాయణ, తాసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

రాయిపెల్లి యాకయ్య గౌడ్ సేవలు అభినందనీయం



నవతెలంగాణ-తొర్రూర్ రూరల్

మండలంలోని కొమ్మనపల్లి తండా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయిపెల్లి యాకయ్య గౌడ్ సేవలు అభినందనీయమని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, జిల్లా అడిషనల్ కలెక్టర్ అభిలాష అభినవ్‌లు అన్నారు. ఉపాధ్యాయుడుగా సేవలందిస్తూ లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు టీచర్స్ అధ్యక్షునిగా వివిధరకాల సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అదేవిధంగా ఈ మధ్య దశాబ్ది ఉత్సవాలలో నిర్వహించిన సీఎం కప్ నిర్వహణలో సమన్వయకర్తగా చురుకుగాపనిచేసినందుకు, తొర్రూర్ ఎంప్లాయిస్ వాలీబాల్ అసోసియేషన్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తూ వివిధ రకాల సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న యాకయ్య గౌడ్ సేవలను గుర్తిస్తూ స్థానిక ఎల్‌వైఆర్ గార్డెన్‌లో తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శాలువా మెమెంటోతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా యాకయ్య గౌడ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఈ సత్కారం తనపై మరింత బాధ్యత పెంచిందని అన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, అడిషనల్ కలెక్టర్ అభిలాష అభినవ్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉత్తమ మున్సిపాలిటీ అవార్డు అందుకున్న చైర్మన్ కమిషనర్



నవతెలంగాణ-మహబూబాబాద్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ మున్సిపాలిటీ అవార్డును మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ డా. పాల్వాయి రాంమోహన్ రెడ్డి,మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి అందుకున్నారు. శుక్రవారం హైదరాబాదులో శిల్పకళా వేదికలో జరిగిన కార్యక్రమంలో అవార్డు అనుకున్నారు. మున్సిపల్ ఇన్నోవేటివ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ విభాగంలో 50000 -100000 జనాభా క్యాటగిరిలో జంక్షన్ అభివృద్ధి మీడియన్స్ డెవలప్మెంట్ క్యాటగిరిలో ఉత్తమ మున్సిపాలిటీగా మహబూబాబాద్ మున్సపాలిటీని ఎంపిక చేశారు అవార్డు పొందడం పట్ల మున్సిపల్ కౌన్సిలర్లు పాలకమండలి వర్షం వ్యక్తం చేసింది.

ఘనంగా మహేష్ జన్మదిన వేడుక



నవతెలంగాణ-నెల్లికుదురు

బిఆర్ఎస్ నెల్లికుదురు మండల సోషల్ మీడియా ఇన్చార్జి ఎఢ్ల మహేష్ జన్మదిన వేడుకను ఘనంగా నిర్వహించినట్లు వైస్ ఎంపీపీ జిల్లా వెంకటేష్,ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు బత్తిని అనిల్ గౌడ్,బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి వెన్నాకుల శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలోని జన్మదిన వేడుకను పురస్కరించుకొని కేకును కట్ చేసి మిఠాయిలు పంచుకొని పేదలకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధిలో తన వంతు కృషి చేస్తున్నాడని పార్టీలో చురుకైన వ్యక్తిగా ఉండి సోషల్ మీడియాలో ఇప్పుడు పని చస్తున్న మహేష్‌కి ఈ సందర్భంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని అన్నారు. రానున్న రోజుల్లో శంకర్ నాయక్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పేరుమాండ్ల జగన్నాథం, ట్రస్ట్ చైర్మన్ పెరుమాండ్ల జగన్, పట్టణ అధ్యక్షుడు అశ్విని, యాదవ సంఘం మండల అధ్యక్షుడు బొల్లు లింగమూర్తి, నాయకులు హనుమ నాయక్,యాదరాజు సాయి, ఈసంపల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



నవతెలంగాణ-నెల్లికుదురు

అధిక ఫీజులు వసూలు చేసే ప్రైవేటు బడులు వద్దు అని సకల సౌకర్యాలు కలిగిన ప్రభుత్వ బడులే ముద్దుయని మండల విద్యాశాఖ అధికారి గుగులోతు రాము అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో శుక్రవారం పాఠశాలలకు పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ఎంఈఓ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వరాష్ట్రం సిద్ధించాక కేసీఆర్ ప్రభుత్వ బడుల బాగుపై ప్రత్యేక దృష్టి సారించి కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తయారు చేశారన్నారు. మన ఊరు మనబడి కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలు అత్యాధునిక సౌకర్యాలతో అద్దంలా మెరుస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ బడుల్లో విద్య నభ్యసించే విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ ఉపకార వేతనాలు నాణ్యమైన మధ్యాహ్న భోజనంలతోపాటు మరెన్నో ఉచిత సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రభుత్వం ఈ ఏడాది నుంచి విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను కూడా అందిస్తున్నందని తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు నోటు పుస్తకాలను కూడా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నెల్లికుదురు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇంద్రసేనారెడ్డి, ఉపాధ్యాయులు లక్ష్మణ్, శ్రావణి, మండల ఎంఐఎస్ కోఆర్డినేటర్ మస్కపురి సుధాకర్, కంప్యూటర్ ఆపరేటర్ హెచ్ ఉపేందర్, సీఆర్పీ బొడ్డు వీరస్వామి, మెసెంజర్ రత్నపురపు యాకయ్య తదితరులు పాల్గొన్నారు

ఎమ్మెల్యే డౌన్... డౌన్...

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా దశాబ్ది ఉత్సవాలు పేరిట స్థానిక ఎమ్మెల్యే డా తాటికొండ రాజయ్య చుక్కెదురైంది. మండలంలోని రాఘవాపూర్‌లో చేపట్టిన పల్లె ప్రగతి నివేదన యాత్రలో శుక్రవారం పర్యటించారు. గ్రామస్థులు సమావేశం ముగిసిన అనంతరమే ఒక్కసారిగా గ్రామస్థులు ఏం అభివృద్ధి చేశావని, గతంలో చేసిన హామీలు ఏమయ్యాయని నిలదీశారు. గ్రామంలో ఇచ్చిన డబుల్ బెడ్ రూం ఇండ్ల పంపిణీలో అర్హులైన వారికి అన్యాయం జరిగిందని, మిగిలిన ఏడుఇండ్ల పంపిణీలో జాప్యం ఎందుకు చేస్తున్నారని ఎమ్మెల్యేను నిలదీశారు.



నవతెలంగాణ
హనుమకొండ, భూపాలపల్లి, ములుగు
శనివారం 17 జూన్ 2023

వెంకన్న సన్నిధిలో ఎమ్మెల్యే చల్లా దంపతులు



నవతెలంగాణ - నడికూడ

తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని శుక్రవారం ఉదయం పరకాల శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ శ్రీవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో పాడిపంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

18న కాళేశ్వరానికి 'పురుషోత్తమ భారతి' రాక

నవతెలంగాణ-మహదేవపూర్

మహదేవపూర్ మండలం శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం కాళేశ్వరానికి శ్రీ శంగేరి శివ గంగ మఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ పురుషోత్తమ భారతి స్వామి వారు 18న సాయంత్రం 6 గంటలకు వస్తున్నారు. రాత్రి 8 గంటలకు వేములవాడ సత్రంలో శ్రీ చంద్రమౌళీశ్వరా పూజ చేస్తారు. 19.06.2023 సోమవారం ఉదయం 9 గంటలకు స్వామివారి దర్శనం అనంతరం అనుగ్రహ భాశనం అనంతరం చంద్రమౌళీశ్వర పూజచేస్తారని ఆలయ ఈవో మహేష్ ఒక ప్రకటన పేర్కొన్నారు. భక్తులందరూ పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు

దేవుళ్ళ రూపంలో ఉన్న మనుషుల విగ్రహాలు తొలగించాలి

బారత యాదవ సమితి డిమాండ్

నవతెలంగాణ-మల్హర్‌రావు

దేవుళ్ళ రూపంలో ఉన్న మనుస్యుల విగ్రహాలను తొలగించాలని, దీని కొరకు దేశవ్యాప్తంగా ఒక ప్రత్యేక చట్టం తీసుకరావాలని, బారత యాదవ సమితి చేస్తున్న రాజీలేని పోరాటంలో మరో అధ్యాయనం మొదలైందని బారత యాదవ సమితి (బివైఎస్)రాష్ట్ర అధ్యక్షుడు దాసరి నగేష్,వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ది రమేష్ యాదవ్, సలహాదారు తోకల శ్రీనివాస్ యాదవ్ లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ లోని రాజమండ్రి పుష్కర ఘాట్ వద్ద పలుచోట్ల శ్రీకష్ణుని రూపంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాలను తొలగించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకష్ణరెడ్డికి వినపత్రాన్ని శుక్రవారం అందజేశారు.అనంతరం మీడియాతో మాట్లాడారు రాజమండ్రి ఘాట్ వద్ద, ఆంధ్రప్రదేశ్ లో పలు చోట్ల దేవుడైన శ్రీకష్ణుని విగ్రహాలను సినీ నటుడు,రాజకీయ నాయకుడు ఎన్టీఆర్ రూపంలో ప్రతిష్టించడం జరిగిందని,ఇది హిందువుల ముఖ్యంగా శ్రీకష్ణ భక్తుల మనోభావాలను కించపరిచవిధంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.దేవుళ్ళ రూపంలో మానవుల విగ్రహాలు పెట్టడాన్ని బారత యాదవ్ సమితి తీవ్రంగా ఖండిస్తున్నట్లుగా చెప్పారుఒక పక్క అవగాన కల్పిస్తూనే మరొక్క పక్క కోర్టుల్లోనూ పోరాటం చేస్తోందన్నారు. బారత దేశంలో ఉన్న హిందువులే కాదు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువులందరికి శ్రీకష్ణుడు ఆరాధ్య దైవన్నారు.హిందూ మతం అత్యంత పవిత్రంగా భావించే భగవత్ గీతను శ్రీకష్ణుడు ప్రబోధించాడని గుర్తు చేశారు.ప్రపంచ వ్యాప్తంగా శ్రీకష్ణుడులి అనేక ఇండ్లు,గోపురాలు ఉన్నాయని అలాంటి దేవుని సినీ,రాజకీయ నాయకులైన ఎన్టీఆర్ రూపంలో ఆరాధించడం హిందూ ప్రజల మనోభావాలను దెబ్బతీయడన్నారు.మత విశ్వాలను అవమాన పరిచేవిధంగా ఉందన్నారు. బావి తరాలు శ్రీకష్ణుడు అంటే ఎన్టీఆర్ రూపంలోనే ఉంటారు అనుకునే ప్రమాదం ఉంటుందన్నారు. కావున తక్షణమే శ్రీకష్ణుడు రూపంలో ఉండే ఎన్టీఆర్ విగ్రహాలను తొలగించాలని, అదే విధంగా భవిష్యత్తులో దేవుని రూపంలో ఎలాంటి విగ్రహాలు పెట్టొద్దని, పెట్టుకునే సంస్కతిని ప్రోత్సహించకుండా హిందూ ధర్మాన్ని రక్షించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేసినట్లుగా తెలిపారు.

చేతి వృత్తుల దరఖాస్తుల గడువును పెంచాలి

రజక సంఘం జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-గణపురం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బీసీ కులాల లో చేతివత్తులు కులాలకు ప్రభుత్వ సహాయం కింద లక్ష రూపాయలు స్కీము కొరకు దరఖాస్తు గడువును పెంచాలని రజక సంఘం జిల్లా నాయకుడు వైనాల వెంకటేశ్వర్లు తెలిపారు శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈనెల 20 వరకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపిందన్నారు కానీ మీ సేవలో సర్వర్ డౌన్ ఉండడం వల్ల. కుల సర్టిఫికెట్. నివాసం. ఆదాయం. సర్టిఫికెట్లు. అప్లికేషన్ డౌన్లోడ్ చేయడానికి సర్వర్ బిజీ వస్తుందన్నారు గత వారం రోజుల నుండి మీసేవ చుట్టూ తిరిగినప్పటికీ సర్వర్ డౌన్ తో సర్టిఫికెట్లు సకాలంలో అందడం లేదన్నారు. సమయం లేక చాలామంది చేతి కుల వత్తుల సభ్యులు అప్లై చేయక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి గడువును పెంచాలని ఆయన అన్నారు.

ఆ సౌకర్యాల నడుమ బ్రిడ్జి ప్రారంభం సరికాదు

నవతెలంగాణ-మల్హర్‌రావు

ఆ సౌకర్యాల నడుమ మానేరుపై బ్రిడ్జిని ప్రారబించడం సరికాదని, ఇలాగైతే భవిష్యత్‌లో ప్రమాదాలు సంభవించే ప్రమాదం పొంచివుందని, సకల సౌకర్యాలు ఏర్పాటు చేశాల బ్రిడ్జిని ప్రారంభించాలని భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ ఎస్సి సెల్ అధ్యక్షుడు దండు రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు ఖమ్మంపల్లి నుంచి బ్రిడ్జి ప్రారంభం నుంచి ఇరువైపులా తాడిచెర్ల బ్రిడ్జి చివరి అప్రోచ్ రోడ్డుకు రెండు వైపులా సైడ్ రైలింగ్ పెట్టనిదే ప్రారంభం ఎలా చేస్తారని ఆరోపించారు. బ్రిడ్జికి రెండు వైపులా స్పీడ్ బ్రేకర్లు,బ్రిడ్జి పైన విద్యుత్ దీపాలు తదితర రక్షణ చర్యలు చేపట్టకుండా ఆఘమేఘాల మీద బ్రిడ్జిని ప్రారంభించడం సరికాదన్నారు. కనీస రక్షణ చర్యలు లేకుండా మానేరు నదిపై కొత్తగా నిర్మించిన బ్రిడ్జిని ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు.తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి 9 ఏళ్ళ గడిచిపోయి మళ్ళీ ఎన్నికలు రాబోతున్నా తరుణంలో ఓట్లు దండుకోవడానికి బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ఆర్భాటం చేస్తున్నారని ఆరోపించారు.అలాగే కిషన్ రావుపల్లె నుండి భూపాలపల్లి జిల్లా కేంద్రానికి రోడ్డు కలగానే మిగిలిందన్నారు.

దశాబ్ది ఉత్సవాలు ఎవరికోసం ? ఎందుకోసం ?

టిఎస్‌యుఎస్ రాష్ట్ర కన్వీనర్ గట్టయ్య

నవతెలంగాణ- కోల్‌బెల్ట్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలు ఎవరి కోసం? ఎందుకోసం? సింగరేణికి ఏమి సంబంధం అని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కామెర గట్టయ్య ప్రభుత్వాన్ని, యాజమాన్యాన్ని ప్రశ్నించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సింగరేణి కార్మికులు సకల జనుల సమ్మె చేసి, ఆర్థికంగా నష్టపోయి ఉద్యమాలు చేస్తే, నేడు కార్మిక వర్గం సమస్యల్లో చిక్కుకొని కొట్టుమిట్టాడుతున్నదని, కార్మిక సంఘాలు ప్రశ్నించే తత్వాన్ని కోల్పోయి, యాజమాన్యానికి తొత్తుగా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు "తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సాహం" పేరుతో సింగరేణిలో కూడా ఈ దశాబ్ది ఉత్సవాలను ఆడంబరంగా నిర్వహిస్తున్నారని, కోట్లాది రూపాయల కార్మికుల శ్రమను సంబరాల పేరుతో వృధా చేస్తున్నారని, ఏమి సాధించారని ఇంత అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని అన్నారు. ఉద్యమ సమయంలో కార్మిక వర్గానికి కేసీఆర్ ఇచ్చిన హామీలు ఏ ఒక్క హామీ అమలు పరచలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం వస్తే సింగరేణి లో ఓపెన్ కాస్టులను నిలిపివేస్తానని, ఓపెన్ కాస్ట్ గనులను తగ్గిస్తామని, భూగర్భ గనులను పెంచుతామని, రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమగా నడిపిస్తామని, సింగరేణి బొగ్గుగని కార్మికులకు, డిపెండెంటు ఉద్యోగాలు కల్పిస్తామని, కొత్తగూడెంలో మైనింగ్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని, తదితర హామీలిచ్చి విస్మరించారన్నారు. కార్మిక సంక్షేమాన్ని తుంగలో తొక్కుతుంటే కార్మిక సంఘాలు, యాజమాన్యాలు వత్తాసు పలకడం సరికాదన్నరు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

నవతెలంగాణ-ఆత్మకూర్

బీజేపీ పార్టీ కోసం పనిచేసే కార్యకర్తల,నాయకుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటు అండగా ఉంటామని పరకాల మాజీ ఎమ్మెల్యే మోలుగురి బిక్షపతి అన్నారు.శుక్రవారం ఆత్మకూరు మండలం చౌళ్లపల్లి గ్రామానికి చెందిన బీజేపీ మాజీ సర్పంచ్ కుక్కమూడి శ్రీనివాస్ తండ్రి ఉప్పలయ్య అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బిక్షపతి హుటాహుటిన చేరుకొని ఉప్పలయ్య భౌతిక దేహం పై పూల మల వేసి నివాళులు అర్పించారు. కుక్కమూడి బిక్షపతి ని ఓదార్చి ప్రగాఢ సంతాపాన్ని తెలియచేస్తూ మీ కుటుంబానికి అండగా ఉంటు ఆదుకుంటామని మెలుగూరి బిక్షపతి భరోసానిచ్చారు.బీజేపీ పార్టీ కోసం పనిచేసే నాయకులు, కార్యకర్తల కుటుంబాల కష్ట సుఖాలలో పాలుపంచుకొని ఆర్థికంగా ఆదుకొని అండగా ఉంటామని అన్నారు. ఎవరికీ ఏ కష్టం వచ్చిన 24 గంటలు అందుబాటులో ఉండి ప్రజా సేవ చేయడమే నా ధ్యేయంగా పెట్టుకున్నానని అన్నారు. ముందుగా బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జ్ పెసరు విజయచందర్ రెడ్డి అందించిన ఆర్థిక సాయాన్ని మండల అధ్యక్షులు ఇర్సడ్ల సదానందం అందజేశారు.బిక్షపతి తో పాటు రాష్ట్ర నాయకులు ఎన్ రెడ్డి లింగా రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.పి జయంత్ లాల్, పరకాల పట్టణ అధ్యక్షులు మార్త బిక్షపతి, చౌళ్ళపల్లి మాజీ సర్పంచ్ సవాయి రవి, జిల్లా కన్వీనర్ ఎదులాపురం శ్రావణ్ కుమార్, మండల ఉపాధ్యక్షులు పూజారి రవి,ఓబిసి మండల నాయకులు మోరె రాజేశ్వర్, బూత్ అధ్యక్షులు యాద కుమార్,కోరె కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విలాసాగర్‌లో జోరుగా ఇసుక అక్రమ రవాణా !

మానేరు నది నుండి ట్రాక్టర్లతో ఇసుకను కొల్లగొడుతున్న అక్రమార్కులు
ప్రభుత్వ పనుల పేరిట అక్రమ రవాణా..
పట్టించుకోని అధికారులు ?



నవతెలంగాణ-కాటారం

కాటారం మండలంలోని విలాసాగర్ గ్రామంలో అక్రమ ఇసుక రవాణా 'మూడు పువ్వులు ఆరు కాయలుగా' కొనసాగు తోంది. ఇసుక అక్రమ రవాణను ఆపకపోవడంతో విలాసాగర్ గ్రామం వ్యాప్తంగా ఇసుక నిల్వలు దర్శనమిస్తున్నాయి. మానేరు నది నుండి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహారించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతు న్నాయి. విలాసాగర్ గ్రామంలోని మానేరు నది నుంది అక్రమార్కులు పదుల సంఖ్య లో రోజూ అక్రమ ఇసు కను తరలిస్తూ లక్షలు ఘటిస్తున్నారు. ట్రాక్టర్‌కు రూ.4 వేల నుండి 5 వేలు తీసుకోంటున్నారు. ఇసుక రవాణా కోసం అధికారుల నుండి ఎ లాంటి అనుమతులూ తీసుకోకుండా ఇసుకను తరలిస్తున్నారు. విలాసాగర్ లోని వివిధ ప్రాంతా ల్లో ఇసుక డంపులు వేస్తూ అక్రమ ఇసుక వ్యాపారం కొనసా గిస్తు న్నారు. విలాసాగర్ లో అక్రమ ఇసుక రవాణను అడ్డుకోక వడం పట్ల అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విలాసాగర్ అక్రమ ఇసుక రవాణ జోరుగా కొనసాగుతున్న రెవెన్యూ, మైన్స్, పోలీసులు పట్టించుకోకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విలా సాగర్ అక్రమ ఇసుక రవాణను అడ్డుకోం టామని అంటున్న అధికారుల మా టలు కేవలం వట్టి మాటలు గానే మిగులుతు న్నాయి. రోజు ట్రాక్టర్లల్లో అక్రమ ఇసుక రవాణ కొనసాగుతూనే ఉంది. పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుకను అక్రమార్క్కు లు రవాణ చేస్తూనే ఉన్నారు. విలాసాగర్ అక్రమ ఇసుక ర వాణను అడ్డుకోవాలని ప్రజలు చెబుతున్నా అధికారులు ప ట్టించు కోక పోవడం విడ్డూరం. విలాసాగర్ లో జోరుగా అక్రమ ఇసుక రవాణా జరుగు తున్న జిల్లా స్థాయి అధికారు లు 'నిమ్మకు నీరెత్తినట్లు' వ్యవహారించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విలాసాగర్ లో జోరుగా కొనసా గుతున్న అక్రమ రవాణ ఇసుక్పై ప్రజలు చర్చించుంటు న్నారు.రాత్రింబవళ్లూ ఇసుక రవాణా ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతున్న వారు పగలు మాత్రమే ఇసుక తీసుకపోవాలి. అధికారులతో ప్రభుత్వానికి రుసుం చెల్లించి ఇసుకను తీసుక పోవాలి కానీ విలాసాగర్ లో మాత్రం అవి ఏమీ లేకుండానే ఇష్టారాజ్యంగా ఇసుకను మానేరు నది నుండి అక్రమంగా రాత్రీపగలు అనకుం డా తోడేస్తున్నారు.

ఎక్కడ చూసినాఇసుక డంపు నిల్వలే..

విలాసాగర్ గ్రామం వ్యాప్తంగా ఇసుక డంపు నిల్వలు భారీగా చేశారు. కొందరు ఇసుక వ్యాపారులు మానేరు నది నుండి ఇసుకను తెచ్చి విలాసాగర్ లో అక్కడక్కడ డంపులు గా నిల్వలు దర్శనమిస్తున్నాయి. గ్రామంలో వివిధ వార్డుల్లో ఇసుక డంపులు భారీగానే దర్శనమిస్తున్నాయి. ఇసుక వ్యాపారులు అక్రమంగా రవాణా చేసుకొన్న ఇసుకను అమ్ముకొంటున్నారు. విలాసాగర్ భారీగా ఇసుక డంపులు కని పించిన అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం గమనార్హం. ఇసుక అక్రమ రవాణా వ్యవహారం అంతాకూడా అధి కారుల కనుసైగలో నడుస్తోందని సమాచారం. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి విలాసాగర్ లో కొనసాగుతున్న అక్రమ ఇసుక రవాణను అడ్డు కునేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు వేడుకుంటున్నారు

డ్రైనేజీ నిర్మాణానికి మోక్షం కలిగేనా ?

నవతెలంగాణ - శాయంపేట

శాయంపేట గ్రామంలో చేపడుతున్న రోడ్డు పనులలో డ్రైనేజీ కాల్వలను తొలగించడంతో, రోడ్డు పక్కన నీరు చేరి చిన్నపాటి తటకాన్ని తలపిస్తుంది. నీరు నిల్వ ఉండడంతో దోమలు ప్రబలుతున్నాయి. దీంతో చుట్టుపక్కల వారు అనారోగ్యాల బారిన పడుతున్నారు. వివరాల్లోకి వెళితే ....శాయంపేట నుండి ఆత్మకూరు వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు శాయంపేట గ్రామంలో ఇల్లు కోల్పోతుండడంతో పనులు నిలిచిపోయాయి. చివరికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జిల్లా జడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి, ఆర్ అండ్ బి అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించి, రోడ్డు విస్తరణలో ఇల్లు కోల్పోయిన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని హామీ ఇచ్చి, రోడ్డు పనులకు ఆర్ అండ్ బి అధికారులతో మార్కింగ్ చేయించారు. ప్రజలే స్వచ్ఛందంగా తమ ఇండ్లను కూల్చి వేసుకున్నారు. రోడ్డు పనులను మొదలుపెట్టారు. రోడ్డు విస్తరణలో విద్యుత్ స్తంభాలు అడ్డుగా ఉండడంతో జిపి నుండి 6,45,000 నిధులను విద్యుత్ శాఖకు చెల్లించి, ఎట్టకేలకు విద్యుత్ స్తంభాల పునరుద్ధీకరణ చేపట్టారు. రోడ్డు విస్తరణ పనులలో డ్రైనేజీ కాలువలు పూర్తిగా తొలగిపోయాయి. దీంతో డ్రైనేజీ నీరు రోడ్డు పక్కన గుంతలలో చేరి చిన్నపాటి తటాకాలను తలపిస్తున్నాయి. రోడ్డు విస్తరణ పనులు చేపట్టడానికి ముందే సైడ్ కాలువల నిర్మాణం చేపట్టి, రోడ్డు పనులు చేయాల్సి ఉండగా, సైడ్ కాల్వల నిర్మాణానికి నిధులు లేకపోవడంతో కేవలం రోడ్డు పనులు మాత్రమే అధికారులు చేపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాబోయే వర్షకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ముందుగా సైడ్ కాలువల నిర్మాణం చేపట్టి, రోడ్డు పనులు చేయాలని ప్రజలకు కోరుతున్నారు.





సంక్షేమ పథకాల అమలు తీరు బాగుంది

నవతెలంగాణ-సుబేదారి

తెలంగాణ రాష్ట్ర సంక్షేమ పథకాల అమలు తీరు బాగుందని, ప్రజలు వినియోగించుకుంటున్నారని మలేషియా విదేశీ వ్యవహారల సెక్రటరీ శుష్మా సంతప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలందించి, సాదరంగా స్వాగతించారు. అనంతరం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో తెలంగాణ ప్రభుత్వ పథకాల అమలు తీరుపై జిల్లా కలెక్టర్ తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. నూతన కలెక్టరేట్ కాంప్లెక్స్,ఉపాధి హామీ పథకం,పెన్షన్ లు జిల్లా పంచాయతీ శాఖ,రైతు బంధు,దళిత బంధు, వ్యవసాయ శాఖ,ఇండస్ట్రీ విద్యా, ఆరోగ్య శాఖ అధికారులు తమ శాఖల ప్రగతి పై పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని కలెక్టర్ ఆమెకు వివరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు బాగున్నాయని అన్నారు. రాష్ట్రము వచ్చిన తర్వాత అద్భుత ప్రగతి సాధిస్తుంది అని అన్నారు. మలేషియా లో తెలుగు ప్రజలు 5 వేల మంది కి పైగానే నివసిస్తారని అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయలను చక్కగా పాటిస్తారని అన్నారు. దీపావలి పండగను అక్కడ ఘనంగా నిర్వహించడం జరుగుతుంది అని అన్నారు. ఈ సమావేశంలో డీ ఆర్ డీ ఏ పీడీ శ్రీనివాస్ కుమార్ జిల్లా అధికారులు జగదీశ్వర్ హరి ప్రసాద్, అబ్దుల్ హై, మాధవి లత, సాంబశివరావు, రవీందర్ సింగ్, అగ్రికల్చర్ దామోదర్ రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

తాడిచెట్లు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి : గీ కార్మిక సంఘం

నవతెలంగాణ-ధర్మసాగర్

అనుమతులు లేకుండా భూ యజమానులకు తెలవకుండా తాడిచెట్లను తొలగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలనిగీత కార్మికుల సంఘం హనుమకొండ జిల్లా కన్వీనర్ సారా వెంకటేష్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మాకు జీవనాధారమైన తాడి చెట్లను తొలగించిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్మసాగర్ శివారులోని 553/బీ సర్వే నంబర్లో తాడి చెట్లను కొందరు వ్యక్తులు జేసీబీతో తొలగించారని, ఈ తాడిచెట్లను తొలగించడానికి ఎక్సైజ్ శాఖ నుండి ఎలాంటి అనుమతులు తీలుకోలేదనీ అన్నారు. ఆ చెట్లు తన భూమిలోనుండి అక్రమంగా తొలగించారని ఆవేదన వ్యక్తం చేసినప్పటికీ ఫలితం లేదని అన్నారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్లో, ఎక్సైజ్ వారికి ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ సంఘటనను గీత కార్మికులు, గీత కార్మిక సంఘాలు ఖండిస్తున్నాయని అన్నారు. సంబంధిత అధికారులు,ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోకపోతే దశలవారీగా ఉద్యమాలను చేపడతామని హెచ్చరించారు.

బాధిత కుటుంబాలకు పలువురి పరామర్శ

నవతెలంగాణ-మహాదేవపూర్

మండలంలో అబట్ పల్లి గ్రామానికి చెందిన బాసని సమ్మయ్య, మహదేవపూర్ మండల కేంద్రంలోని తుంగల సమ్మయ్య మరణించారు. బాధిత కుటుంబాలను శుక్రవారం పలువురు నేతలు,ప్రజాప్రతినిధులు పరామర్శిచారు. మండల కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న బసని కష్ణ మూర్తిని, మరో మైనార్టీ కుటుంబాన్ని పరామర్శించారు. బిఆర్ఎస్ మంథని నియోజక వర్గం ఇంఛార్జి, మంథని మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ , పార్టీ రాష్ట్ర యువజన నాయకులు జక్కు రాకేష్ పరామర్శించి భరోసా ఇచ్చారు. మండల అధ్యక్షులు, కాళేశ్వరం దేవస్థానం చైర్మన్ లింగంపల్లి శ్రీనివాసరావు, మహదేవ పూర్ సర్పంచ్ శ్రీపతి బాపు, పిఎసిఎస్ చైర్మన్ చల్ల తిరుపతి రెడ్డి, బి ఆర్ ఎస్ పార్టీ మంథని నియోజక వర్గం మహిళ ఇంఛార్జి కేదారి గీత, మండల కో ఆప్షన్ సభ్యులు మసూద్ అలి, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ఒప్పందం

నవతెలంగాణ-హసన్‌పర్తి



మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లోని సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (డీఎస్ సీఐ)తో జూన్ 15న అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. పరస్పర ప్రయోజనం కోసం ఇరు సంస్థలు సంయుక్తంగా సహకరించుకోవాలని ఈ అవగాహన ఒప్పందంలో పేర్కొన్నారు. రీసెర్చ్, ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్, హ్యాకథాన్లు, కార్పొరేట్ ఇన్నోవేషన్, ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ వంటి రంగాల్లో సహకారం ఉంటుంది. ఎస్ఆర్ యూనివర్సిటీ ఇటీవల సైబర్ సెక్యూరిటీలో స్పెషలైజేషన్ కోర్సులను ప్రారంభించింది. ఇది అభివృద్ధి చెందుతున్న రంగం. ఇది విద్యార్థులకు భారీ కెరీర్ అవకాశాలను అందిస్తోంది. ఈ సహకారం విద్యార్థులకు ఈ రంగంలోని నిపుణులను పరిచయం చేయడానికి, వారి పరిశ్రమ సంసిద్ధతను పెంచడానికి సహాయపడుతుంది. వర్ధమాన సాంకేతిక పరిజ్ఞానంలో అగ్రగామిగా నిలవాలన్న ఎస్సార్ యూనివర్సిటీ లక్ష్యంలో ఇది మరో అడుగు ముందుకేసింది. ఎస్సార్ యూనివర్సిటీ వైస్ చాన్స్ లర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్ సమక్షంలో ఎంవోయూపై సంతకాలు జరిగాయి. డీఎస్ సీఐ తరఫున హైదరాబాద్ సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సీఈవో శ్రీరామ్ బిరుదవోలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్సార్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ అర్చన రెడ్డి, ఎస్సార్ యూనివర్సిటీ ఫ్యాకల్టీ అఫైర్స్ డీన్ డాక్టర్ వి.మహేష్, ఎస్సార్ ఇన్నోవేషన్ ఎక్స్చేంజ్ సీఈవో కల్నల్ బీఎస్.రావు పాల్గొన్నారు.

బీసీల రుణాల గడువు పెంచాలి

ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ బెల్లంపల్లి సురేష్

నవతెలంగాణ-మహాదేవపూర్

రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు లక్షా రూపాయాల లోన్ ఇస్తున్న తరుణంలో ఈ ప్రాంతం లో ఉన్న బిసిలకు కుల ఆదాయ పత్రాలు లేక ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని,గడువు పెంచాలని ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ బెల్లంపల్లి సురేష్ కోరారు. కార్యాలయాల చుట్టూ తిరుగుతూ నానా తంటాలు పడాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. తెలంగాణ ప్రభత్వం బిసి ల రుణాలు ఇస్తామని ఈ నెల 20వ తేది చివరి వరకు రుణాల కోసం దరకాస్తులు చేసుకోవాలని సూచించిందని, కానీ కుల ఆదాయ ధృవ పత్రాలు అందక చాలా మంది దరఖాస్తు చేసుకోలేక పోతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా బిసిలపై ప్రభుత్వానికి ప్రేమ ఉంటే దరఖాస్తు గడువు తేదీని పెంచాలని కోరారు. తహశీల్దార్ కార్యాలయంలో తొందరగా కుల ఆదాయ పత్రాలు ఇచ్చేలా చూడాలని కోరారు. ఓ కమిటీ ఎర్పాటు చేసి బీసీల కాలనీలకు వెళ్ళి లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు.

మండుతున్న ఎండలు ... జంకుతున్న ప్రజలు

నవతెలంగాణ-మహాదేవపూర్



మండలంలో ఎండలు భగ్గుమంటున్నాయి. రోహిణి కార్తె ముగింపు దశకు వచ్చినా ఉష్ణోగ్రతలు ఏ మాత్రం తగ్గడం లేదు. దాదాపు నెల రోజులుగా కొనసాగుతున్న ఎండల తీవ్రత శుక్రవారం కూడా కొనసాగింది. ఉదయం 8 గంటలకే మొదలవుతున్న ఎండ పది గంటలకల్లా పతాక స్థాయికి చేరుతుండడంతో జనం ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఈ క్రమంలో గత వారం రోజుల నుండి అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడం నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అవ్వడ తో ఎండ తీవ్రతకు విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలంటే జంకుతున్నారు. జూన్ నెల ప్రారంభమై రెండు వారాలు గడిచినా భానుడి ప్రతాపం తగ్గలేదు వేడిమి ప్రతాపానికి బైటికి వెళ్లాలంటే జనం అల్లాడిపోతున్నారు. ఈనెల 12 మంది విద్యా సంవ త్సరం ప్రారంభం కాగా దీంతో విద్యార్థులకు తప్పని పరిస్థితుల్లో పాఠశాలకు వెళ్లాల్సి వస్తోంది. ఈ క్రమంలో చిన్నారులు ఎండ వేడిని తట్టుకోలేక విలువిల్లాడుతున్నారు. మండల వ్యాప్తంగా వారం రోజుల నుండి ఉష్ణోగ్రతలు పెరిగి 45 డిగ్రీలు పైనే నమోదవుతుండడం, రుతుపవనాల రాక ఆలస్యం అవుతుండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని ప్రతి పాఠశాలలో విద్యార్థులు పాఠశాలకు పూర్తిస్థాయిలో రావడంలేదని టీచర్లు పేర్కొంటున్నారు. ప్రైవేట్ పాఠశాలాలు మాత్రంఒకపూట నడుపుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలోకొన్ని పాఠశా లల్లోఎండా వేడి తట్టుకోలేకచెట్టు కింద పాఠాలు చెబుతున్నామని టీచర్లు పేర్కొన్నారు. పక్క రాష్ట్ర ఆంధ్ర ప్రదేశ్లో ఒక పూట నడుపుతుంటే తెలంగాణ ప్రభుత్వంరెండు పూటలు నడుపుతుందని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వంసెలవులు పొడిగించాలని, లేదా ఒక పూట బడులు నడిపించాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

వధూవరులకు పలువురి ఆశీర్వచనాలు

నవతెలంగాణ-మహాదేవ పూర్

మండలం అంబట్ పల్లి గ్రామంలో వివాహ వేడుకలోశుక్రవారం పాల్గొనీ నూతన వధూవరులు లావణ్య రాజేందర్ లను బిఆర్ ఎస్ పార్టీ మంథని నియోజక వర్గం ఇంఛార్జి,మంథని మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ , బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జక్కు రాకేష్ ఆశీర్వదించారు. మహాదేవ పూర్ మండల అధ్యక్షులు, కాళేశ్వరం దేవస్థానం చైర్మన్ లింగంపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ శ్రీపతి బాపు, పిఎసిఎస్ చైర్మన్ చల్ల తిరుపతి రెడ్డి, బిఆర్ఎస్ మంథని నియోజక వర్గం మహిళ ఇంఛార్జి కేదారి గీత, సీనియర్ నాయకులు పెండ్యాల మనోహర్, అన్కరి ప్రకాష్, పలిమెల మండల అధ్యక్షులు జవ్వాజి తిరుపతి, బి ఆర్ ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోల్కొండ కిరణ్, నియోజక వర్గం యూత్ ప్రధాన కార్యదర్శి మెరుగు శేఖర్, మండల యూత్ అధ్యక్షులు ఆలిం ఖాన్, ఎస్ సి సెల్ మండల అధ్యక్షులు వేమునురి జక్కయ్య, పార్టీ మండల సోషల్ మీడియా ఇంఛార్జి దబ్బెట రవీందర్, బిఆర్ఎం మండల ఉపాధ్యక్షులు చకినారపు చందు, సీనియర్ నాయకులు మాధవరావు, మండల యూత్ ఉపాధ్యక్షులు సంద్ర రాజు, గ్రామ శాఖ అధ్యక్షులు పట్టి వెంకటస్వామి, మండల ఆర్గనైజర్ తలారి గట్టయ్య, మహదేవ పూర్ పట్టణ యూత్ అధ్యక్షులు రేవెళ్ళి రాజశేఖర్, ఎస్ సి సెల్ మండల నాయకులు నిట్టూరి సంతోష్, చింతకుంట్ల సతీష్, అయిళ్ళ సమ్మయ్య, జక్కు శ్రావణ్, రాముల కార్తిక్, కొట్టే మదు, మచ్చ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

చల్లా ఆశీర్వచనాలు

నవతెలంగాణ- మహదేవపూర్

మహాదేవపూర్ మండలం అంబట్‌పల్లి గ్రామానికి చెందిన నూనేటి లావణ్య-రాజేందర్ గార్ల వివాహం శుక్రవారం జరిగింది. నూతన వధూవరులను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, కాటారం సహకార బ్యాంకు చైర్మన్ చల్లా నారాయణ రెడ్డి హాజరై ఆశీర్వదించారు. కాటారం మాజీ జెడ్పిటిసి మల్లయ్యజంగ సమ్మయ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

అన్ లా ఫుల్ ప్రివెన్షల్ యాక్ట్‌ను ఉపసంబరించుకోవాలి

నవతెలంగాణ - శాయంపేట

బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా స్వాతంత్రం కోసం పోరాడిన భారతీయుల పైన అప్పటి పాలకులు అన్ లా ఫుల్ ప్రివెన్షల్ చట్ట ప్రకారం కేసులను అక్రమంగా పెట్టేవారని, 76 ఏళ్ల తర్వాత కూడా పాలకులు ఇదే చట్టాన్ని అమలుపరుస్తున్నారని వెంటనే ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని తెలంగాణ కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా కార్యదర్శి వంగరి సాంబయ్య శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశ పాలకులు ప్రజాస్వామ్య ముసుగులో అక్రమాలు, అన్యాయాలు, భూకబ్జాలు అనేక కుంభకోణాలు చేస్తూ, దేశ పౌరుల సంపదను, యావదాస్తిని అమ్ముతున్న పాలకవర్గాలు పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. పాలకవర్గాలు చేస్తున్న దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సమసమాజ స్థాపన కోసం, ప్రజాస్వామ్య హక్కుల కొరకు, కార్మికుల చట్టాల కోసం, పౌర హక్కుల కోసం ప్రజాస్వామ్యబద్ధంగా ప్రొఫెసర్ హరగోపాల్ లాంటి వ్యక్తులు పోరాటం చేస్తుంటే 149 మంది పౌర హక్కులపై మాట్లాడుతున్న మేధావులపై అన్ లా ఫుల్ ప్రివెన్షల్ యాక్ట్ పేరుతో కేసులు పెట్టడం రాచరిక పాలనను తలపిస్తుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వారిపై పెట్టిన కేసులను బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఔట్ సోర్సింగ్ జాబ్స్‌కు దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ-సుబేదారి

చైల్డ్ హెల్ప్ లైన్‌లో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన నియామకపు ప్రక్రియకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. హనుమకొండ జిల్లాలో చైల్డ్ హెల్ప్ లైన్ నందు ఔట్ సోర్సింగ్ బేసిస్ లో మార్చి 2026 వరకు పని చేయుటకు అర్హతలు కలిగిన వారు ఈ నెల 22 సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను హనుమకొండ కలెక్టరేట్ లోని జిల్లా సంక్షేమ అధికారి మహిళా శిశు వికలాంగుల, వయోవృద్ధుల శాఖ కార్యాలయం జి1 ,జి2 బ్లాక్స్ లో అన్ని ధవ పత్రాలను గెజిటెడ్ ఆఫీసరుతో ధవీకరణ చేయించి సమర్పించాలని తెలిపారు. పూర్తి వివరాలకు కలెక్టరేట్ కార్యాలయంలోని సంబంధిత కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

హెడ్ పోస్టామాస్టర్ మొగిలి

నవతెలంగాణ - పరకాల

రాష్ట్ర ప్రభుత్వం స్థానిక పోస్ట్ ఆఫీస్ లో ఆధార్ సెంటర్ ను శుక్రవారం ప్రారంభించినట్లు పోస్ట్ మాస్టర్ మొగిలి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోస్ట్ ఆఫీస్ లో ఆధార్ సెంటర్ ను ప్రారంభించడం జరిగిందని, కొత్త ఆధార్ కార్డు నమోదు, పేరు మార్పు, అడ్రస్ మార్పు, సెల్ఫోన్ నంబర్ మార్పును సంబంధిత తగిన ద్రోపత్రాలను తీసుకొచ్చి మార్చుకోవచ్చని అన్నారు. ఆధార్ కార్డు మార్పుల సేవలకు గాను 50 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టామాస్టర్ మొగిలి తెలిపారు .

గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-మహదేవపూర్

మేడ్చల్ జిల్లా నుండి కాళేశ్వరం వచ్చి గోదావరిలో దూకి శుక్రవారం ఓ వ్యక్తీ ఆత్మహత్య చేసుకున్నడు. కాళేశ్వరం ఎస్ఐలక్ష్మణరావు తెలిపిన ప్రకారం శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం అంతర్ రాష్ట్ర బ్రిడ్జ్ వద్ద గోదావరిలో శవం ఉన్నదని సమాచారం వచ్చింది. సంఘటన స్థలానికి వెళ్లి మృతున్ని గొదావరిలో నుండి స్థానిక జాలర్ల సహాయంతో వెలికి తీసి ఎంక్వైరీ చేయగా మృతుడు మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ, మేడిపల్లి గ్రామానికి చెందిన కృష్ణాపురం రమేష్ చంద్ర గుప్తా(68) గా గుర్తించామని తెలిపారు. పీర్జాదిగూడ లో సొంత కోచింగ్ సెంటర్ నడిపేవాడని,అప్పుల బాధతో జూన్ 13 న ఇంట్లో చెప్పకుండా వెళ్ళిపోయాడు. మృతుని కొడుకు శశి మోహన్ అంతర్ రాష్ట్ర బ్రిడ్జ్ వద్ద గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు .